సంపుటి: 44
సంచిక: 3

K. S. Reddy
01/10/87

ఫోన్ నెం:
64843

# అపరాధ పరిశోధన

## సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

ఏప్రెల్, 1987

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

# అపరాధ పరిశోధన పోటీ-223

## [ఫలితాలు]

ఫిబ్రవరి'87 నెల "అపరాధ పరిశోధన పోటీ-223" కి సరియైన సమాధానాలు:

1. ఇండియా.
2. దోపిడీలు.
3. పోస్టల్ రేట్ల పెంపు.
4. చిలక పలుకులు.
5. వాతావరణ కాలుష్యం.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలల పాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

1. శ్రీ సి. హెచ్. సంతోష్‌కుమార్, ఇంటి నెం: 20-6-51, హైదర్‌గూడ—500 264, వయా — బహదుర్‌పుర. (రంగారెడ్డి జిల్లా)
2. శ్రీ కె. నాగభూషణ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, దేవనహళ్ళి—562 110 (బెంగుళూరు జిల్లా)
3. శ్రీ వి. జగదీష్, 32 - శ్రీ కిషన్ కాలనీ, వరంగల్—506 002.
4. కుమారి టి. రాజేశ్వరీబాయి, c/o టి. శంకర్‌రావు, సౌకార్‌పేట, పామిడి—515 775.

# ఈ నెలలో...

## కథలు (మాస పత్రిక)


4. అపరంజి బొమ్మ—కె.బి.యస్. కుమార్

18. గుట్టు - రట్టు—వసుంధర

38. పొట్టి చెయ్యి—శివరామ్

52. ఆపద—ఎమ్. రాధిక

63. మృత్యుమార్గం—కె.వి.యస్ ఎన్. మూర్తి

78. మన చుట్టూ నేరస్థులు—జొన్నలగడ్డ రామలక్ష్మి

98. ప్రజ్ఞ—రాజశేఖరపాండె

112. సాహసం—వసుంధర

132. ముగ్ధ—సుంకరి రాంప్రసాద్

139. మరణయాత్ర—(సీరియల్) ప్రతాప రవిశంకర్


## నవలలు (సప్లిమెంట్)


3. కట్టువిడిచిన పట్టుచీర—వసుంధర

46. చావుదెబ్బ—కె.వి.వి. సత్యనారాయణరాజు

82. వజ్రకిరీటం—వి. యస్. రావ్

168. అన్వేషణ—(సీరియల్) వి.ఎస్. రావ్


ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

# అపరంజి బొమ్మ

కె. బి. యస్. కుమార్

అటూ ఇటూ చూసి నెమ్మదిగా పెట్టెలోకి అయిదు రూపాయల నోటు జారవిడిచాను. పెట్టెకి తాళం బిగించాను. తృప్తిగా ఫీలయ్యాను.

పెట్టెలో వున్న ముత్తాన్ని ఉజ్జాయింపుగా ఊహ

ల్లోనే లెక్కించాను. కమీసం ఎనిమిది వందలుంటుంది, కేవలం 'ఈ బాపతే.

"హోటల్ అనుపమ" ఈ వూళ్ళోని బి-క్లాస్ హోటల్స్‌లో మొదటిది. నేనందులో క్యాషియర్ని.

మా ప్రొప్రయిటరు వినాయకభట్టు చాల మంచివాడు. నే నిదివర్లో ఎన్నో హోటల్సులో సప్లయిర్‌గా పనిచేశాను. ఎందరో ఓనర్సు వద్ద మేకవుగా మెలిగాను.

కాని ఎవ్వరివద్దా యింతమంచితనాన్ని చూళ్ళేదు.

ఆయనలోని మంచితనానికి కారణం—ఆయనకూడ ఒకప్పుడు సప్లయిరేనట:

సప్లయిర్లకుండే బాధలన్నీ వివరిస్తే తడిసిమోపెడవుతాయి. స్వేచ్ఛ వుండదు. ఎవర్తోనైనా మనసుదీరా మాట్లాడుకోటానికి కవకాశం వుండదు. స్నేహితు లెక్కువైతే రేప్పొద్దున వాళ్ళు టిఫిన్ చెయ్యటానికొచ్చినప్పుడు అయిదు రూపాయల తిండి తింటే రెండ్రూపాయలే బిల్ వేస్తాడేమోనని షావుకారుకి అనుమానం వస్తుంది.

డ్యూటీ చేస్తున్నంత సేపూ నిల్చునే పనిచెయ్యాలి. సాధారణంగా ఒక్కో సప్లయిర్‌కీ నాలుగునుండి ఆరు టేబుల్సు అప్పగిస్తారు. అంటే పదహారునుండి యిరవై నాలుగు మంది కస్టమర్సు ఒక్కో సప్లయిర్ పరిధిలోకి వస్తారన్నమాట.

కిచెన్‌లో నేల ఎప్పుడూ తడిగా ఉంటుంది. అక్కడికీ యిక్కడికీ నడవటంలో పాదాలు తేమకి తడవటంతో వ్రేళ్ళమధ్య పగుళ్ళు ఎప్పుడూ సలుపుతూ వుంటాయి. చేతులూ అంతే! కస్టమర్సుకి మంచినీళ్ళు పెట్టినప్పుడూ పావుగంట కోసారి 'ట్రే'ని కడిగినప్పుడూ చేతివ్రేళ్ళు చవికిపోతాయి. ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల అప్పుడప్పుడూ

పుళ్ళుకూడ పడుతూంటాయి. వాటికి మందు వేసుకోవాలి.

ఆ రెండుమూడు రోజులూ సప్లయ్ చెయ్యటానికి వీల్లేదు. మందులు తీసుకుంటూ లోపలి పనులు చూసుకోవాలి. అంటే కూరగాయలు తరిగించటం, బియ్యంలో రాళ్ళేరించటం, రుబ్బే మిషన్‌వద్ద కాచుకొని వుండటం లాంటివి. చేతులు బాగయ్యాక మళ్ళీ మామూలే.

కనీసం నాలుగు టేబుల్సున్నా పదహారు మంది కస్టమర్లు! సగటున ప్రతి రెండు నిమిషాలకీ క్రొత్త కస్టమర్ వస్తుంటాడు. మంచినీళ్ళు అందించి ఏం కావాలో అడగాలి. చివరగా కాఫీయో టీయో అందించాలి. బిల్ మాస్టర్‌వద్ద కెళ్ళి బిల్ వేయించుకొనొచ్చి కస్టమర్‌కివ్వాలి. ఈలోగా మరో కస్టమరు ఫ్రెష్‌గా కూచునుంటాడు! మళ్ళీ వాణ్ణి పలకరించటం కోసం సాగాలి.

ఇలా ఎనిమిది గంటలపాటు వరసగా చేస్తే మూడు గంటలపాటు రెస్టు దొరుకుతుంది. ఆ మధ్యకాలంలో గెడ్డం గీక్కోటం, స్నానం చెయ్యటం, బట్టలుతుక్కోటం వగైరాలకి పోను మిగిలే సమయం ఎంత? మళ్ళీ సాయంత్రం షిఫ్టు!

రాత్రి తొమ్మిదిన్నరకి హోటళ్ళు మూస్తారు. క్లీనర్లు కుర్చీలు టేబుల్స్‌పై ఎత్తిపెట్టి క్రిందంతా తుడుస్తారు. ఈలోగా సప్లయిర్సు శుభ్రపర్చబడిన కాఫీ గ్లాసులూ సాసర్లూ వాటర్ టంబ్లర్సూ స్పూనులూ చెట్నీ గిన్నెలూ ప్లేట్సూ కవుంట్ చేసుకొని లెక్క సరిజూసుకోవాలి. ఇవన్నీ పూర్తయేసరికి కనీసం పదకొండవుతుంది. బతుకు జీవుడా అనుకొని నడుం వాలిస్తే జీవి ఎటుపోతుందో....

హోటల్లో చేరిన రెండు సంవత్సరాలకి నాకు సూపర్వైజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు భట్టుగారు. వున్న

బాధ్యతలు కొన్ని తగ్గి కొత్త బాధ్యతలు కొన్ని పుట్టు కొచ్చాయి.

ఇప్పుడు ఉదయంపూట నేను ఇతర సప్లయిర్స్ని పర్యవేక్షిస్తున్నాను. ఎవరైనా క్లీనరు టేబుల్ క్లీన్ చెయ్యకుండా అలా నిలబడిపోతే వాణ్ని గద్దించి మరీ పని చేయిస్తున్నాను. తిండితిని బిల్లెగ్గొట్టిపోయే మహానుభావుల్ని పట్టుకోవటంకోసం హోటల్ సింహద్వారం వద్ద మాటు వేసి నుంచుంటున్నాను. చిల్లర నాణేలూ, చిల్లరనోట్లూ తీసుకురావటం కోసం బ్యాంకులకి తిరుగుతున్నాను. కరెంటుబిల్లూ ఫోను బిల్లూ కట్టివస్తున్నాను. ప్రతిరోజూ సాయంత్రం నాలుగునుండి ఏడువరకూ క్యాష్లో కూర్చుంటున్నాను.

అదుగో—అలా కూచోవటం ప్రారంభించినప్పట్నుండే నా మెదడుని 'పురుగు' తొలచటం ప్రారంభించింది.

మాది 'బి-క్లాస్' హోటలు. ఉదయం ఎనిమిదినుండి పదివరకూ సాయంత్రం అయిదునుండి ఏడువరకూ సగటున గంటకి అయిదువందలు జరుగుతుంది బిజినెస్. మధ్యాన్నం ఒకటినుండి మూడువరకూ రెండొందలు. మిగతా సమయాల్లో మూడొందలూ అపైనా!

రోజుకి మూడొందలు చొప్పున నెల్రోజులూ జరిగితే ఖర్చులు పోను కనీసం రెండువేలు మిగుల్తుందనేది హోటల్ జీవితంలో నానుడి. ఆ లెక్కన మా హోటల్ ఎంత సంపాదిస్తుండాలి?

మా ఓనరు దొంగలెక్కలు వ్రాస్తున్నాడు. కొన్ని పనిచేసిన రోజుల్ని సెలవురోజులుగా మారుస్తున్నాడు. ఇన్కమ్టాక్సు ఎగ్గొట్టడానికి మార్గాలన్వేషిస్తున్నాడు. నేను ఆఫ్టరాల్ క్యాష్లోంచి అయిదురూపాయలు తీస్తే?

జీవనదిలోంచి బిందెడు నీళ్ళు తోడుకున్నంతే!!

నాకు ప్రస్తుతం కాఫీ టిఫిన్ భోజనం వగైరాలన్నీ జరిగిపోతూ నెలకి మూడొందలు జీతం లభిస్తున్నది. దుస్తులకోసం నెలకి వందరూపాయలు దాచుకుంటూ మిగతాది యింటికి పంపుతున్నాను.

నాకే దురలవాటూ లేదు.

నిజానికి నాకు అదనంగా పైకం సంపాదించాల్సిన అవసరం లేదు. కాని ఈ మధ్యే ఆ అవసరం వచ్చింది.

నాకు పెళ్ళీడొచ్చిందని ఆ అమ్మాయిని చూసేదాకా నాకు స్ఫురించలేదు.

ఇప్పుడు నేను ఉదయం పదకొండుకే డ్యూటీ దిగుతున్నాను.

సూపర్వైజర్లు లీజర్ అవర్సులో బైట తిరగొచ్చు.

చిల్లరకోసమూ మిగతా పనులకోసమూ ప్రతిరోజూ వెళ్ళాల్సిన అవసరంలేదు.

ఈ మూడింటినీ పురస్కరించుకొని అప్పుడప్పుడూ నేను పన్నెండుగంటల ఆట సినిమాలు చూస్తున్నాను.

ఒకనాడు ఓ థియేటర్ వద్ద అప్రయత్నంగా అటుకేసి చూసిన నాకు నన్నే గమనిస్తోన్న ఓ అమ్మాయి కన్పించింది. ఆమె వయసూ ఆకృతీ అందమూ నాకు నచ్చాయి.

ఆట వదిలాక ఫాలో చేశాను. ఇల్లు కనుక్కున్నాను. మధ్యమధ్యలో ఆమె వెనుదిరిగి నాకేసి చూసిన చూపులు నా హృదయంలో చక్కిలిగిలి పెట్టాయి.

రెస్టు దొరికినప్పుడల్లా ఆ ప్రాంతంలో తాచ్చాడుతుండేవాణ్ని.

ఓరోజు ఆమె చూస్తూండగా ఓ చీటీ నేలమీద జారవిడిచాను. మర్రోజు పార్కులో కూచున్నాను.

ఆమె వచ్చింది.

పేరు లీల. వయసు పందొమ్మిది. తల్లి లేదు. తండ్రి తాగుబోతు. అన్న తిరుగుబోతు. అక్కడా ఇక్కడా పనులు చేస్తూ కుటుంబాన్ని నడుపుతోంది. నాపై యిష్టం ఉంది. ఆ యిష్టం ప్రేమతో కూడుకున్నది.

ఇవీ—మామధ్య జరిగిన సంభాషణలోని ముఖ్యమైన విశేషాలు.

ఆమెతో స్నేహాన్ని కంటిన్యూ చెయ్యదల్చుకున్నా న్నేను.

అందుకు నేను అదనంగా సంపాదించాలి. ఇతరత్రా సంపాదించే మార్గాలు నాకు బొత్తిగా లేవు. జీతం పెంచ మంటే నా యజమాని వూరుకోడు.

కాని నేను సంపాదించి తీరాలి.

అందుకు నేనొక పద్ధతి నెన్నుకున్నాను. నేను క్యాష్‌లో కూచున్న సమయంలో ఓ అయిదు రూపాయల్ని ప్రతిరోజూ గల్లాపెట్టెలోంచి గల్లంతు చెయ్యడమే! గిరాకీలు మరీ అధికంగా ఉన్న రోజుల్లో అయితే పది రూపాయలు!

ఊట బావిలోంచి ఓ బిందెడు నీరు అదనంగా తోడుకున్నంత మాత్రాన 'తరుగు' సంభవించేదేమీ ఉండదు. ఇదీ అంతే!

అయితే నా ఆశకి పరిధంటూ గీచుకున్నా న్నేను. అంతకుమించి అధికంగా ఏనాడూ తాకలేదు.

నా యజమాని కింతవరకూ అనుమానం రాలేదు.

'నమ్మకంగా క్యాష్ కౌంటర్లో కూచోబెడితే నువ్వు చేస్తోన్న నిర్వాకం ఇదా?' అని నా మనసు ఎన్నోసార్లు ఎదురు తిరిగింది.

నిజమే. ఇది మోసమే!

ఎవరైతే మాత్రం!? నమ్మకం సంపాదించుకోందే మోసం ఎలా చెయ్యగలడు?

## 2

నేను దాచుకున్న మొత్తం వెయ్యిరూపాయలైంది. ఈ మొత్తంలో మా పెళ్ళి జరిగిపోతుంది. లీల అక్కడా ఇక్కడా పాచిపన్లు చెయ్యాల్సిన అగత్యం ఇకపై వుండదు. మా హోటల్లో బియ్యం, పప్పుధాన్యాల్లో రాళ్ళేరటానికీ కాయగూరలు తరగటానికీ పెద్ద పెద్ద పాత్రలు తోమటానికీ ఆడవాళ్ళున్నారు. భట్టుగార్ని బతిమాలితే ఏదో ఒకటి చూడకపోరు. యిద్దరం ఒక్కచోటే వుంటాము. ఆహార పానీయాలకి లోటుండదు.

ఈ విషయాలన్నీ లీలతో చెప్పినప్పుడు ఆమె మొహంలో రియాక్షనేమీ కనబళ్లేదు నాకు.

"మంది కొంపల్లో అంట్లు తోమే బదులు ఇది నయం కాదూ!" కాస్త విసురుగానే అన్నాను.

"నాకు మాత్రం యింటింటికీ వెళ్ళి పనులు చెయ్యటం సరదా అనుకున్నావా? నాబాధ అదికాదు...." బాధగా అంది లీల.

"మరేమిటి?"

"మనం మరికొంతకాలం ఆగాలేమో!"

"దేనికి?"

"యింకా పైకం సమకూరాలి."

"నావద్ద వెయ్యి రూపాయిలున్నాయి. మన పెళ్ళి కవి చాలవూ!?"

"నావద్ద దాదాపు రెండువేలున్నాయి. దాదాపు సంపవత్సరంన్నర నుండీ కష్టపడి పోగుచేస్తూ వస్తున్నాను.

కాని అది కూడ చాలదు."

నాకేమీ అర్థం కాలేదు.

అప్పుడు లీల నాకు అసలు విషయం చెప్పింది.

వాళ్ళ తాతలు, తాతల తాతలు మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవారు. దాదాపు యాభై సంవత్సరాల క్రితం యిక్కడికి వచ్చి సెటిలయ్యారు. ఆ ఏరియాలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో పెళ్ళితంతుకి ఓ ఆచారం వుంది.

మగపెళ్ళివారు పది తులాల బంగారంతో ఓ స్త్రీ మూర్తిని చేయించి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకునే సమయంలో ఆడపెళ్ళివారికి అర్పించాలి. ఆడపెళ్ళివారు కూడా అదే మోతాదులో పురుషాకారంలో బంగారు బొమ్మని చేయిస్తారు. అదే సమయంలో వాళ్ళు ఈ బొమ్మని మగపెళ్ళివారికి సమర్పిస్తారు.

అలా అపరంజి బొమ్మల మార్పిడి జరిగితేనే వాళ్ళిద్దరికీ పెళ్ళి కుదిరినట్టు లెక్క.

ఆ లెక్కన తన వంతు అపరంజి బొమ్మకోసం ఆమె కష్టపడి పైకాన్ని సమకూర్చుకుంటోంది.

"నాకా పట్టింపు లేమీలేవు. మా ఆచారం అది కాదుగా!" అన్నాను.

"మా అన్నయ్య ఒప్పుకోడుగా!" అంది లీల దిగులుగా.

"ఆల్ రైట్! ఒక పని చేద్దాం. మీరు బంగారు బొమ్మని చేయించి నాకే యివ్వాలికదా! నాకు బంగారు బొమ్మ అవసరంలేదు. అంతకు మించిన విలువగల మువ్వు నా సొంతమైతే చాలు. ఇత్తడిబొమ్మ చేయించు. బంగారు బొమ్మగా నేను దాన్ని స్వీకరించగలను" అన్నాను.

"నీ అంత విశాల హృదయం మా అన్నయ్యకి లేదు. నీ తరఫున బంగారు బొమ్మ కావాలంటాడు. పది తులాలంటే మాటలా? నువ్వు ఎప్పుడు సమకూర్చుకోవాలి? ఎప్పుడు మనం ఒకటి కావాలి?"

నేను పరధ్యానంగా మూలిగాను....

## 3

తల్లి ప్రోత్సాహంతో కూరగాయల దొంగతనాని కలవాటుపడ్డ తనయుడు గజదొంగగా మారాట్ట. ఓసారి పట్టుబడి ఉరిశిక్షని బహుమానంగా పొందాడట. తల్లి చీదరించుకోబోతే తల్లికి చీవాట్లుపెట్టి 'ఆనాడు నువ్వు చిరుదొంగతనాల్ని అసహ్యించుకొని మందలించివుంటే ఈనాటి ఈ కడుపుకోత వుండేది కాదుకదా!' అన్నాట్ట.

యిది వెనకెప్పుడో జరిగిన కథ.

నా కథ కూడ ఇలాగే జరగబోతోందా?

అవును జరగబోతోంది!

లీలని చూసిన మైకంలో మనసు ప్రోత్సహించటంతో నా యజమాని కళ్ళుగప్పి దొంగతనం చేస్తున్నాను. లీల పనిమనిషైనా నా ఆరాధ్య దేవతగా మారిపోయింది.

అమాయకత్వం, ముగ్ధత్వం మూర్తీభవించిన లీల లోకానికి పనిమనిషి కావచ్చుగాని నాక్కాదు. ఆమెను చూడందే ఒక్కరోజైనా గడపలేని స్థితి కొచ్చేశాను.

యిప్పుడామె చెప్పిన విషయాన్నిబట్టి చూస్తే ఈ జన్మలో నేను లీలని పొందలేనని స్పష్టంగా తెల్సిపోతోంది.

పది తులాల బంగారంతో ప్రతిమ!

దాదాపు పాతికవేలు!

ఎన్నడు సమకూర్చాలి?

ఒకణ్ని చంపినా హంతకుడే, పదిమందిని చంపినా హంతకుడే!! అలాగే అయిదు రూపాయలు తీసినా దొంగే! అపరంజి బొమ్మని కాజేసినా దొంగే!

అపరంజి బొమ్మ!!

హోటల్ అనుపమలో అడుగుపెట్టగానే చూపరులకి ఎదురుగా ఖరీదైన ఫ్రేములో క్రొత్తగా నిత్యమూ ధూప దీప నైవేద్యాలతో కళకళలాడుతూ కటాక్ష వీక్షణాలని ప్రసరింపజేస్తూ నా యజమానికి తరగని సిరుల్ని కురిపిస్తోన్న క్షీర సముద్ర రాజతనయ విగ్రహం;!

నా యజమాని సప్లయర్ నుండి యజమానిగా ఎదిగాక తొలి సంవత్సరం వచ్చిన లాభాన్ని మొత్తం వెచ్చించి ప్రత్యేక శ్రద్ధతో తయారుచేయించి అనంతమైన భక్తితో నిత్యమూ కొలిచే లక్ష్మీదేవి ప్రతిమ!

....చేజిక్కించుకుంటే!!??

వెన్నులో జలదరింపు!!

అనుమానం!!!

ఒకవేళ-ఈ విగ్రహం కోసమే లీల తనని పరిచయం చేసుకొని - నన్ను ప్రేమించినట్టు నాటకమాడుతూ - చేజిక్కించుకున్నాక వుడాయిస్తుందా!?

ఛఛ....అర్థంలేని అనుమానం. దాదాపు అయిదు మాసాల పరిచయం, స్నేహం, ప్రణయంలో లీల ఒక్కసారైనా హోటల్‌వైపు రావటంకాని విగ్రహాన్ని చూడటం కాని జరగలేదు. అమాయకత్వమూ ముగ్ధత్వమూ ప్రేమ, లాలన తప్ప లీలలో మరే భావమూ నా కంటబడలేదు అనేక విధాల పరీక్షచేసినా. అలాంటి లీలని అనుమానించటం - నన్ను నేను అవమానించటమే!

నాకు లీల కావాలి. ఆమె ప్రేమ కావాలి.

4

మార్చి ఎండలు చల్లని రాత్రుల్ని ప్రసాదిస్తూండటంతో దాదాపు సప్లయర్లు క్లీనర్‌లు అందరూ బయట పడుకున్నారు. నలుగురు సూపర్‌వైజర్లమూ, సరుకు మాస్టరూ దోసె మాస్టరూ లోపల పడుకున్నాము.

నేను సాధారణంగా ఎండాకాలం ప్రవేశించగానే బయట పడుకోవటం ప్రారంభిస్తాను. 'జలుబు' వంకతో రెండ్రోజుల్నుండీ లోపలే పడుకుంటున్నాను.

కాలంకాని కాలంలో నాకు జలుబు చెయ్యటం కోసం రెండ్రోజుల క్రితం నేను వరసగా పదహారు ఐస్ క్రీములు తిన్నాను.

ఇవాళ సూపర్‌వైజర్లందరికీ రహస్యంగా నిద్రమాత్ర లిచ్చాను. మత్తుగా నిదరోతున్నారు. బయట పడుకున్న వాళ్ళు బడలికవల్ల ఆదమరచి నిదరోతున్నారు.

టైము చూశాను రెండు.

నెమ్మదిగా లేచాను.

గుండెలు దడ దడ మంటున్నాయి. వళ్ళంతా చిరు చెమటలు. కాళ్ళూ చేతులూ వణుకున్నాయి.

నేను సాహసం చెయ్యబోతున్నాను. నా యజమానికి ద్రోహం చెయ్యబోతున్నాను. మరో అరగంటలో ఈ హోటల్‌కీ నాకూ ఆ మాట కొస్తే ఈ వూరికీ నాకూ ఋణం తీరిపోబోతోంది.

ఇత్తడి బొమ్మ చేయించింది లీల. ఇది నా చేతిలో పడగానే తెల్లవారేవరకూ తలదాచుకుని - ఆరు గంటల ప్రాంతంలో చెక్కేస్తాం - కొన్ని వందలమైళ్ళ అవతలకి!

....చప్పుడు కాకుండా కుర్చీని యివతల వేసుకున్నాను. నెమ్మదిగా పైకెక్కాను. ఫ్రేమ్ చిలుకుని తప్పించి అద్దం

వున్న ఫ్రేముని నెమ్మదిగా పైకెత్తాను.

కంపిస్తోన్న చేతులతో అయిదంగుళాల పొడవున్న లక్ష్మీదేవి ప్రతిమని అందుకున్నాను. పైజామాజేబులోకి తోసేశాను. ఫ్రేమ్ దించాను. చిలకు బిగించాను.

కర్చీఫ్ తీసుకొని ఫ్రేముని అద్దాన్ని శుభ్రంగా తుడిచాను. కుర్చీ దిగి యధాస్థానంలో దాన్ని వుంచి దానిపై కూడ వ్రేలిముద్రలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాను.

ఎందుకైనా మంచిదని ఒక్కసారి అంతా పరికించాను. ఎండాకాలం కావటంతో కటకటాల రోలింగ్ షట్టర్ మాత్రమే దించారు. రోడ్డు నిర్మానుష్యంగా కన్పిస్తోంది. వర్కర్లు ఒక్కరూ లేవలేదు.

అయిదువరకూ లేవరని నాకు తెల్సు!

నా పక్కన కాస్త దూరంలో పడుకున్న దీనానాథ్ జేబులోంచి ధైర్యంగా షట్టర్‌కుండే తలుపులకి వేసిన తాళం తాలూకు 'కీ' తీసుకున్నాను. లక్ష్మీదేవి విగ్రహాన్ని ఒక్కసారి తడిమి తృప్తిగా నిట్టూర్చి బయటకి తీసి కళ్ళకద్దుకుని జేబులో వేసుకుని తలుపుల వైపుకి నెమ్మదిగా సాగిపోయాను.

## 5

ఆ యింట్లో యింకా లైట్లు వెలుగుతున్నాయి.

తలుపు తట్టబోయి సంభాషణ స్పష్టంగా విన్పించటంతో చెవులు రిక్కించాను.

"తెస్తాడంటావా?" లీల అన్న సందేహం!

"అయిదు మాసాల సావాసం! ప్రేమజబ్బు! ప్రాణాలకి సయితం తెగించడూ!" లీల సవాల్!!

"దాదాపు యాభయివేలు చేసే ప్రతిమ!! కళ్ళలో పొదిగిన వజ్రాలే పాతిక వేలు చేస్తాయి! పాచిక పారితే అదృ

ష్టమే! అన్నట్టు నీ సవాలే నిజమై నిలిస్తే - ఆ తర్వాత వాణ్ణేం చేద్దాం?"

"అందుకేగా కొత్త కత్తి కొన్నాను. జేబులో వుంచుకో! పొలిమేరలు దాటగానే ఫినిష్!!"

ఇక వినలేకపోయాను.

"మైగాడ్! ఎంత నాటకం? ఎంత వంచన? యిలాంటి రాక్షసినా నేను ప్రేమించింది? ఓ హంతకినా నేను వాంఛించింది? వీళ్ళిలా ఎందర్ని మోసం చేశారో! ఎందర్ని వంచించారో! ఎందర్ని చంపారో!

కాస్త ముందుగానో ఆలస్యంగానో వచ్చుంటే యీ సంభాషణ నా చెవిని పడేదా? మరికొన్ని గంటల్లో నా శరీరం శవమై వూరి బయట దొర్లిపోయి వుండేది కదా?

నేను పరిగెడుతున్నాను. కళ్ళలో నీళ్ళు! హృదయం నిండా ఆవేదన! కడలిని మించిన పశ్చాత్తాపం!

ఆ విగ్రహాన్ని తీసుకొని నే నొక్కణ్ణే ఉడాయించేంత ధైర్యం నాలో లేదు. యిప్పటివరకూ చేసిన పాపం చాలు! నా స్థానాన్ని నేను నిలబెట్టుకోవాలి. ఈ అపరంజి బొమ్మని యథాస్థానంలో పెట్టెయ్యాలి. రోజుకి అయిదు రూపాయలు చొప్పున నా అక్రమ సంపాదనని గల్లా పెట్టెలో కలిపెయ్యాలి!!

ఇంకా ఎవ్వరూ నిద్ర లేచివుండరు. బీటుకానిస్టేబుల్స్ కూడ ఎప్పుడో నాలుగు తర్వాత కాని రారు. ఆ ప్రాంతంలో ఆరు గంటలగ్గాని జన సంచారం ప్రారంభం కాదు.

పరుగులాంటి వేగంతో నడుస్తున్నాను. అదృష్టంకొద్దీ కుక్కలు వెంటబడలేదు. టైం మూడున్నర కావస్తూంటుంది.

దూరం నుండి ఓరగా చూశాను. హోటల్ ముఖ ద్వారం వద్ద ప్రశాంతంగా వుంది.

థాంక్ గాడ్ అనుకుని నెమ్మదిగా లోపలికి ప్రవేశించాను.

సరిగ్గా ప్రతిమని యథాస్థానంలో పెట్టబోతుండగా ఒక సప్లయర్ 'బాబోయ్ తేలు!' అని గావుకేకవేస్తూ లేచాడు. ఆ కంగారులో మరికొందరికి నిద్రాభంగమైంది. మరు నిమిషంలో వాళ్ళ దృష్టి నామీదికి మళ్ళింది.

కథ మారిపోయింది. మిగతా ముగ్గురు సూపర్‌వైజర్లు లేచారు. ఆ స్థితిలో నన్ను చూసి ఒక్క క్షణం కొయ్య బారిపోయారు. అంతే - మరుక్షణం నామీద పిడిగుద్దులు పడ్డాయి.

అనుమానంతో నా పెట్టె సోదాచేశాడు దీనానాథ్. వెయ్యి రూపాయలూ బయటపడ్డాయి.

మరోసారి క్లీనర్ల చేతులు సయితం నా శరీరంపయి నాట్యం చేశాయి.

దీనానాథ్ ఫోన్ కేసి నడిచాడు.

నాకథ ఇలా ముగుస్తుందని మాత్రం నేననుకోలేదు. □

---

## గోడ కుర్చీ!



# గుట్టు - రట్టు

## వసుంధర

సుజాత, పద్మ మ్యాట్నీ సినిమా చూసేక హోటల్లో టిఫను చేసి కాలి నడకన ఇంటికి బయలుదేరారు. ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఓ సందుదాకా వచ్చేక - "బాగా చీకటి పడింది. ఈ సందులోంచి పోదామా?" అంది పద్మ.

ఆ సందులోంచి వెళ్ళకపోతే ఓ కిలోమీటరు దూరం చుట్టి వెళ్ళాలి వాళ్ళు. అయితే ఆ సందు ప్రమాదకర మైనది.

ఆ సందులోనే ఉంటున్నాడు పులిరాజు.

పులిరాజా ఊళ్ళో పేరుమోసిన గూండా!

"ఇది పులిరాజు సందు" అంది సుజాత.

"ఎవరి సందయితే మనకెందుకు? కళ్ళు మూసి తెరిచే సరికి దాటిపోదాం" అంది పద్మ. సుజాత యింకా తట పటాయిస్తూంటే -"అయినా యిప్పుడు టైము ఏడు దాట లేదు. మనం సభ్యసమాజంలో ఉంటున్నామా - అడవిలో ఉంటున్నామా?" అంది పద్మ కాస్త చిరాగ్గా.

"సరే - పద!" అంది సుజాత.

ఇద్దరూ సందులో ప్రవేశించారు.

ఆ సందులో వీధి దీపాలు వెలగడం లేదు. మను షులు మసలడం లేదు.

ఆడపిల్లలిద్దరికీ గుండెలు కాస్త చెదిరాయి. అయినా మొండిగా ముందడుగు వేశారు.

సందు సగంలోకి వెళ్ళేసరికి వాళ్ళమీద బ్యాటరీలైటు కాంతి పడింది.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

అరుగుమీంచి ఉరికాడు పులిరాజు - పులి లేడిమీదకు దూకినట్లే!

పద్మ అతణ్ణి చూసింది.

మనిషి సన్నగా నాజూగ్గా పొడవుగా ఉన్నాడు. రంగు నలుపు. అయినా నల్లటి మీసాల కతడి ముఖంలో విశిష్టత ఉంది.

"మనిషి పులి అంత సొగసుగానూ ఉన్నాడు. పులిరాజే

అయుంటాడు" అనుకుంది పద్మ.

సుజాత బెదురు కళ్ళతో అతణ్ణి చూస్తోంది.

"ఎవరు మీరు?" అన్నాడు పులిరాజు.

పులి గాండ్రించినట్లే ఉంది అతడి మాట.

"నా పేరు పద్మ. ఈమె నా స్నేహితురాలు సుజాత. ఇద్దరం సినిమా చూసి ఇంటికి వెడుతున్నాం. ఇది కాస్త దగ్గరదారి...." అంది పద్మ.

పులిరాజిద్దర్నీ చూశాడు మరోసారి. అప్పుడు చటుక్కున చేయిజాపి సుజాత చేయి పట్టుకుని - "పద్మా! నువ్వెళ్ళిపో - సుజాత కాసేపొయ్యాక వస్తుంది" అన్నాడు.

అప్పుడే సుజాత కళ్ళలోకి నీళ్ళు వచ్చేశాయి.

"మేమిద్దరం కలిసే వెడతాం" అంది పద్మ.

పులిరాజు కళ్ళెర్ర బడ్డాయి - "నా పేరు పులిరాజు. తెలుసా?"

"తెలియదు. నీ పేరు పులిరాజయితే నాకేం?"

"ఈ ఊళ్ళో గొప్ప గొప్పవాళ్ళే నా పేరుకు బెదురుతారు. ఈ సందులో అయితే నాకెదురులేదు...."అన్నాడు పులిరాజు.

"నీ ప్రతాపం ఆడపిల్లలమీదేనా?" అంది పద్మ.

పులిరాజు కోపంగా - "అట్టే వాగకు" అన్నాడు.

"సందులోకి వచ్చిన ఆడపిల్లల చేయి పట్టుకోవడం ప్రతాపం కాదు. చేతనయితే సాటి మగాణ్ణెదిరించు" అంది పద్మ.

సుజాత పులిరాజు పట్టుకున్న చేయి విడిపించుకోకుండా రెండో చేత్తో కళ్ళనీళ్ళు తుడుచుకుంటోంది.

"నాకు సాటివచ్చే మగాడీ ఊళ్ళోలేదు...," అన్నాడు పులిరాజు.

"ఉంటే ఏం చేస్తావు?"

"ఏదో చేయాల్సిన అవసరం నాకేమిటి? నాకుండాల్సిన పేరు నాకుండనే ఉంది...." అన్నాడు పులిరాజు.

"నా స్నేహితురాలి చేయి వదిలిపెట్టు" అంది పద్మ.

పులిరాజు తన రెండో చేత్తో మీసం మెలేసి-"నువ్వు ఇంటికి వెళ్ళు. నీకు అరగంట టైమిస్తున్నాను. ఈలోగా నన్నెదిరించే మగాణ్ణి తీసుకురా. అంతవరకూ నీ సుజాతను నేనేమీ చేయను. అరగంటలోగా నువ్వెవరినీ తీసుకుని రాకపోతే ఈ పిల్లను నేనో గంటసేపుంచుకుని పంపేస్తాను...." అన్నాడు.

అప్పటికి సుజాత తమాయించుకుని - "ప్లీజ్ నన్ను వదిలిపెట్టు" అంది.

"ఎలా వదిలిపెడతాను! రసగుల్లాలా ఎంతో బాగున్నావు...." అన్నాడు పులిరాజు.

"పులిరాజూ! మమ్మల్ని వెళ్ళిపోనీయ్...." అంది పద్మ.

"మీకు అరగంట గడువిచ్చాను. అప్పుడే ఒక నిముషం అయిపోయింది" అన్నాడు పులిరాజు.

పద్మ యింకా ఏదో అనబోగా అతడామె నొక్క తోపు తోసి సుజాతను చరచరా తనింట్లోకి లాక్కుని వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

పద్మ తమాయించుకుని తలుపు దగ్గరకు పరుగెత్తింది. దబదబా బాదింది.

లోపల్నుంచి - "టైము వృధాచేసుకోకు. అరగంటకు ఒక్క నిముషం కూడా యివ్వలేను నేను...." అన్నాడు పులిరాజు.

ఆ గొంతు పులిగాండ్రింపులా ఉంది.

పద్మ యిక జాప్యం చేయలేదు. ఆమె పరుగు లంకించుకుంది.

## 2

రంగనాథం ఆరోగ్యం బాగా లేదు. జ్వరం, దగ్గు, ఆయాసం ...

అప్పుడే డాక్టరు చూసి వెళ్ళాడు. ఫరవాలేదన్నాడు.

"రేపే అమ్మాయికి పెళ్ళివారొస్తున్నారు. ఈయన వరస చూస్తే యిలాగుంది" అని నిట్టూర్చింది రంగనాథం భార్య జానకి.

"బంగారు పడకమ్మా - అన్నింటికీ నేనున్నాగా" అన్నాడు విశ్వం.

జానకి కొడుకు వంక చూసి - "పైమప్పుడే ఏడు దాటింది. సుజాత యింకా యింటికి రాలేదు" అంది.

"వస్తుందమ్మా - పద్మతో కలిసి వెళ్ళిందిగా—ఇద్దరూ హోటల్లో టిఫిను చేస్తేకానీ రారు...." అన్నాడు విశ్వం.

"అయినా ఈపాటికి రావాలి...."

"ఏ బజార్లో తిరుగుతున్నారో ఏమో...." అన్నాడు విశ్వం.

"నీ నిదానం బంగారుకానూ - నువ్వు దేనికీ కంగారు పడవు" అంది జానకి విసుగ్గా.

"నీ చేతుల్లో పెరిగినవాణ్ణి. నీకు నేను చెప్పగలనా? దేనికయినా కంగారుపడి మనం చేయగలిగేదేమీ ఉండదు. నిదానమే ప్రధానం. కాసేపట్లో చెల్లాయి వచ్చేస్తుంది చూడు...." అని అతడింకా ఏదో అంటూండగా అక్కడ పద్మ ప్రవేశించింది.

"అదిగో - పద్మ వచ్చింది" అన్నాడు విశ్వం. కానీ ఆమె ఆయాసంతో వగర్చుతూండటం చూసి ఆశ్చర్యపడి

"అదేంటి పద్మా! ఏం జరిగింది?" అన్నాడు.

పద్మ క్లుప్తంగా జరిగింది చెప్పి - "ఇప్పుడు మన మేదో ఒకటి చేయాలి" అంది.

జానకి కంగారుపడి శోకాలు మొదలెట్టింది.

"ఏం జరిగిందే?" అంటూ పక్క గదిలోంచి రంగ నాథం కేక పెట్టాడు.

"అమ్మా! నాన్నకారోగ్యం బాగాలేదు. నువ్వు గొడవ చేయకు. అసలు సంగతాయనకు తెలియనివ్వకు...." అన్నాడు విశ్వం.

"ఇప్పుడేం జరుగుతుంది!" అంది జానకి.

"ఏం జరిగిందే?" అన్నాడు రంగనాథం పక్క గది లోంచి.

"ఏమీలేదు నాన్నా - మీరు పడుకోండి" అన్నాడు విశ్వం.

"రేపే పెళ్ళి చూపులు. పిల్లదాని బ్రతుకన్యాయమై పోతుంది" అంది జానకి.

"ఏమీ అన్యాయం కాదు...." అన్నాడు విశ్వం.

"పులిరాజు నాకు అరగంట టైమిచ్చాడు. అప్పుడే పదినిమిషాలు దాటింది" అంది పద్మ కంగారుగా.

"పులిరాజును మనమేమీ చేయలేం. నువ్వు కూడా ఈ విషయ మెవ్వరికీ చెప్పి రగడ చేయకు. కాసేపట్లో సుజాత యింటికి వస్తుంది. ఎవ్వరూ ఏమీ జరగనట్లే ఊరుకుందాం. రేపు పెళ్ళి చూపుల్లో వరుడి కది నచ్చితే పెళ్ళి కూడా అయిపోతుంది" అన్నాడు విశ్వం.

"ఛీ...." అంది పద్మ.

"ఛీ అనకు. ఇలాంటి విషయాల్లో రొష్టుపడి ప్రయోజన ముండదు" అన్నాడు విశ్వం.

"ఏ నిదానం మండిపోనూ...." అంది జానకి.

పద్మ అక్కడ ఒక్క క్షణం కూడా ఆగకుండా పరుగెత్తింది.

# 3

"అరగంట కింక ఒక్క నిముషముంది...."అన్నాడు పులిరాజు.

"ప్లీజ్ - నన్ను వదిలిపెట్టు" అంది సుజాత.

"అరిగిపోయిన రికార్డులా అస్తమానూ ఒకే డైలాగు చెప్పకు. నా సందులో అడుగు పెట్టేక నాకు నచ్చిన ఆడది నాకు వశం కాకతప్పదు. అయినా ఇప్పుడిక్కడ నీకు ప్రమాదమేం జరగదు. మనం కాసేపు సరాదాగా ఇక్కడ గడుపుతాం."

"ప్లీజ్ - నన్ను వదిలిపెట్టు" అంది సుజాత మళ్ళీ.

"నిన్ను నేనెలా వదిలిపెడతాను! నిన్ను వదిలిపించుకునేవాళ్ళు రావాలి" అన్నాడు పులిరాజు నవ్వుతూ.

సరిగ్గా అప్పుడే తలుపులు దబదబ మోగాయి.

"ఎవరు?" అన్నాడు పులిరాజు.

"సుజాతను వదిలిపించుకుందుకు వచ్చాను" అన్నదో గొంతు.

పులిరాజు చటుక్కున లేచి నిలబడి తలుపు తీశాడు.

ఓ యువకు డక్కడ నిలబడి ఉన్నాడు. అతడు దృఢంగా ఉన్నాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు పులిరాజు.

"పద్మ నన్ను పిలిచింది" అన్నాడతడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు పులిరాజు మళ్ళీ.

"నాపేరు ప్రభాకర్" అన్నా డా యువకుడు.

అతడి వెనుకనుంచీ పద్మ ముందుకు వచ్చి "నిన్నేది

రించే మగాడొచ్చాడు. సుజాతను వదిలిపెట్టు" అంది.
"నేనెవర్నీ వదిలిపెట్టను. విడిపించుకోవాలి" అన్నాడు పులిరాజు. అతడి మాట పూర్తయ్యేసరికి ప్రభాకర్ కుడి చేయి ముందుకు సాగింది.
పులిరాజు కడుపులో పిడిగుద్దు పడింది.
అతడు చటుక్కున నేలమీద పడ్డాడు.
"పద్మా—నువ్వు సుజాతను తీసుకొని వెళ్ళు" అన్నాడతడు.
సుజాత చటుక్కున బయటకు వచ్చింది. పద్మ, ఆమె కలిసి అక్కణ్ణించి బయల్దేరారు.
"ఏం చేశాడు వాడు?" అంది పద్మ.
"ఏమీ చేయలేదు...." అంది సుజాత.
ఇద్దరొకర్నొకరు గుద్దుకుంటున్న చప్పుళ్ళు వినబడుతున్నాయి వారికి.
"ఫరవాలేదు. నిజంచెప్పు. నేనెవరకీ చెప్పనులే" అంది పద్మ.
"పద్మా—నీకు చాలా చాలా థాంక్స్-నేను తప్పించుకుని బైటపడతానునుకోలేదు. నా గుండెలింకా అదురుతున్నాయి...." అంది సుజాత.
"అదిసరే—ముందేం జరిగిందో చెప్పు" అంది పద్మ.
"వాడు నన్ను లోపలకు తీసుకుని వెళ్ళాడు. కుర్చీలో కూర్చోమన్నాడు. కూర్చున్నాను. నా అందాన్ని పొగిడాడు. నా శరీరంలో ఎక్కడెక్కడ ఆకర్షణ ఉందో చెప్పాడు. వాడి మాటలు నాకు నచ్చలేదు...." అంది సుజాత.
"ఏం మాట్లాడాడో చెప్పు...."
"ఛీ—అంతా సెక్సు...." అంది సుజాత.

"ఉత్త మాటలేనా?" అంది పద్మ.

"అరగంటదాకా వంటిమీద చేయి వేయనని మాటి చ్చాడు...."

"గూండాగాళ్ళకూడా నిదానముంటుందన్నమాట.... మీ అన్నయ్యకే ననుకున్నాను...." అంది పద్మ.

"మా అన్నయ్య కేమయింది?" అంది సుజాత.

జరిగింది చెప్పింది పద్మ.

సుజాత మౌనంగా వింది.

అప్పటి కిద్దరూ యిల్లు చేరుకున్నారు.

ఇంట్లో జానకి, విశ్వం వారిని చూసి ఎంతో సంతోషిం చారు. అఘాయిత్యమేమీ జరగలేదని జానకి బాగా సంబర పడింది. ఆమె కూతుర్ని వేరే గదిలోకి తీసుకుని వెళ్ళింది రహస్యంగా విశేషాలడిగి తెలుసుకుందామని.

"పద్మా! ఏం జరిగింది!" అన్నాడు విశ్వం.

"నువ్వు చేతకానివాడివని తెలిసింది గదా! ప్రభాకర్ దగ్గిరికి వెళ్లాను...." అంది పద్మ.

"ప్రభాకర్ అంటే? అనడిగాడు విశ్వం.

"నీకు తెలుసు...." అంది పద్మ.

విశ్వానికి తెలుసు.

పద్మ రంగనాధం బంధువులమ్మాయి. బియ్యే చదువు తోంది. వాళ్ళది పల్లెటూరుకావడంవల్ల రంగనాధం ఇంట్లో ఉండి చదువుకుంటోంది. తలిదండ్రులు బాగా ఉన్నవాళ్ళు' ఆమెకు బాగా డబ్బుంది. నెలకు అయిదారువందలైనా ఖర్చుపెడుతుంది.

పద్మనసలు హాస్టల్లో పెడదామనుకున్నారుతలిదండ్రులు. హాస్టల్లో భోజనం బాగుండదనీ—అక్కడ చెడుసావాసాలు పట్టే అపకాశముందనీ వారు భయపడ్డారు. రంగనాధం

వారికి దగ్గిర బంధువే కాక ఆయన కూతురు సుజాత, పద్మ ఒకే క్లాసు చదువుతున్నారు.

అన్నిటికీ మించి పద్మను విశ్వానికిచ్చి పెళ్ళిచేయాలని అటూ యిటూ కూడా అనుకుంటున్నారు. కానీ ఇద్దరివీ భిన్నధృవాలు.

ఒకే యింట్లో ఉంటే ఇద్దరికీ మధ్య అవగాహన, ఆకర్షణ ఏర్పడవచ్చునని యిరుపక్షాలవారూ అనుకున్నారు. అది పద్మకూ, విశ్వానికీ కూడా తెలుసు.

కానీ పద్మకు ప్రభాకర్‌తో పరిచయమైంది.

ప్రభాకర్ చురుకైన యువకుడు. ప్రైవేట్ కంపెనీలో నెలకు రెండువేలు జీతంమీద పనిచేస్తున్నాడు. అతడికి అయిన వారెవ్వరూ లేరు. ఒకసారి సినిమాహాలు దగ్గిర పద్మనెవరో కుర్రాళ్ళేడిపిస్తూంటే ప్రభాకర్ కలగజేసుకున్నాడు. ఒకణ్ని కొట్టాడుకూడా.

అప్పట్నించీ యిద్దరికీ పరిచయమయింది.

తరచుగా వారిరువురూ కలుసుకుంటూండేవారు.

ఇది ఇంట్లో తెలిసి జానకి పద్మను హెచ్చరించింది. పద్మ లెక్కచేయలేదు. దాంతో ఆమె తలిదండ్రులకీ విషయం తెలియబర్చడం జరిగింది. వాళ్ళు పద్మను మందలించి వెళ్ళారు. తర్వాతనుంచి పద్మ ప్రభాకర్ని కలుసుకొనటం తగ్గించింది.

"ప్రభాకర్నెందుకు కలుసుకున్నావు?"

"నీ చెల్లెల్ని రక్షించడానికి...."

"ఇది రక్షించడం అనిపించుకోదు. నాచెల్లెలు కాసేపు పులిరాజింట్లో ఉందన్నవిషయం ప్రభాకర్‌ద్వారా ఊరంతా ప్రచారమవుతుంది. దాని బ్రతుకు నాశనమవుతుంది...." అన్నాడు విశ్వం.

"నీ చెల్లెలు పులిరాజునుంచి రక్షించబడిందని నీకు సంతోషంగా లేదా?" అంది పద్మ.

"ప్రపంచంలో తప్పులెందరో చేస్తారు. తప్పుచేయడం తప్పుకాదు. తప్పును రహస్యంగా ఉంచుకోవటం తప్పు" అన్నాడు విశ్వం.

"అయితే ఇప్పుడు నువ్వు ప్రభాకర్ వస్తే థాంక్స్ చెప్పవా?"

"థాంక్సకంటే ముందు—రిక్వెస్టు చేస్తాను. మొత్తం విషయమంతా రహస్యంగా ఉంచమని!"

"నీకా శ్రమ లేదులే! నేను ముందే ప్రభాకర్‌కి చెప్పాను...."

పద్మ యింకా ఏదో అనబోతూండగా ఇంటిముందు మోటార్ సైకిల్ ఆగిన చప్పుడయింది.

"ప్రభాకర్ వచ్చినట్లున్నాడు...." అంది పద్మ.

విశ్వం తడబడ్డాడు. ఇబ్బందిగా లేచాడు.

పద్మ, విశ్వం గుమ్మంలోకి వెళ్ళేసరికి ప్రభాకర్ మెట్లెక్కుతున్నాడు. పద్మను చూసి — "ఏం జరిగిందో తెలుసా?" అన్నాడు.

"పులిరాజు కొత్త ప్రతిజ్ఞలేమైనా చేశాడా?" అంది పద్మ.

"నన్ను లోపలకు రానీయ్...." అన్నాడు ప్రభాకర్.

ముగ్గురూ లోపలకు వెళ్ళారు.

"ఏం జరిగింది?" అంది పద్మ.

"విశ్వంగారూ—మీ చెల్లెల్నొకసారి పిలవండి...."

"ఎందుకు?" అన్నాడు విశ్వం.

"నే నామెను రక్షించాను. ద్రౌపదిని శ్రీకృష్ణుడు దుశ్శాసనుణ్ణించి రక్షిస్తేనే అదో గొప్ప విశేషమయింది.

నేను మీ చెల్లాయిని పులిరాజునుంచి రక్షించాను. అది సామాన్య విశేషం కాదు...."

"అయితే?" అన్నాడు విశ్వం.

"ఆమె నాకు కనీసం థాంక్సయినా చెప్పుకోదా?"

అప్పుడే అక్కడకు వచ్చిన సుజాత ఆ మాటలువింది. ఆమె చటుక్కున ప్రభాకర్ని సమీపించి అతడి పాదాలకు నమస్కరించి—"మీకు థాంక్స్ చెప్పుకోడం కాదు. మీ ఫొటోను దేవుడికిలా పూజించుకుంటాను. మీరు నన్ను రాక్షసుడి బారినుండి కాపాడారు." అంది.

"మీ కోరిక తీరుతుంది. త్వరలోనే మీరు నాఫొటోకు మాల వేయవచ్చు." అన్నాడు ప్రభాకర్.

"అంటే?" అంది పద్మ.

"నేను పులిరాజును చంపేశాను...." అన్నాడు ప్రభాకర్.

ఒక్కసారి అక్కడున్నవారంతా ఉలిక్కిపడ్డారు.

"ఏమిటీ?" అంది పద్మ తేరుకుని.

"అప్పుడంతకుమించి వేరే దారిలేకపోయింది. నేను పులిరాజును చంపకపోతే—నా ప్రాణాలు పోయుండేవి. ఇద్దరిలో ఒకరు మాత్రమే మిగలాలన్నప్పుడు - నేనే మిగలడం నాకూ ప్రపంచానికీ కూడా మంచిది కదా—" అన్నాడు ప్రభాకర్.

"అయితే ఇప్పుడేం జరుగుతుంది?" అంది పద్మ.

"ఏం జరుగుతుందో నాకు తెలియదు. పోలీస్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభమయ్యేలోగా నేను స్వయంగా వెళ్ళి పోలీసులకు లొంగిపోవాలనుకుంటున్నాను...." అన్నాడు ప్రభాకర్.

విశ్వం కంగారుగా - "ఆ పని చేయకండి" అన్నాడు.

"భయపడకండి - నేను మీ చెల్లాయి గురించి పోలీసులకు చెప్పను" అన్నాడు ప్రభాకర్.

విశ్వం ఇబ్బందిగా నవ్వి - "అది కాదు. దీనికి వేరే ఉపాయమేమీ లేదా?" అన్నాడు.

"పులిరాజులాంటి వాణ్ణి చంపి తప్పుచేసినవాడిలా దాక్కోలేను. నేనేం చేశానో పోలీసులకు చెప్పుకుంటాను. అది నేరమో కాదో వాళ్ళు నిర్ణయిస్తారు...."

"హత్యచేస్తే నేరంకాదని వాళ్ళెలాగంటారు"? అన్నాడు విశ్వం.

"రాముడు రావణుణ్ణి చంపాడు. కృష్ణుడు కంసుణ్ణి చంపాడు. అవి హత్యలేనా?" అన్నాడు ప్రభాకర్.

"అవి హత్యలో కాదో నాకుతెలియదు. కానీ రాముడు, కృష్ణుడు మనకు దేవుళ్ళు-" అంది సుజాత.

"ఆమాట గుర్తుంచుకోండి - సెలవు" అని వెళ్ళిపోయాడు ప్రభాకర్.

## 4

"ప్రభాకర్ అరెస్టయ్యాడు. మనమేదైనా చేయాలి!" అంది పద్మ కంగారుగా.

"మనమేం చేయగలం?" అన్నాడు విశ్వం.

"లాయరు సీతారాంగార్ని కలుద్దాం."

"ఎందుకు?"

"క్రిమినల్ లాయరుగా ఆయనకి ఊళ్ళో ఎదురు లేదు...."

"కానీ మనకీ ప్రభాకర్‌కీ ఏమిటి సంబంధమని ఆయనడిగితే?"

పద్మ చిరాగ్గా అతడివంక చూసి - "నీకు కృతజ్ఞత లేదు" అంది.

"నేను కృతజ్ఞత లేనివాడినే అనుకో. కానీ ఆలోచన ఉన్నవాడిని. అందుకే నా చెల్లెలు తనదగ్గరుందని తెలిసినా పులిరాజుమీద ఆవేశం చెందలేదు. ఆవేశం చెంది ఏం ప్రయోజనం? పులిరాజు చేతిలో చావాలి. లేదా వాడిని చంపాలి. వాడిని చంపితే పోలీసులచేతిలో చావాలి. ఇదంతా ఆలోచించే నేను పులిరాజు జోలికి వెళ్ళకూడ దనుకున్నాను. నా చెల్లెలి జీవితం రట్టు కాకూడదని నే నావేశాన్ని కూడా అణచుకుంటే - ఇప్పుడు మళ్ళీ అది రట్టు చేయాలంటే——ప్రభాకర్‌వల్ల నాకు జరిగిన ఉపకార మేమిటి?" అన్నాడు విశ్వం.

"అంటే ఏమిటంటావ్?" అంది పద్మ.

"సుజాత పులిరాజు దగ్గర కాసేపుండి వచ్చిందనుకో. అదెవరికీ తెలియనంతకాలం ఏ బాధాలేదు. మన చుట్టూ ఉన్నవారిలో ఎంతమంది తప్పుచేశారో మనకేం తెలుసు? సుజాతను కాపాడ్డానికి వెళ్ళిన ప్రభాకర్ పులిరాజును చంపడం ద్వారా ఏం సాధించాడు?" అన్నాడు విశ్వం.

"ఛీ-నీతో మాట్లాడి లాభంలేదు. నా ప్రయత్నాలు నేను చేసుకుంటాను...." అంది పద్మ.

"పద్మా! ఈరోజు సుజాతకు పెళ్ళిచూపులు. నీ వింట్లో ఉండి అమ్మకు సహకరించాలి. ప్రభాకర్ గురించి మరిచిపో-" అన్నాడు విశ్వం.

"ఛీ - " అంది పద్మ మళ్ళీ.

ఆమె వెంటనే తనే లాయరు సీతారాం యింటికి వెళ్ళింది.

"ప్రభాకర్ గురించి నీకెందు కాసక్తి?" అన్నాడాయన.

"పులిరాజు దుర్మార్గుడు. ప్రభాకర్ వాణ్ణి చంపాడు."

"పులిరాజు దుర్మార్గుడే కావచ్చు. కానీ వాడికి కమ

లేశ్వర్ అండ వుంది. కమలేశ్వర్ చేతిలో ముగ్గురు ఎమ్మెల్యేలూ, ఇద్దరు ఎంపీలూ ఉన్నారు. పులిరాజు పోవ డంతో ఆయనకు కుడిభుజం పోయినట్లయింది. మరో మనిషి నాయన చేరదీయాలి. కానీ చూసి చూసి సమర్థు డెవడూ ఆయన దగ్గరకు రాడు. పులిరాజును చంపిన ప్రభాకర్ జైలుపాలై ఉరిశిక్షకు గురికావాలి. అప్పుడే కమ లేశ్వర్ విలువ పెరుగుతుంది. అందుకని ఆయన ప్రభాకర్ అంతం చూడాలనుకుంటున్నాడు...." అన్నాడు లాయరు సీతారాం.

"మనకు కమలేశ్వర్ ప్రసక్తి ఎందుకు? ప్రభాకర్ కేసు టేకప్ చేస్తే - మీకు ఫీజు విషయంలో నాదీ హామీ...." అంది పద్మ.

"ప్రభాకర్ నీ కేమవుతాడు?"

"ఏమీ కాదు...." అంది పద్మ. "అతడు నన్ను రెండుసార్లు రౌడీల బారినుండి కాపాడాడు...."

"చూడమ్మా - అలాంటి సెంటిమెంట్లు పెట్టుకోకు. రాజకీయాలు నీకు తెలియవు. ప్రభాకర్ని రక్షించడం ఎవరివల్లా కాదు. ఎందుకంటే కమలేశ్వర్ చెప్పగా నేను ప్రభాకర్ కి వ్యతిరేకంగా కేసు టేకప్ చేస్తున్నాను."

"మీరా? ప్రభాకర్ కి వ్యతిరేకంగా కేసు బలంగా ఉందిగా - ఇంకా మీవంటి లాయరు కూడా ఎందుకు?"

సీతారాం నవ్వి - "చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాలన్నది కమలేశ్వర్ సిద్ధాంతం. ఇది ప్రభాకర్ లాంటి వారికి హెచ్చరిక కావాలని ఆయన ఉద్దేశం. ఈ కేసు నేను టేకప్ చేస్తున్నానంటే పులిరాజుకు వ్యతిరేకంగా మరే లాయరు కేసు చేపట్టకూడదని పరోక్షమైన హెచ్చ రిక కూడా!" అన్నాడు.

"మనం సభ్యసమావేశంలో ఉంటున్నామా?" అంది పద్మ.

"మన సమాజంలో అధిక సంఖ్యాకులు సామాన్యులు. సామాన్యుల కాలోచనాశక్తి ఉండదు. ఆలోచించడానికి ప్రయత్నిస్తే సామాన్యుడి జీవితం దుర్భరమవుతుంది. నువ్వు ఆలోచించకు. దేశంలో ఎన్నో అన్యాయాలు జరుగుతున్నాయి. వాటిలో ఇదీ ఒకటి అనుకో-" అన్నాడు లాయరు సీతారాం.

"పోనీ - ఈ కేసు టేకప్ చేయగల మరో లాయర్ని మీరు నాకు సూచించగలరా?" అంది పద్మ.

సీతారాం క్షణం ఆలోచించి "ఈ ఊళ్ళో నా కెదురు నిలవగలవారు లేరనే చెప్పవచ్చు. కానీ నా కెదురు నిలవాలని ప్రయత్నించే ఆయన ప్రసాదరావు. నువ్వాయన దగ్గరకు వెడితే కేసు తీసుకుంటాడు. కానీ ఫీజు దండగ." అన్నాడు.

"ఆయన ఎడ్రసు చెప్పండి-" అంది పద్మ వెంటనే.

"ఎందుకు నీ కింత పట్టుదల?"

"ప్రభాకర్ మహామనీషి. అతడి ప్రాణాలు రక్షించడానికి ఏ ప్రయత్నమూ జరక్కపోతే అది సమాజానికే అపచారం. నా తృప్తికోసం నేను చేతనైన ప్రయత్నం చేస్తాను...." అంది పద్మ.

## 5

సుజాతకు పెళ్ళిచూపులయ్యాయి. పెళ్ళికూడా నిశ్చయమయింది.

పెళ్ళికింక మూడువారాల పైముందనగా శుభలేఖలు

కూడా అచ్చయ్యాయి.

సుజాత స్నేహితురాండ్రకు శుభలేఖలు పంచిపెట్ట డానికి తోడుగా పద్మను కూడా రమ్మంది.

"రేపైతే వస్తాను...." అంది పద్మ.

"ఈ రోజెందుకు రావు?" అంది సుజాత.

"ప్రభాకర్‌కి కోర్టులో ఈరోజే జడ్జిమెంట్!" అంది పద్మ.

సుజాత మాట్లాడలేదు.

"కోర్టుకి వెడదాం - నువ్వూ రాకూడదూ!" అంది పద్మ.

"నేను రాను...." అంది సుజాత.

"ఎందుకని?"

"నేను హంతకిని....అతడి చావుకి నేనే కారణం."

"ఈ కబుర్లు కట్టిపెట్టు. ఒక్కసారి కోర్టుకి రా—" అంది పద్మ.

"వచ్చి...."

"జడ్జిమెంట్ విను...."

"విని....?"

పద్మ చిరాగ్గా—"మీ అన్నా నువ్వూ ఒకేరకం—ఫక్తు స్వార్థపరురాలివి—" అంది.

"సామాన్యుడి స్వార్థం — ఎవర్నీ బాధించదు. సామాన్యుడు తిరగబడితే కోర్టు బోనెక్కాలి!" అంది సుజాత.

"మీ అన్నాచెల్లెళ్ళనుంచి నేను చాలా నేర్చుకోవాలి గానీ ఒక్కమాట....నువ్వు గనుక ఈరోజు కోర్టుకు రాక పోతే—జీవితంలో నీతో మాట్లాడను సరిగదా - నీ

చరిత్ర పత్రికల్లో టాంటాం వేయిస్తాను....” అంది పద్మ.

ఏమనుకుందో సుజాత కోర్టుకు వెళ్ళడానికి ఒప్పుకుంది.

కోర్టులో....

లాయర్ సీతారాం గంభీరంగా-“పులిరాజు గూండాగా పేరుబడి ఉండవచ్చు. కానీ అతడు నగరంలో అరాచకం సూచించిన సాక్ష్యంలేదు. అతడికీ ప్రభాకర్‌కీ పాత కక్ష లేవో ఉన్నాయి. అవీ విధంగా తీర్చుకున్నాడు ప్రభాకర్. కానీ ప్రభాకర్ ఈ నిజం ఒప్పుకోలేదు. ఓ అమ్మాయిని రక్షించడానికి తను ప్రాణాలకు తెగించి పులిరాజుతో పోరాడేనంటున్నాడు. అది నిజమే అయితే ప్రభాకర్‌ని మహనీయుడని అందరం కొనియాడతాం. ప్రమాదవశాత్తు పులిరాజును చంపడం జరిగిందని నమ్మి అతణ్ణి నిర్దోషిగా తీర్మానించేవాళ్ళం.

కానీ ఆ అమ్మాయెవరో ప్రభాకర్ చెప్పడంలేదు. ఆమె బ్రతుకు నడిబజారు పాలవడం తన కిష్టంలేదంటున్నాడు. ఈరోజుల్లో ఒక యువతి గుట్టు రట్టు కాకూడదని తన ప్రాణాలు త్యాగం చేసేటంత త్యాగశీలు లుంటారని నమ్మమని అతడూ, అతడి లాయరు ప్రసాదరావూ మనకు చెబుతున్నారు. కానీ అసలు నిజమేమిటంటే ప్రభాకర్ ఏ త్యాగమూ చేయడంలేదు. అతడు పులిరాజును పాత కక్షతో చంపాడు. పులిరాజుకు గూండా అన్న పేరుంది కదా అని కొత్తకథ అల్లాడు. అతడి కథలోని యువతి వాస్తవంలో లేదు. అంతా అతడి కల్పన. కాబట్టి....”

ఆయనింకా ఏదో అనబోతూంతగా సుజాత జనం లోంచీ లేచి ముందుకువెళ్ళి—."ప్రభాకర్ మాటలు కల్పన కాదు. నేనే అందుకు సాక్షిని. నాపేరు సుజాత...." అంది.

కోర్టులో ఒక్కసారి కలకలం రేగింది.

సుజాత బోనెక్కింది. తన కథ చెప్పింది.

లాయరు సీతారాం ఆగ్రహానికి కంతులేదు. ఆయన జీవితంలో ఇలాంటి పరాభవ మెరుగడు.

"ఇంతకాలం ఏం చేస్తున్నావు?" అనడిగా డాయన కోపంగా.

సుజాత అదోలా నవ్వి - "ఓ క్షణంక్రితం వరకూ నేను ప్రభాకర్ గురించి పట్టించుకోలేదు. కానీ అతడు కేవలం నాపేరు నలుగురులోకి రాకూడదన్న భావంతో— తన జీవితాన్నకారణంగా త్యాగం చేస్తుంటే - పంచిపెట్టాల్సిన శుభలేఖల్ని తగులబెట్టాల్సొస్తుందని తెలిసీ నేను ముందుకు వచ్చాను. పులిరాజును చంపినవాడు దోషిగా నిర్ణయించబడకూడదు. పులిరాజును చంపినవాడికి శిక్ష పడకూడదు. సామాన్యులకు పీడ విరగడచేసినవాడికి - సామాన్యుడి సాక్ష్యం కరువు కాకూడదు. ఆగిపోబోయే నా పెళ్ళి నీకోర్టు నిలబెట్టలేదు. నిలబెట్టాలనుకున్న ప్రభాకర్‌కి మాత్రం ఉరిశిక్ష వేయగలదు.

పులిరాజు తుచ్ఛుడు. నీచుడు. అదుపులేని మదగజం. వాడి పీడ విరగడైనందుకు మనమంతా సంతోషించాలి. ఈ విషయంలో ప్రభాకర్ చెప్పిందంతా నిజం. ఈ నిజం చెప్పినందుకు నేను జీవితాంతం పెళ్ళికాకున్నా భయపడను. నా ధైర్యం మరిందరు ప్రభాకర్‌లను సాహసికుల్నిచేసి -

మరెందరో అబలలను పెళ్ళికి భయపడకుండా చేయాలి."

కేసు స్వరూపమే మారిపోయింది.

పద్మ సుజాతను వీపు తట్టి మెచ్చుకుని - "నీలో మానవత్వముంది" అంది.

విశ్వం, జానకి కూడా సుజాతను మెచ్చుకున్నారు.

సుజాత పెళ్ళి ఆగిపోయింది.

ప్రభాకర్ కేసునుంచి తప్పించుకున్నాడు.

ఊళ్ళోని పులిరాజులిప్పుడతడంటే భయపడుతున్నారు.

ఆడపిల్లలే సందుల్లోంచైనా భయం లేకుండా తిరగ్గలుగుతున్నారు.

రవంత త్యాగం - ఒక్క మనిషి చేయగలిగితే సమాజంలో ఎంత మార్పు? □

---

## లేట్!?

"ఉషా ప్రింటింగ్ వర్క్స్."

అందమైన నియాన్ లైట్ల వెలుగులో మిలమిల లాడుతున్న బోర్డువంక కూడా చూడకుండా, వెస్పాకు స్టాండేసి, మెట్లవైపు పరిగెత్తాను.

"నమస్తే సర్!"

కానిస్టేబుల్ సెల్యూట్ చేసాడు.

పట్టించుకోకుండా లోపలికి నడిచాను.

ఎదురుగ్గా వచ్చాడు రెడ్డి.

అతని కళ్ళలో నీళ్ళు.

ఆశ్చర్యంగా చూసాను.

"ఏం జరిగింది?"

'రాక్షసుడని' రెడ్డికి పేరు - అది నేరస్థులకు.

పసిపిల్లాడి మనస్తత్వం - ఇది నా అభిప్రాయం.

ఎంతోమంది నేరస్థులకు శిక్ష పడటానికి కారకుడైనా, వాళ్ళ ఫ్యామిలీలకు 'కనీసావసరాలు' తీర్చే పనులు చూపించేవాడు. అంత మంచివాడు.

అతనికి దుఃఖం కలిగించేంత సంఘటన ఏం జరిగింది?

దగ్గరికి వడిచాను.

"వాట్ హేపెండ్?"

మౌనంగా ఎదుటనున్న రూమ్ వైపు చూపించాడు.

అటువైపు వెళ్ళాను.

'సెక్రటరీ!'

అనే బోర్డు వ్రేలాడుతున్న దా గదికి.

తలుపు తీసి, చూసాను.

మైగాడ్!

కళ్ళు చెదిరిపోయాయి.

ఓ పదహారేళ్ళ అమ్మాయి బోర్లపడిపోయుంది టేబుల్ మీద.

వీపుమీద కత్తి దిగుంది.

రక్తం చుక్కలు, చుక్కలుగా కారుతుంది.

సో! మర్డర్ జరిగి ఎంతోసేపు కాలేదన్నమాట.

హతే్య!

కావచ్చు. కానీ రెడ్డి కెందుకంత బాధ!

అర్థం కాలేదు.

రెడ్డివైపు చూసాను.

"ఆ! అమ్మాయి....ఎవరో కాదు. మా ప్రక్కింటి పాపే! తండ్రి చనిపోతే తల్లీ, కూతురు దిక్కులేని వాళ్ళయ్యారు. దగ్గరకు చేరదీసి, ఉద్యోగం ఇప్పించాను."

గాద్గదికంగా అన్నాడు రెడ్డి.

ఆవేశంగా పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

దారుణం. మహాదారుణం!

కడుపు కూటికోసం వచ్చిన అమ్మాయిని బలి తీసుకొన్న ఈ సంఘటన మహా దారుణం.

"పద రెడ్డీ! బాధ పడటంవలన ఒరిగేదేంలేదు. హంతకుడ్ని పట్టుకోవడమే నీ బాధను తగ్గిస్తుంది."

అంటూ రూమ్‌లోకెళ్ళి, పరీక్షగా చూశాను.

నిజానికి అది రూమ్‌కాదు. ఓ పెద్దరూమ్‌ను మూడుభాగాల పార్టిషన్ చేసారు పెద్ద పెద్ద కార్డుబోర్డులు ఉపయోగించి.

వాటికి ద్వారాలున్నాయి.

అంటే బయటకు కనపడకుండానే సెక్రటరీ రూమ్‌లోకి రావచ్చు ఆ ప్రక్క, ఈ ప్రక్క రూమ్‌వాళ్ళు. వాళ్ళకి ప్రవేశద్వారాలు ఉన్నాయి మళ్ళీ.

"ఈ ప్రక్కరూమ్‌లో...."

అర్థోక్తిగా అడిగాను రెడ్డిని.

"కుడిప్రక్కనుండేది ప్రొప్రైటర్ రూమ్. ఆయన పేరు ఉషాచలపతి. ఈప్రక్కది మేనేజర్ ప్రభాకర్‌ది. వాళ్ళిద్దరికీ రావడానికి అవకాశముందిగా?"

అంటూ అన్నాడతను.

"మరి....వాళ్ళని ప్రశ్నించలేదా?"

లేదన్నట్టు తలాడించాడు.

"రాధిక - అదే ఈ అమ్మాయి శవాన్ని చూడగానే ఏం తోచలేదు. ఇమ్మీడియట్‌గా నీకు ఫోన్ చేసానంతే!" అన్నాడు చిన్నగా.

"బ్రదర్! నువ్వెన్ని కేసులు పరిష్కరించావ్? ఈ కేసు నా కేసు. నువ్వు పరిష్కరించకపోతే...."

అంటూ కళ్ళు తుడుచుకొన్నాడు.

ఓదార్పుగా అతని భుజంతట్టి, రాధికవంక చూసాను.

పదహారేళ్ళ ఆ అమ్మాయి ముఖంలో ఇంకా పసితనపు ఛాయలు పోలేదు. కుందనపు బొమ్మలా ఉంది. చంప డానికి చేతులెలా వచ్చాయా? అన్పించే టట్టుంది.

చేయాల్సిన కార్యక్రమాలు చకచక చేస్తున్నారు పోలీస్ స్టాఫ్.

రాధిక ఎడంచేయి షార్ట్‌షాండ్ బుక్ మీదుంది. కుడి చేతిలో పెన్సిల్. దాని క్రింద వైట్ పేపర్!

అందుకొని చూచాను.

షార్ట్ హ్యాండ్‌లో ఏదో వ్రాసుంది.

రెడ్డి చేతికిచ్చి, దాన్ని చదివించమన్నాను. షార్ట్ హ్యాండ్ బుక్ తీసి గాలించాను.

ఏ ఇండికేషన్ లేదు.

హంతకుడు వెనుకనుంచి పొడిచి ఉంటాడు. అంటే ఆమెకేదో డిక్టేట్ చేస్తుండొచ్చు.

ఊహూ! కాదు.

మేనేజర్‌గానీ, ప్రొప్రైటర్‌గానీ వాళ్ళ, వాళ్ళ రూమ్‌లోకి పిలిపిస్తారు గానీ, ఆమె రూమ్‌లోనే, కూర్చొబెట్టి మరీ డిక్టేట్ చేయరు.

ముందు ఉషాచలపతిని, ప్రభాకర్‌ని కలిస్తే మంచిది అనుకొంటూ రూమ్‌బైటికి వచ్చాను.

## 2

రూమ్ ఎదుట సోఫాలో ఓ ఇద్దరు కూర్చుని ఉన్నారు.

ఒకతని వయసు పాతికేళ్ళుండొచ్చు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. చామనఛాయ అయినా అమితాబ్ క్రాఫ్‌తో బాగున్నాడు.

ప్రక్కన కూర్చొని ఉన్నతని వయస్సు దాదాపు అంతే అయినా, మనిషి మొఖంలో 'గాంభీర్యం' కన్పిస్తుంది. మీడియమ్ హైట్‌తో రింగుల జుట్టుతో లావుగా ఉన్నాడు.

నన్ను చూడగానే ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"నమస్తే సర్! నాపేరు ఉషాచలపతి. ఈ ప్రింటింగ్ ప్రెస్ నాదే...."

అన్నాడు మీడియమ్ హైట్ వ్యక్తి.

"ఈయన మా మేనేజర్ ప్రభాకర్. మా బంధువు కూడాను."

అంటూ ఆ సన్నపాటి వ్యక్తిని పరిచయంచేసాడు.

ఇద్దరివంక పరీక్షగా చూసి, సోఫాలో కూర్చున్నాను.

సిగరెట్ ప్యాకెట్ తీసి, వెలిగిస్తూ,

"ఏం జరిగిందో చెప్పండి?"

అన్నాను కూల్‌గా.

ఉషాచలపతి గొంతు సవరించుకొన్నాడు.

"ఎస్.ఐ. రెడ్డిగారు నాకు బాగా తెలుసండీ! ఆయన చెప్పగానే టైప్, షార్ట్‌హ్యాండ్ వచ్చు కనుక రాధికను చేర్చుకొన్నాను. చాలా మంచమ్మాయి.

"రోజూలానే నా దగ్గిర డిక్టేషన్ తీసుకొంది పదకొండు గంటలకి. నేను వెళ్ళిపోయాను. పన్నెండు గంటలకి

ఇంటికి ఫోనొచ్చిందండీ! వెంటనే వచ్చేశాను. చూస్తే...."

చకచక చెప్పాడతను.

"మీకు ఫోన్ చేసిందెవరు?"

"నేను సార్!"

అంటూ అందుకొన్నాడు ప్రభాకర్.

"కంపెనీకి సంబంధించిన లెటర్స్ కోసం రూమ్‌లోకి వచ్చాను. చూస్తునుగదా! రాధిక బోర్లపడి పోయి ఉంది. వీపుమీద కత్తి. వెంటనే పోలీసులకి, మా బాస్‌కు ఫోన్ చేశాను."

"ఐసీ! మీరు ఉదయం నుంచి ఎక్కడికీ కదల్లేదా?"

"లేదుసార్! బాస్ వెళ్ళిందాకా అతనిదగ్గరే ఉన్నాను. ఆ తరువాతే నా రూమ్ కొచ్చాను."

సీరియస్‌గా చూస్తూ,

"ఏ ద్వారం గుండా వచ్చారు? అప్పుడు రాధికేం చేస్తుంది?"

ఆ ప్రశ్నలో అంతరార్థం అర్థమైందతనికి.

"బాస్‌ని కారు దాక వదిలిపెట్టే నేను, వచ్చాను. పార్టిషన్ రూమ్ అయినా మూడు ద్వారాలున్నాయి చూడండి! నా రూమ్‌లోకి వెళ్ళాను."

అంటూ మేనేజర్ అని వ్రాసి ఉన్న రూమ్‌వైపు చూపాడు.

అంటే ఉషాచలపతిని హంతకుల లిస్టులో నుంచి తప్పిస్తే మిగిలేది ప్రభాకర్ మిగతా స్టాఫ్.

"ఉషాచలపతిగారూ! ఇంకా మీ స్టాఫ్ ఎవరన్నా ఉంటే పిలిపించండి!"

చిన్నగా నవ్వాడతను.

"మిగిలింది నా కారు డ్రైవర్, వాచ్‌మెన్‌లే! డ్రైవర్

నాతోనే వచ్చేసాడు. ఇక వాచ్‌మెన్‌ని పిలిపించ మంటారా?"

అంటూ అడిగాడు.

తలూపి, మేనేజర్ రూమ్‌వైపు నడిచాను ప్రైవసీ బాగుంటుంది కనుక.

ఓ ఐదు నిమిషాల తరువాత వాచ్‌మాన్ వచ్చాడు.

అతని వయసుకూడా పాతిక్కి మించలేదు. బలంగా దృఢంగా ఉన్నాడతను. చేసేది వాచ్‌మేన్ పోస్టే అయినా స్మార్టుగా ఉన్నాడతను.

ఏడ్చినట్టు కళ్ళు ఎర్రబడి ఉబ్బి, ఉన్నాయి.

"నమస్తే సార్!"

అంటూ రాగానే, కూర్చోమన్నాను.

"పర్లేదుసార్! చెప్పండి"

"చూడండీ...."

"నా పేరు కుమార్ సర్?"

చప్పున అన్నాడతను.

"ఐసీ! యూసీ కుమార్! రాధిక హత్యమీద నీ అభిప్రాయం ఏమిటి?"

తలదించుకొన్నా డతను.

"నాకు తెల్సు. రాధికను నువ్వు ప్రేమిస్తున్నావు కదూ!"

చీకట్లో బాణం, కరెక్టుగా తగిలింది.

తలూపాడతను అవునన్నట్టు.

"అయితే నిజంచెప్పు! రాధికను హత్య చేసిందెవరు?"

"ప్రభాకర్‌గారు సర్!"

వెంటనే అన్నాడు.

"అవును సార్! ప్రభాకర్‌గారు రెండు, మూడు సార్లు

రాధికను అడిగారుసర్! పెళ్ళి చేసుకుంటానని. కానీ ఆవిడ తిరస్కరించింది. నేనూ, తనూ క్లాస్‌మేట్స్ సర్! అందుకే నేనంటే ప్రేమ! అది సహించలేని ప్రభాకర్‌గారు నన్ను హెచ్చరించారు.

"కానీ, ఈ ఉద్యోగం కంటే రాధికంటే నా కిష్టం సర్! అందుకే అతన్ని కేర్ చేయలేదు. అతనే ఈ హత్య చేసుంటాడు సర్!"

అంటూ కన్నీళ్ళు తుడుచుకొన్నాడతను.

రాధిక మరణం అతన్ని బాగా కదిలించేసింది.

"బీ కూల్ కుమార్! నువ్వు ఉదయంనుంచి ఎక్కడికీ కదల్లేదా?"

"లేదుసార్! ఏడు గంటలనుంచి ఇక్కడే ఉన్నాను. ఆఫీసు బైట కూర్చొనుంటాను సర్! ప్రభాకర్‌గారు ఉషాచలపతిగారు వెళ్ళిన అర్ధగంట తరువాత అరుస్తూ బైటికొచ్చారు సర్! అప్పటికే రాధిక చనిపోయింది."

"అంతేగానీ ...నీకు రాధిక కేకలేం వినపడలేదా?"

"లేదు సార్!"

"సరే! యూ కెన్ గో!"

అనేసి మేనేజర్ని పంపమన్నాను.

ప్రభాకర్ రాగానే,

"కూర్చోండి."

అంటూ సిగరెట్ వెల్గించి,

"ప్రభాకర్ గారూ! రాధికను మీరు ప్రేమించారు కదూ!"

తలదించుకొని,

"అవును సార్। కానీ ఆవిడ్ని కుమార్ కూడా ప్రేమించాడట సర్! నా దగ్గిర అటెండర్ చేసేవాడూ, నేనూ

ఇద్దరం ఒకర్ని ప్రేమించడం....ఛ! ఛ! అందుకే రాధికను నేనేమి అడగదల్చుకోలేదు."

బ్లంట్‌గా చెప్పాడతను.

"లెటర్స్‌కోసం వచ్చానన్నారుగా! అంతకు మునుపు రాధిక కేకలేం వినపడలేదా మీకు....?"

"అదేసార్ విచిత్రం! నేను రూమ్‌లోకి వచ్చేసరికే రాధిక చనిపోయుంది. కానీ, రాధిక అరుపులేం వినపడ లేదు నాకు."

ఆశ్చర్యంగా చూశాను.

బహుశా రాధికను మత్తుమందిచ్చి,హత్యచేసుండొచ్చు. ఎనివే! ప్రభాకర్ హంతకు డనటానికి అవకాశం ఉందిగానీ, ఆధారం మటుకు లేదు.

"పోనీ, మేనేజరుగారూ! కుమార్ ఈ గదిలోకి రావటం మీరు చూశారా?"

"రాలేదు సార్!"

దృఢంగా చెప్పాడతను.

"నా రూమ్ ఎదుటనున్న కిటికీలో నుంచి చూస్తూనే ఉన్నాను సర్! 11 గంటలనుంచి కుమార్ తన సీటులో నుంచి కదల్లేదు సార్!"

సో! కుమార్ కూడా హంతకుడు కాదన్నమాట!

కానీ ఓ విషయమే ఆశ్చర్యంగా ఉంది!

ఉషాచలపతి హంతకుడు కాదు - దానికి సాక్ష్యం ప్రభాకర్, డ్రయివర్.

అలానే కుమార్ హంతకుడు కాదు - దీనికి సాక్ష్యం ప్రభాకరే!

మరి అతనికి తెలీదా?

ఎలిబీ లేనిది తనకేనని.

ఆలోచనల నుంచి తేరుకొంటూ రూమ్‌బైటికి వచ్చాను.

## 3

ఎదురుగ్గా రెడ్డొచ్చాడు.

"గురూ! షార్ట్‌హ్యాండ్‌లో వ్రాసుండేది 'ఉషాగారూ!' అని మాత్రమే!"

అంటూ చెప్పుకొచ్చాడు.

మామూలుగా ఏ కంపెనీ అయినా ఫ్రమ్ అడ్రస్‌తో లెటర్స్ ప్రారంభిస్తాయి.

అది సహజం!

కానీ "టూ ఉషా ప్రింటింగ్ వర్క్స్" అని ప్రారంభించాలి. అంతేగానీ 'ఉషాగారూ' అంటూ ప్రారంభించడం....

అంటే అది పర్సనల్‌గా రాస్తున్న ఉత్తరం కావచ్చు.

అయితే, రాధిక ఏం రాయబోయింది?

ఉషాచలపతికి డైరక్టుగా చెప్పలేక లెటర్ వ్రాసేంత విషయం ఏమిటి?

ఉషాచలపతిని పిల్చి అడిగాను.

"రాధికకు ఇక్కడేమన్నా ప్రాబ్లెమ్స్ ఉన్నాయా? లేక బాధ పడుతున్నట్టు కన్పించిందా?"

"లేదండీ!"

తల అడ్డంగా ఊపాడతను.

"ఆ అమ్మాయిని రెడ్డిగారు రెకమెండ్ చేశారు. ఆఫీసు పరంగా ఎటువంటి 'హరాస్‌మెంట్' లేదు. ఇక, వ్యక్తిగతంగా....నాకు తెలిసి ఎలాంటి ప్రాబ్లెమ్స్ లేవు."

సాలోచనగా చూసాను.

"పోనీ, ప్రభాకర్ మీద మీ అభిప్రాయం ఏమిటి?"

"ఆడపిచ్చి జాస్తే కానీ, రాధిక జోలి కెళ్ళేంత ధైర్యం మటుకు లేదు."

"కుమార్ గురించి?"

రెండు నిమిషాలు మాటాడలేదు.

తరువాత చిన్నగా,

"అతను చేరి, కొద్దికాలమే అయింది. అతన్ని గురించి నాకూ పెద్దగా అయిడియా లేదు."

రెడ్డి మౌనంగా వింటున్నాడు.

అతను మా సంభాషణా సారాంశాన్ని ఊహించ గలిగాడు. అతని దృష్టిలో హంతకుడు ప్రభాకరే నని నాకర్థమైంది.

"రెడ్డీ! ముందు ప్రభాకర్ని అరెస్టు చేయి! తరువాత చూద్దాం."

అంటూ రాధిక రూమ్ దగ్గరకు నడిచి, మొత్తం గాలించాను.

అనుమానాస్పదంగా ఏమీ దొరకలేదు—

డ్రాయర్ లో ఒక్క "అపరాధ పరిశోధన" తప్ప.

ఏముంది దాంట్లో?

ఎందుకయినా మంచిదని చకచక మొత్తం పేజీ పేజీ చూసాను.

"నథింగ్!"

పత్రికను చేతులో పట్టుకొని రూమ్‌లోనుంచి వచ్చాను.

అప్పటికే ప్రభాకరాన్ని అరెస్టుచేసి, నాకోసం చూస్తున్నాడు రెడ్డి.

"పదండి!"

అంటూ ముందుకు నడిచాను.

పాలిపోయిన మొఖంతో నిలబడి ఉన్న ఉషాచలపతి ముందు నుంచి నా వెన్పా దూసుకెళ్ళింది స్టేషన్ వైపు.

# 4

స్టేషన్ చేరాక —

అక్కడున్న కుర్చీలో కూలబడి సిగరెట్ వెలిగించాను.

ఎదురుగ్గా సెల్‌లో ప్రభాకర్!

అతను హంతకుడు కాదని అన్పిస్తున్నది.

నా భావాలు నాలోనే దాచుకొంటూ రెడ్డివయిపు చూసాను.

నిర్లిప్తంగా ఉన్నాడతను.

సిగరెట్ ఆఫర్ చేసాను.

తీసుకొంటూ అడిగాడు.

"బ్రదర్! నిజంగా ప్రభాకరే హంతకుడా?"

చిన్నగా నవ్వి.

"ఛాన్సెస్ అంతే! చూస్తాం! ఇతని అరెస్ట్‌తో హంతకులు బయట పడొచ్చుగా?"

అవునన్నట్టు తలూపి,

సిగరెట్ కాల్చడంలో నిమగ్నుడయ్యాడు.

కాలం పరిగెత్తసాగింది.

ఓ గంట తర్వాత అందింది పోస్టుమార్టమ్ రిపోర్టు.

దాన్ని చదవగానే ఆశ్చర్యంగా చూసాను.

"రెడ్డీ! రాధికకు మూడోనెల గర్భం.... ...."

"వ్వాట్! ఆ.... అమ్మాయి ...."

తడబాటుగా అన్నాడు.

"వయసు ప్రభావం రెడ్డీ! వదిలేయ్! హత్య జరిగింది పదకొండున్నర గంటలకి అని రిపోర్టు. దాన్నిబట్టి ప్రభాకరే హంతకుడా?"

ఏం మాటాడలేదు రెడ్డి.

చేతిలో వున్న 'అపన వంక పరీక్షగా చూసాను.

ఎన్నో కథలు!

ఎంత తెలివయిన హంతకుడయినా పొరబాటు చేయకుండా వుండలేడని చెప్పే కథలు.

మరి, ఈ కేసులో ఎక్కడుంది పొరబాటు?

లెటర్ రాస్తుంటే హత్య జరిగింది.

అది ప్రభాకర్ బెదిరింపు గురించా?

కుమార్‌తో తన ప్రేమ గురించా?

తన బాస్‌ను 'ఉషా' అని పిల్చేంత చనువు - ఆ పాయింట్ దగ్గర ఆగిపోయాయి ఆలోచనలు.

"అపరాధ పరిశోధన."

హంతకుడు ఎటువంటి పొరబాట్లు చేస్తాడో? డిటెక్టివ్‌ల ఆలోచనా విధానం ఎలా ఉండాలో క్లియర్‌గా, కళ్ళకు కట్టినట్టు చెపుతున్నదా పుస్తకం.

ప్రభాకర్ని పిల్చి,

"ఉషాచలపతికి, రాధికకు సంబంధా లున్నాయి కదూ?"

కఠినంగా అడిగాను.

మౌనంగా ఉండిపోయాడతను.

"రెడ్డీ! హంతకుడు ఎవరో తెల్సిపోయింది. ఉషాచలపతిని పిలిపించు."

రెడ్డికేం అర్థం కాలేదు.

అయినా ఉషాచలపతిని పిలిపించాడు.

అతను రాగానే,

"రండి! రాధికను ఎందుకు హత్య చేశారు?" అన్నాను.

అతని మొహం పాలిపోయింది.

"చూడండీ! షార్ట్‌హ్యాండ్ అంటే తెలుసా?"

తల దించికున్నా డతను.

"పొట్టి చెయ్యి?"

"అదుండేది మీకే కదూ?"

అతనికి కుడి చెయ్యి కంటే ఎడం చెయ్యి చిన్నది. అందుకే ఫుల్‌హాండ్స్ వేస్తాడతను.

చిన్నగా చెప్పడం మొదలెట్టాడు.

"రాధికను నేను ప్రేమించాను. సారీ! ప్రేమించినట్టు నటించి, అనుభవించేసాను. కడుపు రాగానే పెళ్ళి చేసుకుంటావా! రెడ్డిగారికి చెప్పమంటావా? అంటూ బెదిరించింది.

గత్యంతరం లేదు. పెళ్ళయిన నేను రాధికను ఎలా చేసుకోను! అందుకే వెళ్ళినట్టు నటించి, వెనుక ద్వారం గుండా వచ్చి హత్య చేసాను.

"మత్తుమందు చూపించడంవలన రాధిక అరవలేదు. కానీ, ప్రభాకర్ చూసాడు. అతని చెల్లెలే నా భార్య కనుక అతను చెప్పలేడని నాకు తెలుసు. కత్తిమీద వేలిముద్రలు లేకుండా గ్లవ్స్ వాడాను."

అంటూ చెప్పుకొచ్చాడు ఉషాచలపతి.

కఫ్స్ తీసి తగిలించాడు రెడ్డి. □

# ఆపద

## ఎమ్. రాధిక

మధ్యాన్నం పన్నెండు కావస్తూంది.

రాఘవ అప్పుడే భోజనం ముగించి, పడక కుర్చీలో చేరగిలబడి వారపత్రికను తిరగేయసాగాడు.

ఆయన సెక్రటేరియట్‌లో సెక్షనాఫీసరుగా పనిచేసి ఆ మధ్య రిటైరయ్యాడు. కొడుకులిద్దరూ ఉద్యోగరీత్యా దూరంగా ఉండడంతో హైదరాబాద్‌లోనే ఇల్లు కట్టుకుని భార్యతో కాలక్షేపం చేస్తున్నాడు.

రాఘవకి సంవత్సరం క్రితం ఎడమచేతికి పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చింది. కొంతకాలం మందులు వాడిన తర్వాత తగ్గింది కానీ ఎడమచెయ్యి అంతంత మాత్రమే ఉపయోగ పడుతుంది.

ఆయనభార్య ప్రభావతి ఎవరో చుట్టాలు పేరంటానికి రమ్మని పిలిస్తే, ఒక గంటలో వచ్చేస్తానని చెప్పి చిక్కడ పల్లి వెళ్ళింది. వెళ్ళేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్ళింది.

కంగారు పడనవసరంలేదనీ, సంతోషంగా పేరంటా నికి వెళ్ళి రమ్మని భార్యకు చెప్పాడు రాఘవ.

భార్య వెళ్ళాక పావుగంటకు దాహం వేస్తున్నట్లని పించి పక్కనే ఉన్న టీపాయ్ మీది గ్లాసును అందుకో బోయాడు రాఘవ.

అయితే ఒక్కసారిగా ఎడమచెయ్యి చచ్చుబడి పోయి నట్లయి అతని ప్రయత్నానికి సహకరించలేదు.

రాఘవ మొహం నిండా ముచ్చెమటలు కమ్మాయి.

మళ్ళీ స్ట్రోక్ రాబోతుందా? ఏం చెయ్యాలిప్పుడు??

ఆయన కూర్చున్న కుర్చీకి కొంచెం దూరంలో ఉంది టెలిఫోన్. అక్కడికి వెళ్ళి ప్రభావతికి ఫోన్‌చేస్తే ఇక దిగులుపడ నవసరంలేదు.

ఆ ఆలోచనరాగానే కుర్చీలోంచి లేచాడు రాఘవ. అయితే ఎడమకాలు కూడా చచ్చుబడి పోవటంతో పట్టు తప్పి వెనక్కుపడిపోయాడు.

మళ్ళీ మెల్లగా లేచి, ఎడమకాలు ఈడ్చుకుంటూ ఫోన్ దగ్గరకి నడవసాగాడు రాఘవ. అతని ఎడమ చెయ్యి విపరీతంగా వణుకుతోంది. కుడిచేత్తో దానిని పట్టుకున్నా లాభంలేక పోతోంది.

ఆ చేతిని టేబుల్‌కి ఆనించి కుడిచేత్తో రిసీవర్ తీసి టేబుల్ మీద వుంచి, చిక్కడపల్లి నెంబర్‌కు రింగ్ చేయ సాగాడు.

అవతల వేపు రింగవుతోంది కానీ ఎవరూ ఎత్తటం లేదు. 'బహుశా అందరూ కబుర్లలో మునిగి తేలు తున్నారేమో!' అనుకున్నాడు రాఘవ.

ఇంతలో ఎవరో ఫోనెత్తి 'హలో' అన్నారు.

ఉత్సాహంతో కంగారుతో ఏదో చెప్పబోయాడు రాఘవ. అయితే పెదాలు వంకరపోవడంతో నోట్లోంచి మాట పెగలడం లేదు. అతను 'హలో' అన్నమాట అవతలి వాళ్ళకు ఏదో జంతువు గురకలా వినిపించింది.

దాంతో మళ్ళా 'హలో హలో' అన్నారు. రాఘవ నోటినుంచి మళ్ళా గురక శబ్దం వెలువడటంతో వాళ్ళకి విసుగెత్తి ఫోన్ పెట్టేశారు.

ఒక్కసారిగా రాఘవను దిగులు, భయం ఆవరించాయి. దానికి తోడు చెయ్యి మరీ మొద్దుబారి పోసాగింది. ఎడమ కాలు పటుత్వాన్ని కోల్పోతుండటంతో రాఘవకి నిలబడ టానికే కష్టంగా ఉంది.

అతి కష్టంమీద అలాగే నించుని, మళ్ళీ ఆ నెంబర్‌కే రింగ్ చేయడం ప్రారంభించాడు.

ఈసారి తొందరగానే కనెక్షన్ దొరికింది. 'ప్రభావతి ఉందా?' అని అడిగాడు....కాదు....అడిగాననుకున్నాడు కానీ నాలిక మొద్దుబారి, మాటవంకర తిరగడంతో

నోట్లోంచి మాట రావడంలేదు....గురకలాంటి శబ్దంతప్ప.

ఫోన్ ఎత్తిన వ్యక్తికి విసుగేసింది 'బ్లడీక్రీచర్' అని సణుక్కుంటూ ఫోన్ పెట్టేశాడు. ఈసారి అలాంటి ఫోన్ కాల్స్ రాకుండా ఉండటానికి రిసీవర్ రెస్ట్ మీద నుంచి తీసి పక్కన పెట్టేసి వెళ్ళిపోయాడు.

ఇక్కడ రాఘవ పరిస్థితి దారుణంగా ఉంది. వళ్ళంతా చెమటలు పడుతున్నాయి. శరీరం పట్టుతప్పుతోంది. భార్య తిరిగి రావటానికి కనీసం రెండు మూడు గంటలు పట్టవచ్చు. చిక్కడపల్లికి బస్సులో వెళ్ళి రావటానికే గంటపైన పడుతుంది. కొంచెం సేపు కుర్చీలో పడుకుంటే బావుండననిపించింది. కానీ కూర్చుంటే మళ్ళా లేవగలడా తను?

రాఘవకి రానురాను భయం ఎక్కువవుతోంది. చివరికి ఎటువంటి సాయం అందక తను దిక్కులేని చావుచస్తాడా?

చావుమాట తలచుకోగానే అతని వళ్ళు జలదరించింది.

సరిగ్గా అదే సమయానికి అతనికి ఒక నెంబరు గుర్తుకు వచ్చింది.

100

అవును. పోలీస్ కంట్రోల్ రూమ్‌కి చేస్తే వాళ్ళ నుంచయినా హెల్ప్ పొందవచ్చు అనుకుని, ఆ నెంబర్‌కు రింగ్ చేయసాగాడు.

చేస్తూ మాట్లాడటానికి ప్రయత్నించసాగాడు. ఎంత ప్రయత్నించినా నోటినుంచి శబ్దాలే తప్ప మాట రావడం లేదు.

అయినా తన ప్రయత్నం మానలేదు రాఘవ.

2

పోలీస్ కంట్రోల్ రూమ్.

ఇనస్పెక్టర్ శ్రీకంఠరెడ్డి తన సీట్లో కూర్చుని ఏదో

పైలును తిరగేస్తున్నాడు.

అప్పుడే టేబుల్ మీదున్న ఫోన్ మోగసాగింది.

క్రెడిల్ మీంచి రిసీవర్ తీసుకుని "ఇనస్పెక్టర్ రెడ్డి హియర్" అన్నాడు.

అవతలివేపు నుంచి రిప్లయి ఏమీలేదు కానీ గురక లాంటి శబ్దం వినిపించింది.

శ్రీకంఠ రెడ్డి చెవుల్ని రిక్కించి విన్నాడు. అవతలి నుంచి ఎవరూ మాట్లాడటం లేదు. అయితే ఈసారి కొంచెం పెద్దగా శబ్దం వినిపించింది. పులి అరుపులా.

రిసీవర్ ని అలాగే చెవికి ఆనించుకుని కుర్చీలో వెనక్కివాలాడు. అతని పెదాలమీద చిరునవ్వు వెలిసింది.

శ్రీకంఠ రెడ్డి పోలీస్ డిపార్ట్ మెంటులో చేరి 12 ఏళ్ళయింది. స్ట్రిక్ట్ ఆఫీసర్ గా పేరు తెచ్చుకోవడంతో తన సర్వీసులో ఎన్నోసార్లు ఎన్నో రకాల బెదిరింపులు ఎదుర్కొన్నాడతను. కొంతమంది ఫోన్ చేసి మరీ చంపుతామని బెదిరించారు కూడా. అతను దేనికీ జడవలేదు. తన విధి నిర్వహణలో ఎలాంటి పొరపాటు చేయలేదు.

ఈ ఫోన్ కాల్ ని కూడా ఒక బెదిరింపులాగానే భావించి ఫోన్ పెట్టెయ్యబోయాడు.

అయితే మళ్ళీ పెద్దగా గురకలాంటి శబ్దం వినిపించింది. దాంతో పాటు ఎవరో గట్టిగా వూపిరి పీల్చలేక పీలుస్తున్న శబ్దం వినిపించింది శ్రీకంఠ రెడ్డికి.

వెంటనే పక్కనే ఉన్న యస్.ఐ నాగార్జున చేతికి రిసీవర్ ఇచ్చి, "నీకు ఏమి వినిపిస్తోందో చెప్పు" అన్నాడు రెడ్డి.

నాగార్జున రెండు క్షణాలసేపు శ్రద్ధగా ఆలకించాడు. తర్వాత రిసీవర్ మౌత్ మూసి, "సందేహంలేదు. అటు

పక్క ఎవరో ఆపదలో ఉన్నారు'' అన్నాడు.

శ్రీకంఠరెడ్డి ఫోన్ పెట్టేసి, కంట్రోల్ రూమ్ ఆపరేటర్‌కు రింగ్ చేసి ''ఇప్పుడు వచ్చిన ఫోన్ కాల్ ఎక్కడ్నుంచి వచ్చిందో కాస్త చెప్పగలరా?'' అనడిగాడు.

''సారీ సర్. లైన్సు డిస్టర్బెన్సు మూలంగా ట్రేస్ చెయ్యడానికి వీలుపడదు'' చెప్పాడు ఆపరేటర్.

ఆ సమాధానానికి కొంచెం నిరుత్సాహ పడ్డాడు శ్రీకంఠరెడ్డి. ఫోన్ పెట్టేసి ఆలోచనలో పడ్డాడు.

ఎవరో వ్యక్తి. ఆపదలో ఉన్నాడు. ఎవరా వ్యక్తి? ఎక్కడున్నాడు? ఏ విధమైన ఆపదలో ఉన్నాడు?

## 3

రాఘవలో భయం ఎక్కువ కాసాగింది.

కంట్రోల్ రూమ్‌నుంచి కూడా ఫోన్ డిస్‌కనెక్ట్ కావడంతో మిణుకు మిణుకు మంటున్న ఆశ గుప్పుమని ఆరిపోయింది.

ధైర్యాన్ని కూడగట్టుకోవడానికి ప్రయత్నిస్తూ మళ్ళీ నెంబరు కోసం ప్రయత్నించసాగాడు.

పది నిముషాల తర్వాత మళ్ళీ లైన్లోకి వచ్చాడు ఇన్‌స్పెక్టర్ రెడ్డి.

ఆనందాన్ని వ్యక్తం చేయడానికి పాపం రాఘవ నోరు సహకరించలేదు. మళ్ళీ గురక - పులి అరుపు.

''మీరు ఎక్కడ్నుంచీ ఫోన్ చేస్తున్నారు? ఏ విధమైన ఆపదలో ఉన్నారు?'' అవతలివేపు నుంచి అడుగుతున్నాడు శ్రీకంఠరెడ్డి.

ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు కానీ ప్రయోజనం లేకపోయింది.

ఆ ప్రయత్నంలో ముందుకు వాలటంతో చెయ్యి తగిలి ఫోన్ క్రిందపడింది—

ఇన్‌స్పెక్టర్ రెడ్డికి అవతల వ్యక్తి పడుతున్న అవస్థ, ఫోన్ కిందబడిన శబ్దం స్పష్టంగా వినిపించాయి.

ఆ వ్యక్తి హార్ట్ అటాక్‌తోగానీ, పెరాలిసిస్ స్ట్రోక్‌తో గానీ బాధపడుతున్నట్లు అర్థమయింది.

అతని అడ్రస్ తెలిస్తే వెంటనే వెళ్ళి హాస్పిటల్‌లో అడ్మిట్ చేయవచ్చు.

కానీ అడ్రస్ తెలిసేదెలా?

ఇన్‌స్పెక్టర్ రెడ్డి ఆలోచిస్తున్నాడు.

క్రిందపడిన ఫోన్‌వంక దిగులుగా చూశాడు రాఘవ. అప్రయత్నంగా అతని కంటి నుంచి రెండు నీటిచుక్కలు రాలాయి.

ప్రస్తుతం తనకు ఉన్న ఒకేఒక ఆధారం ఆ ఫోన్. అది డిస్‌కనెక్ట్ కాకూడదని వెయ్యిదేవుళ్ళకు మొక్కుకుంటూ జాగ్రత్తగా ఫోన్ తీసి టేబుల్ మీద పెట్టాడు రాఘవ.

పెట్టి, రిసీవర్ తీసి చెవికి ఆనించుకున్నాడు.

థాంక్‌గాడ్! లైన్ కట్టవలేదు.

దాంతో మళ్ళా నోరు తెరిచాడు.

"ఆల్‌రైట్ మీ పొజిషన్ నా కర్థమయింది. మీ ఇంటి అడ్రెసు కనుక్కోవడానికి ట్రైచేస్తున్నాను. అందుకు మీ సహకారం కూడా కావాలి. నేను అడిగే ప్రశ్నలకు కరెక్టయితే ఒకసారి 'టక్' అని, కొట్టండి తప్పయితే రెండుసార్లు 'టక్, టక్' అని కొట్టండి. ఓ.కే" అడిగాడు ఇన్‌స్పెక్టర్ రెడ్డి.

రాఘవ ఆనందంతో గుర్రుమన్నాడు.

"ఓ.కే మీకు స్ట్రోక్ వచ్చిందా?"

మెడకి భుజానికి మధ్య రిసీవర్ వుంచుకుని, కుడిచేత్తో టేబుల్ మీద 'టక్' అని కొట్టాడు రాఘవ.

"ఇప్పుడు మీ ఇంటి లొకేషన్ కనుక్కోవడానికి ట్రై చేస్తాను. ఏరియాల వారీగా చూసుకుంటూ వద్దాం. సికింద్రాబాద్?" అడిగాడు రెడ్డి.

"టక్, టక్."

"అయితే హైద్రాబాద్ అన్నమాట....హిమాయత్ నగర్ —!"

"టక్, టక్."

"లోయర్ టాంక్ బండ్?"

"టక్, టక్."

"బషీర్ బాగ్?"

"టక్, టక్."

"నాంపల్లి"

"టక్, టక్."

ఖైరతాబాద్?"

"టక్, టక్."

"ఎర్రమంజిల్?"

"టక్, టక్."

"పంజాగుట్ట?"

"టక్."

ఆ శబ్దం వినగానే ఉత్సాహం ముంచుకొచ్చింది రెడ్డికి. సముద్రంలో పడి కొట్టుకుపోతున్న అతనికి గడ్డిపోచ ఆధారం దొరికినట్లయింది.

"మీరు కాలనీలో ఉంటున్నారా?"

"టక్ టక్."

అయితే ఆ వ్యక్తి పంజాగుట్టలో వుంటున్నాడన్న

మాట. మౌత్‌పీస్ మూసి, టెలిఫోన్ డైరక్టరీ చూసి పంజాగుట్టలో ఉన్న వ్యక్తుల అడ్రస్ లిస్ట్ అర్జెంటుగా తయారు చేయించమని నాగార్జునకు పురమాయించాడు శ్రీకంఠరెడ్డి.

తరువాత మళ్ళీ ఫోన్‌లో మాట్లాడుతూ "మీరు జాబ్ హోల్డరా" అనడిగాడు.

"టక్."

"చూడండి. ఇప్పుడు నేను కొన్ని నెంబర్లు చదువుతాను. వాటికి మీరు సమాధానం చెబితే మీ ఫోన్ నెంబరు తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను. మీ ఫోన్‌కు మొదలయ్యే నెంబరు 61,55,40,36,22...."

"టక్"

తక్షణ ఆపేసి "22 మొదలవుతుందా?" అనడిగాడు.

"టక్."

"రైట్ తర్వాతి నెంబరు 3,4,5,6,7,8...."

"టక్"

"నెంబర్ ఎయిట్?"

"టక్"

"వెరీగుడ్. ఇంకా మూడు నెంబర్లు ఉన్నాయి. మళ్ళీ 8,7,6,5,4,3...."

"టక్."

"నెంబర్ త్రీ?"

"టక్."

ఉత్సాహం ఉరకలు వేస్తుంటే మళ్ళీ అడగసాగాడు రెడ్డి. "2.3,4,5,8,4...."

"టక్."

"నెంబర్ ఫోర్!"

"టక్."

"ఆల్ రైట్ ఇంకా ఒక నెంబరు మిగిలివుంది. ఎగైన్ 2....3....4...."

"టక్"

"నెంబర్ ఫోర్?"

"టక్."

గుడ్ హెవెన్స్. మీ ఫోన్ నెంబర్ చదువుతాను. 228344. అవునా?" తను కాగితంమీద నోట్ చేసుకున్న నెంబరు చదువుతూ అడిగాడు ఇన్స్పెక్టర్ రెడ్డి.

"టక్."

అప్పుడే యస్.ఐ. నాగార్జున పంజాగుట్టలో ఉండే వ్యక్తుల అడ్రస్‌లున్న లిస్ట్ తీసుకువచ్చాడు.

ఆ లిస్ట్ అందుకుని పైనుంచి కిందదాకా పరిశీలించాడు రెడ్డి. వెయ్యికి పైగా అడ్రస్‌లు ఉన్నాయందులో. ఆ లిస్ట్ లోంచి రాఘవ పేరు వెదకడానికి రెండు నిముషాలు పట్టింది అతనికి.

పేరు దొరకగానే మరోసారి అందులో ఉన్న నెంబరుకు తన దగ్గిరున్న నెంబరును పోల్చి చూశాడు.

రెండూ ఒకటే కావడంతో అప్రయత్నంగా అతని నోటి నుంచి సంతోషంతో కూడుకున్న చిన్న అరువు వెలువడింది.

"మీ పేరు నర్రా రాఘవ. యా మై కరెక్టు?" అడిగాడు రెడ్డి.

"టక్."

"ఓ.కే యువర్ ప్రాబ్లమ్ ఈజ్ సాల్వడ్. ఇక మీరేం వర్రీ కావద్దు. ఫోన్ పెట్టేసి రెస్ట్ తీసుకోండి. పది నిము షాల్లో మీ ఇంటి ముందు ఉంటాను" అని చెప్పి ఫోన్

పెట్టేశాడు ఇనస్పెక్టర్ శ్రీకంఠరెడ్డి.

నాగార్జునవేపు తిరిగి చకచక ఆదేశాలు జారీచేశాడు.

సరిగ్గా పది నిముషాల తరువాత.

పంజాగుట్టలో ఉన్న రాఘవ ఇంట్లోకి ప్రవేశించాయి పోలీస్ జీప్, ఆంబులెన్స్.

టకటకమంటూ బూట్ల శబ్దం చేస్తూ ఇంట్లోకి ప్రవేశించారు శ్రీకంఠరెడ్డి బృందం.

పడకకుర్చీలో వాలిపోయివున్న రాఘవ ఇనస్పెక్టర్‌ను చూడగానే కృతజ్ఞతా సూచకంగా చెయ్యెత్తాడు.

'ఫరవాలేదన్నట్టు' అతని భుజంమీద మృదువుగా తట్టాడు పోలీస్ ఇనస్పెక్టర్ శ్రీకంఠరెడ్డి. □

(ఆంగ్లకథ ఆధారంగా)

---

## నవలా రచయిత్రి ?

ముందుగా మినీకథ రాయమంటే వినకుండా
సీరియల్ మొదలెట్టావ్!

# మృత్యుమార్గం

కె.వి.యస్.యన్.మూర్తి

అలిక్సేవ్ తనున్న ప్రాంతాన్ని సునిశితంగా చూశాడు.

చుట్టూ ఇసుక తప్ప మరేమీలేదు. దూరంగా సముద్రం పెట్టే ఘోష మాత్రం భయంకరంగా వినిపిస్తోంది. నెమ్మదిగా పైకి లేచాడు. తనను అక్కడ దించి వెళ్ళిన హెలి

కాప్టర్ దూరంగా తూనీగలా కనిపిస్తోంది.

భుజానికి తగిలించుకున్న కిట్‌ను దించి. దానిలోని సామాన్లను బయటకు తీశాడు. వంటికి డైవింగ్ సూట్‌ను బిగించుకుని తన బట్టల్నీ యితర సామానులనూ చిన్న ప్లాస్టిక్ సంచిలో సర్దేశాడు. చిన్న ఆయింట్‌మెంట్ తీసి మొహానికి దట్టంగా పూసుకున్నాడు. డైవింగ్ సూటుమీద కూడా బాగా రాశాడు. ఆ ఆయింట్‌మెంట్ షార్క్‌రెపలెంట్.

తను ఈదబోయే సముద్రం చాలా భయంకరమైంది. పెద్ద పెద్ద సొరచేపలూ, బ్రహ్మాండమయిన సరీసృపాల నిలయం. తెలిసి తెలిసీ ఆ సముద్రంలో ఈదటానికి ప్రయత్నించటం మూర్ఖత్వమే అవుతుంది. ఆ విషయం అలిక్సేవ్‌కు తెలుసు. అయినా తప్పదు. తను రిస్కు తీసుకోకపోతే తన తల్లిదండ్రుల ప్రాణాలను కాపాడుకోవటం కష్టం. కొడుకుగా తను తన కర్తవ్యాన్ని నెరవేర్చితీరాలి.

అలిక్సేవ్ సముద్రం వయిపు అడుగులు వేశాడు. కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.

ఒడ్డున నిలబడి చేతిలోని టెలిస్కోప్‌తో చుటూ పరిశీలించి చూశాడు. చుట్టూ ముదురు నీలం రంగులో అలుముకుపోయి వున్న నీరు తప్ప అతనికి మరేమీ కనిపించలేదు. నుదిటికి చేతిని అడ్డం పెట్టుకుని ఆకాశం వయిపు చూశాడు. ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పటివరకు వేగంగా ప్రయాణం చేసి అలసిపోయినట్టున్నాడు - అప్పుడప్పుడే పడమటి కొండల్లో విశ్రమించటానికి సూర్యుడు ఆయత్తపడుతున్నాడు. దానికి సంకేతంగా ఆ ప్రాంతం అంతా అరుణవర్ణం దాల్చింది.

అలిక్సేవ్ టయిమ్ చూసుకున్నాడు. ఐదు దాటి

యిరవయి నిముషాలు కావస్తోంది. టెలిస్కోప్‌ను లోపల పెట్టుకుని ఒక్కసారి ఒళ్ళు విరుచుకున్నాడు. దేశమాతకు అంజలి ఘటించి సముద్రంలో కి దూకాడు.

తల్లి దండ్రులనూ - తద్వారా దేశాన్ని రక్షించాలన్న ఒక వీరుని సాహసయాత్ర అక్కడితో ప్రారంభ మయింది.

మానవ ప్రయత్నానికి ఆ పైవాని అండవుంటేవిజయం తథ్యం - అలిక్సేప్ విషయంలో ఆ పరమేశ్వరుని అను గ్రహం ఎలా వుందో!!

# 2

విగ్స్‌బర్గ్ చిన్నదేశం. ఆ దేశజనాభా అంతా కలిసి మూడు లక్షలుంటుంది. ఆ దేశంలో యింకా రాచకరికమే కొనసాగుతోంది.

దేశం చాలా చిన్నదయినా దానికి ప్రపంచంలో మంచి పేరుంది. ఆ దేశం చాలా సంపన్నమయినది. రబ్బరు, స్టీలు పరిశ్రమలకు ప్రసిద్ధిగాంచింది ఆ దేశంలోని పరి శ్రమలు ఒక్కరోజు పని చెయ్యటం మానేస్తే కొన్ని అగ్రరాజ్యాలు కూడా గొల్లుమని గోలపెడతాయి. ఆ దేశాన్ని నాటో, ఐక్యరాజ్యసమితులు అంతర్జాతీయంగా గుర్తించాయి.

ఆ దేశంలో ఎక్కడ చూసినా పాత కొత్తల కల యికే. ఎంతో పురాతనమైన కట్టడాలు ఒకవయిపు చూడ ముచ్చటగా వుంటే - మరోవయిపు మల్టీస్టోరీడ్ బిల్డింగులు చూపర్లకు గుబులు పుట్టిస్తూ వుంటాయి. పచ్చటి అడ వులూ, సుందర జలాలూ చూపర్లను ఆకట్టుకుంటాయి.

అన్నిటికన్నా విచిత్రమయినది రాజప్రసాదం.

అది చాలా కట్టుదిట్టమయినది. అనుమతి లేనిదే దోమ కూడా లోపలకు చొరలేదు.

రాజప్రాసాదానికి ఒక వయిపు అరైన్ పర్వతం. దీంట్లో వున్న చిన్న గుహద్వారా మాత్రమే ఎవరయినా లోపలకు ప్రవేశించాలి. పర్వతాన్ని ఎక్కి లోపలకు రావటం అసాధ్యం. దానికి సాయం పర్వత పాదం దగ్గర పటిష్టమయిన కాపలా వుంటుంది.

పర్వతానికి రెండు ప్రక్కలనుండీ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎల్కెట్. బెట్రుస్నీ నదులు ప్రవహించి, రాజ ప్రాసాదాన్ని చుట్టి, ప్రాసాదానికి అవతల కలుసుకుని సముద్రంలో కలుస్తాయి. నదులు సముద్రంలో కలిసే చోట భయంకరమైన క్షీ: జలారణ్యాలు. అరణ్యం నిండా భయంకరమయిన జంతువులూ, విషసర్పాలూ అరణ్యమంతా ప్రమాదకరమయిన ఊబుల మయం. ఈ ప్రాంతం గుండా మానవు డెవడూ ప్రాసాదంలోకి ప్రవేశించలేడు.

సముద్రంలో ప్రయాణం చేసే ఓడలూ, సముద్రం మీద తిరగే విమానాలూ, రాజమందిరంలో వున్న టెలివిజన్ స్క్రీన్‌పై కనిపిస్తూ వుంటాయి. ప్రసాదానికి యిరు ప్రక్కల నుండీ ప్రవహిస్తున్న నదుల పొడవునా అధునాతనమయిన ఆటోమేటిక్ గన్సు వున్నాయి. వీటి రేంజిలోకి పిట్ట వచ్చినా కాల్చిపారేస్తాయి.

ఆ దేశం పేరు ప్రపంచానికి సుపరిచితం కావటానికి ముఖ్యమైన కారణం మరోటుంది. ఆ దేశం మహారాజుకు క్రికెట్ అంటే వల్లమాలిన అభిమానం. అందుకే ప్రతి సంవత్సరం తన పుట్టిన రోజున ఆ మహారాజు ప్రపంచ దేశాలన్నిటినీ ఆహ్వానించి విగ్స్‌బర్గ్‌లో వన్‌డే క్రికెట్ పోటీలు నిర్వహిస్తాడు. పోటీలో పాల్గొన్న ప్రతీ క్రీడా

కారుడికీ లక్షల డాలర్లు ముడుతుంది. నెగ్గినవారికి సరేసరి.

ఆ దేశానికి జర్మనీ, బెల్జియం, ఫ్రాన్సులు సరిహద్దులు. ఆ దేశం యొక్క అధికార భాష ఫ్రెంచ్ అయినా ప్రజలందరూ 'గెడ్జమ్‌పెర్ బిగెష్' అనే మిశ్రమ భాషను వాడతారు.

గిట్లర్‌కు ఆ దేశం మీద కన్ను పడింది. అతడో చిన్న దేశానికి నియంత. అతని దగ్గర అనేకమయిన అధునాతన మారణాయుధాలున్నాయి. వాటి సాయంతో ప్రపంచాన్ని జయించాలనే అభిలాష అతనికి వుంది. దానికి నాందిగా నిగ్స్‌బర్గ్‌ను వశపరచుకోవాలనుకున్నాడు గిట్లర్. నిగ్స్‌బర్గ్ మహారాజు కిక్‌ఫ్రిట్. అతనంటే ప్రపంచరాజ్యాలన్నిటికీ ఎనలేని గౌరవం.

గిట్లర్ మంచిమాటలతో రాజ ప్రాసాదంలోనికి ప్రవేశించాడు.

మర్మం తెలియని కిక్‌ఫ్రీట్ మహారాజు అతడిని సపరివారంగా లోపలకు ఆహ్వానించాడు. అదను చూసుకుని రాజును బంధించాడు గిట్లర్. రాజ్యం తనదని ప్రకటించాడు.

రాజంటే అభిమానంగల ప్రజలు "ప్రాణాలయినా యిస్తాం గాని గిట్లర్‌ను నియంతగా అంగీకరించం" అన్నారు.

అలా అన్నవాళ్ళను అనేక కష్టాలకు గురిచేశాడు గిట్లర్. ఫలితం శూన్యం. కష్టాలను అనుభవిస్తున్నారే తప్ప ఎవరూ గిట్లర్‌కు దాసోహం అనలేదు.

## 3

అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది.

అలిక్సేవ్ ఆయాస పడుతున్నాడు. అతడు దాదాపు

ఆరుగంటలనుండీ సముద్రంలో విరామం లేకుండా ఈదు తూనే వున్నాడు. కష్టం అంటే ఏమిటో తెలియని రాకుమారుడు కష్టాలను వెదక్కుంటూ ముందుకు సాగిపో తున్నాడు.

తన తండ్రిని గిట్లర్ బంధించాడని అలిక్సేవ్‌కు తన దేశ గూఢచారులద్వారా తెలిసింది. విషయం తెలిసి తనవా ళ్ళందరూ ఆవేశపడిపోయారు. ఏదయినా పెద్దదేశం సహాయం కోరమన్నారు. అలిక్సేవ్ దానికి ఒప్పుకోలేదు. అది ఎంత ప్రమాదమో అతనికి తెలుసు.

గిట్లర్ సామాన్యుడు కాడు. అతడి బారినుండి తన తల్లిదండ్రులను జాగ్రత్తగా విడిపించాలి. ఏమాత్రం పొరబాటు జరిగినా ఫలితం చాల దారుణంగా వుంటుంది. అందుకే గిట్లర్ని ఒంటరిగా ఎదిరించాలనుకున్నాడు అలిక్సేవ్.

తన ఫ్రెండ్‌ను సాయం అడిగాడు అలిక్సేవ్. అతడు అలిక్సేవ్‌ను నిగ్స్‌బర్గ్ దేశం వెనుకనున్న సముద్రం మధ్యనున్న ఇసుక దిబ్బలమీద హెలికాప్టర్లో దింపి వెళ్ళి పోయాడు.

అలిక్సేవ్ లండన్‌లోని తన నివాసాన్ని వదలిన పది నిముషాలకు గిట్లర్ సైనికులు అతడి నివాసాన్ని చుట్టు ముట్టారు. అదృష్టం అలిక్సేవ్ పక్షాన వుంది. అందుకే బ్రతికి బట్టకట్టాడు. అతడు ఏమాత్రం ఆలస్యం చేసినా దాయాదుల చేతుల్లో దుర్మరణం పొంది తీరేవాడు.

అలిక్సేవ్ స్నేహితుడు అతడిని కనీసం రాజప్రాసాదం వెనుకనున్న అరణ్యం దగ్గిర వదులుతానన్నాడు. కానీ సముద్రంమీద కదిలే హెలికాప్టర్ తన తండ్రి గదిలో వున్న టి. వి. స్క్రీన్‌మీద కనిపిస్తుంది. అలిక్సేవ్

నవ్వుకున్నాడు. తన తండ్రి చేసిన ఏర్పాట్లు యిప్పుడు తనకే ప్రమాదకరంగా తయారయ్యాయి. అందుకే సముద్రాన్ని ఈదటానికే పూనుకున్నాడు అలిక్సేవ్.

అలిక్సేవ్ ఆయాసంతో రొప్పుతూ ముందుకు ఈదుతున్నాడు. ఎందుకో అతడి సిక్స్తుసెన్సు వున్నట్టుండి హెచ్చరించింది. చటుక్కున మునిగి ముందుకుపోయాడు. రెండు నిముషాలు పోయాక పైకి లేచాడు. పున్నమి వెన్నెల్లో అతడికి పదడుగుల దూరంలో అరవై అడుగుల పైచిలుకు వున్న సీస్నేక్ లీలగా కనిపించింది. అతనికి గుండె ఆగినంత పనయింది. కొద్దిలో ప్రమాదం తప్పిపోయింది.

డీలా పడటానికి అది సమయంకాదు. ఈ విషయం అలిక్సేవ్‌కు తెలుసు. అందుకే అతడు మనసును దిటవు చేసుకున్నాడు. తన అదృష్టానికి తనని తానే అభినందించుకున్నాడు. జరిగిన సంఘటన అతనిలో భయోత్పాతాన్ని లేపలేదు సరికదా - సరికొత్త ధైర్యాన్ని చేకూర్చింది.

ఓ పెద్ద ప్రమాదంనుండి బయటపడ్డ తనను ముందు రాబోయే ప్రమాదాలు ఏమీ చెయ్యలేవనే నమ్మకం అతనిలో ఏర్పడింది. కొత్త హుషారునూ, వూపునూ యిచ్చింది. అంతే. అలిక్సేవ్ చరచరా బారలు చాపుకుంటూ ముందుకు వెళ్ళటం ప్రారంభించాడు.

మరో గంట పోయాక అతనికి ఈదటం కష్టం అయింది. నాలుగు బారలు ముందుకు వెళితే మూడు బారలు వెనక్కు వెళ్ళిపోతున్నాడు.

మొదట్లో అతడికి అలా ఎందుకు జరుగుతోందో అర్థం కాలేదు. కానీ రెండు నిముషాలు ఆలోచించాక

అతడికి ఎక్కడలేని హుషారూ పుట్టుకు వచ్చింది. ఏదో సాధించాననే తృప్తితో అతడి మనసు నిండిపోయింది.

తను ప్రస్తుతం బెట్రుస్నీ, ఎల్కెట్ నదులు సముద్రంలో కలిసేచోట వున్నాడు. అందుకే ప్రవాహం అంత వడిగా వుంది. తను తన గమ్యానికి చేరువలో వున్నాడు. మరో రెండుమైళ్ళు ఈదగలిగితే తను ఒడ్డును చేరుకోవచ్చు.

అలిక్సేవ్‌కు వళ్ళంతా మంట పుడుతోంది. కాళ్ళూ చేతులూ లాగటం మొదలుపెట్టాయి. ఇక శరీరం ఈదలేనని మొరాయించింది. అతడు నడుముకు తగిలించుకున్న లైఫ్ బెల్టును ఒక్కసారి చూసుకున్నాడు. దాని నిండా గాలి పూదితే చాలు—నీటి ఉపరితలంమీద ఏమాత్రం శ్రమ లేకుండా తేలొచ్చు. ఆతని మనసు పీకింది. కానీ కర్తవ్యం అతడిని హెచ్చరించింది. రెండు నిముషాల సుఖం కోసం తను అలా చేస్తే, తను ప్రవాహ వేగానికి వెనక్కు కొట్టుకుపోతాడు. మళ్ళా ముందుకు ఈదుకు రావాలి. అందుకే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

నెమ్మదిగా ఈదటం మొదలుపెట్టాడు. అప్పటివరకూ ఈదటం ఒక ఎత్తయితే అక్కడినుండి ఈదటం మరో ఎత్తయింది. అసలు బారలు చాపలేక పోతున్నాడు. అయినా అలిక్సేవ్ తన పనిలో నిమగ్నమయ్యే వున్నాడు.

## 4

"సార్!"

గిట్లర్ అతడిని గుర్రుగమి చూశాడు. "ఏం?" అన్నాడు. అతడి చేతిలో ఓ సుందరాంగి వగలు పోతోంది.

"సార్! దేశప్రజలందరూ చేతి కందిన ఆయుధాలను పట్టుకొని మన సైనికుల మీదికి తిరగబడ్డారు సార్. జన

ప్రవాహాన్ని అరికట్టడం చాలా కష్టంగా వుంది. గుహ ముఖద్వారం దగ్గిరవున్న మన సైనికులను చంపి ప్రాసాదంలోనికి చొరబడ్డారు'' అన్నా డతను.

గిట్లర్ మత్తు ఒక్కసారిగా దిగిపోయింది. చేతిలోని సుందరాంగిని విదిల్చికొట్టి పైకి లేచాడు. "నాన్సెన్సు: పొట్టేళ్ళు కొండను ఢీ కొంటున్నాయన్న మాట. విశ్వ విజేతలం కావాలనుకొంటున్న మామీద ఒక చిన్నదేశపు పౌరులు తిరగబడ్డమా! నాన్సెన్సు! మా పరువేం కావాలి. అలా జరగటానికి వీలులేదు. ఓటమిని ఈ గిట్లర్ అంగీకరించలేడు. ఈ దేశం సర్వనాశనం అయిపోయినా పర్వాలేదు - తిరుగుబాటుదార్లందర్నీ పిట్టల్ని కాల్చినట్టు చంపి పడేయండి'' అన్నాడు కోపంగా.

"కుదరదు సార్! ఈ ప్రదేశం మనకు క్రొత్త. జనం అందరూ గెరిల్లా పద్ధతిలో మనమీద దాడి చేస్తున్నారు. మనవాళ్ళని ఆకర్షించి బయటకు తీసుకుపోయి చంపుతున్నారు.''

గిట్లర్ కనుగుడ్లు ఎరుపెక్కాయి. "ఒరేయ్! చవట పీనుగా! బయటకు పో!'' అంటూ అరిచాడు.

సిపాయి వణికిపోయాడు. వంగి వంగి సలాములు చేస్తూ బయటకు వెళ్ళబోయాడు. అంతలోనే ఏమనుకున్నాడో ఏమో గిట్లర్ మనసు మార్చుకున్నాడు. సిపాయిని వెనక్కు పిలిచాడు.

సిపాయి పై ప్రాణాలు పైనే పోయాయి. అతడు వెనక్కి తిరిగి సెల్యూట్ చేస్తూ నిలబడ్డాడు.

గిట్లర్ అతడిని దగ్గరకు పిలిచి "అయితే ఏమీ చెయ్యలేమా!'' అని అడిగాడు.

సిపాయి కాళ్ళల్లోంచి వణుకు పుట్టుకు వచ్చింది. నోట

మాట రాక నిలబడిపోయాడు.

గిట్లర్ అతని భుజం తట్టాడు. "రా! కూర్చో!" అన్నాడు.

ఈసారి సిపాయి బెంబేలెత్తిపోయాడు.

గిట్లర్ అతడి పరిస్థితిని గమనించాడు. "రా! గాబరా పడకు" అంటూ అతడిని కూర్చోపెట్టి గ్లాసునిండా ద్రవం పోసి అందించాడు.

సిపాయి వణుకుతున్న చేతులితోనే గ్లాసును అందుకున్నాడు.

"అయితే మనం ఏం చేస్తే బావుంటుందంటావు?" అని అతడి నడిగాడు గిట్లర్.

అదే గిట్లర్లో వుండే గొప్పతనం. తన దగ్గర పనిచేసే వాళ్ళనుండి కూడా సలహాలు తీసుకుంటాడు. సరైనవైతే వాటిని పాటిస్తాడు. ఆ సలహా యిచ్చిన వాడికి తనదగ్గిర సముచిత స్థానాన్ని కలిపిస్తాడు.

"కిక్ ఫ్రిట్ రాజుగాని బయటకు వచ్చి తనవాళ్ళతో మాట్లాడితే సమస్య తీరిపోతుందండి. రాజును మాట్లాడేలా చెయ్యటానికి చిన్నమార్గం వుందండి" అన్నాడు సిపాయి.

గిట్లర్ కళ్ళు మెరిసాయి. సిపాయివంక ఆత్రంగా చూసి "చెప్పు" అన్నాడు.

"ఏముంది సార్! అలిక్సేవ్ మన చేతుల్లో బందీగా వున్నాడని చెప్పండి. మనం చెప్పినట్లు చేస్తే వాడిని వదులుతాం—అని చెబుతాం"

"శెభాష్!" అంటూ జేబులోంచి నోట్లకట్టను తీసి అతనిమీదికి విసిరాడు గిట్లర్. అతడు దానిని సంతోషంగా అందుకున్నాడు.

గిట్లర్ వడిగా అడుగులు వేస్తూ రాజును బంధించిన గదిలోకి అడుగులు వేశాడు.

కిక్ ఫ్రిట్ చివ్వున తలెత్తి, గిట్లర్ని అసహ్యంగా చూశాడు.

"చూడు! నీ కొడుకు మా బందీగా చిక్కాడు. అతడు నీకు ప్రాణాలతో దక్కాలంటే—నేను చెప్పినట్లు విను. బయటకు వచ్చి మీ వాళ్ళతో మాట్లాడు" అన్నాడు గిట్లర్.

కిక్ ఫ్రిట్ పకపకా నవ్వాడు. "నువ్వు ఎన్ని ట్రిక్కులు వేసినా నేను నీకు లొంగను. నీకు తోచింది చేసుకో!" అన్నాడు.

గిట్లర్ కోపంతో వూగిపోయాడు. "చూడు నిన్నేం చేస్తానో!" అంటూ అతని గొంతుమీద చెయ్యివేసి నొక్కటం ప్రారంభించాడు.

కిక్ ఫ్రిట్ కు వూపిరి ఆడటం కష్టంగా వుంది. నాలుక వెళ్ళుకు వస్తోంది. గుడ్లు తేలిపోతున్నాయి.

గిట్లర్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడు.

సరిగ్గా అదే సమయంలో వెనుక తలుపు తెరుచుకున్న ట్లనిపించి గిట్లర్ వెనక్కు తిరిగాడు.

## 5

సూర్యకిరణాల తాకిడికి మొహంమీద చురుక్కు మనే టప్పటికి అలిక్సేవ్ కళ్ళు తెరిచాడు. కళ్ళు అగ్నిగోళాల్లా మండాయి. అతని మెదడంతా మొద్దుబారి వుంది.

అలిక్సేవ్ మరో రెండు నిముషాలు కళ్ళు మూసుకుని తెరిచాడు. కళ్ళు కాంతికి అలవాటుపడ్డాయి. ఒళ్ళు విరుచుకుని కూర్చున్నాడు అలిక్సేవ్. చేతి గడియారంకేసి చూసుకున్నాడు. పదకొండు దాటింది. అతడు ఆశ్చర్యపోయాడు.

అతడికి జరిగింది లీలగా గుర్తుకు వచ్చింది.

సముద్రంలో ఈది ఈది అలసిపోయాడు అలిక్సేవ్. ఇంక ఈదలేనేమో అనుకునే సరికి అతని కాళ్ళకు నేల తగిలింది. సంతోషంతో ముందుకు రాబోయిన ఆతనికి గట్టుమీద నుండి నీటిలోనికి వంగి వున్న ఓ మోడు తగిలింది. వెంటనే అతనికి కళ్ళు తిరిగాయి. స్పృహపోవటం ప్రారంభించింది. మొండిగా ఒడ్డుకు నాలుగు అడుగులు వేశాడు. క్రింద పడిపోయినట్లు గుర్తు. మళ్ళీ యిప్పుడు మెలకువ వచ్చింది.

అలిక్సేవ్ చేతితో నుదిటిని తడుముకున్నాడు. పెద్ద బొప్పి తగిలింది. అతడికి ఒళ్ళంతా చిరాగ్గా వుంది. జిడ్డు జిడ్డుగా వుంది. ఒళ్ళంతా బురద కొట్టుకుపోయి ఎర్రగా, నల్లగా యిసక యిసకగా వుంది. ఒంటికి ఉన్న ఉప్పు నీరు ఎండకు ఎండి తన డ్రస్ మీదా, వంటిమీదా తెల్లటి పొరలనూ చారికలనూ ఏర్పరచింది.

అలిక్సేవ్ ప్లాస్టిక్ సంచిని ఓపెన్ చేశాడు. సీసాలో ఉన్న నీళ్ళను తాగాడు స్విమ్మింగ్ డ్రస్‌ను విప్పేశాడు. ఒళ్ళంతటినీ తడిగుడ్డతో తుడుచుకున్నాడు. కొంచెం రిలాక్సింగా ఫీలయ్యాడు. టిన్డ్ మటన్ తిని, బీరు తాగాడు. సిగిరెట్ తీసి వెలిగించి రెండు దమ్ములు పీల్చాడు. జీన్స్ ప్యాంటూ, బనీను తీసి వేసుకున్నాడు. పిస్తోల్నీ, డాగర్‌నీ సర్దుకున్నాడు. కాళ్ళకు కిడ్సు వేసుకుని సంచి భుజాన వేసుకుని బయలుదేరాడు.

చుట్టూ అడవి దూరంగా జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి. కనుచూపుమేరలోంచి నువ్వా నేనా అనే సర్పాలు జరజరమని పోకిపోతున్నాయి.

అలిక్సేవ్, వీటిని లక్ష్యపెట్టటం లేదు. గమ్యాన్ని చేరుకోవాలనే తపనతో వడివడిగా నడుస్తున్నాడు. నెత్తిన ఎండ మండుతోంది. ముళ్ళు గీరుకుని అతడి శరీరం బాధ పెడుతోంది. అయినా అతని గమ్యం మారటంలేదు. వేగం తగ్గటం లేదు.

సాయంత్రం నాలుగు కావస్తూందనగా అలిక్సేవ్ అడవిని పూర్తిగా దాటేశాడు. దూరంగా అతనికి రాజప్రాసాదం లీలగా కనిపిస్తూంది. అతడి మనసంతా హుషారుతో ఉరకలు పెట్టింది.

సాయింత్రం ఆరు గంటలకు అలిక్సేవ్ రాజప్రాసాదాన్ని జేరుకున్నాడు. అతడి రక్తం ఒక్కసారిగా పొంగింది. గుండెల నిండా వూపిరి పీల్చుకుని నరాల్లో శక్తిని నింపుకున్నాడు.

ఇప్పుడు అతనికి ఎదురుగా ఇరవై అడుగుల ఎత్తైన కోటగోడ వుంది. ఆ గోడను ఆనుకునే పెద్ద కందకం వుంది. దాని లోతు పదడుగులు. దానినిండా కత్తులూ, గాజు పెంకులూ, మొసళ్ళూ వున్నాయి. అయినా అలిక్సేవ్‌కు వాటిని దాటి లోపలకు వెళ్ళటం పెద్ద కష్టమైన పని కాదు. కోటలోనికి ప్రవేశించే రహస్య మార్గం అతడికి తెలుసు.

గోడకు ఎదురుగా వున్న చిన్న స్తంభం దగ్గిర నిలబడ్డాడు అలిక్సేవ్. స్తంబానికి కుడివయిపుగా ఇరవై అడుగులు వేసి ఎడమవయిపుకు తిరిగాడు. ముక్కుకు సూటిగా నడిచి కందకాన్ని చేరుకున్నాడు. ఒక రాయిని తీసుకుని కందకంలోనికి విసిరాడు. 'ఠంగ్' మని శబ్దం వచ్చింది.

అతడు హుషారుగా ఈలవేసి కందకంలోనికి అడుగు

వేశాడు. కాలికింద చిన్న దిమ్మలాంటిది ఉంది. నెమ్మదిగా బాలెన్సు చూసుకుని ముందుకు నడిచాడు. మరో దిమ్మ. మళ్ళీ యింకో దిమ్మను దాటేటప్పటికి కోటకోడ వచ్చేసింది. గుండెలనిండా గాలి పీల్చుకుని గోడమీద చెయ్యి వెయ్యబోయాడు. చేతికీ గోడకున్న నెరకు మధ్యనుండి బుస్సుమంటూ ఏదో వస్తువు పాకి ముందుకు పోయింది.

అలిక్సేవ్ గుండె ఝల్లుమంది. కాళ్ళలోంచి వణుకు పుట్టుకు వచ్చింది. ఒక్క నిముషం కదలకుండా నిలబడ్డాడు.

తర్వాత నెమ్మదిగా గోడను తడిమాడు. చిన్న కొక్కెం లాంటిది చేతికితగిలింది. దాన్ని పట్టుకు గట్టిగా లాగాడు.

గోడలో ఒక మనిషి దూరే చిన్న జాగా ఏర్పడింది. అలిక్సేవ్ లోపలకు ప్రవేశించాడు.

చీకటి. నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. లోపలంతా బూజులు పట్టి వుంది. గబ్బువాసన కొడుతోంది. నెమ్మదిగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్ళాడు.

పది నిముషాలు నడిచేటప్పటికి దారి అయిపోయింది. సంచిలోంచి టార్చి తీసి వెలిగించాడు. ఎదురుగా చిన్న తలుపు వుంది. దానికి బలమైన గడియ వుంది. గడియ తీసి తలుపు తెరిచాడు. ఎదురుగా విశాలమైన గది కనిపించింది.

ఆ గదిని చూసేటప్పటికి అతడికి ఎక్కడలేని హుషారు వచ్చింది. అది తన గది. ఆ గదికి ఆనుకునే తన తండ్రి గది. అలిక్సేవ్ తన గదిలోనికి ప్రవేశించి తండ్రి గది గుమ్మాన్ని చేరుకున్నాడు.

తండ్రి గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి. గిట్లర్

తన తండ్రిని బెదిరిస్తున్నాడు. ఆవేశంతో అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి. జేబులో వున్న పిస్టల్ని తీసి చేత్తో పట్టుకుని తలుపు తెరిచాడు.

ఆ చప్పుడుకి రాజును చంపబోతున్న గిట్లర్ వెన్నక్కి తిరిగాడు.

కాలయముడులా గుమ్మం దగ్గిర పిస్టల్‌తో నిలబడి వున్న అలిక్స్పేప్‌ను చూసి గుడ్లు తేలేశాడు. చేసేది లేక గిట్లర్ చేతులు పైకెత్తాడు. అలిక్స్పేప్ అతడిని కుర్చీకి కట్టేసి తల్లిదండ్రులను విడిపించాడు.

ఈలోగా నిగ్స్‌బర్గ్ ప్రజలు గిట్లర్ సైన్యాన్ని మట్టి కరపించి కోటలోకి ప్రవేశించారు.

"యువరాజు అలిక్స్పేప్ జిందాబాద్!" అనే నినాదాలు మిన్నుముట్టాయి. □

## నీటి కొరత?



# మన చుట్టూ నేరస్థులు

జొన్నలగడ్డ రామలక్ష్మి

ఏ మనిషీ పుట్టుకతో నేరస్థుడు కాడు. పరిస్థితుల ప్రభావం వల్ల మహాత్ముడు కూడా నేరాలు చేయవచ్చు.

అయితే పరిస్థితుల ప్రభావ మన్నది ఒకోసారి నెపమే అవుతుంది.

మనిషి తనకున్నదాని గురించి చక్కగా ఆలోచించి ఓ పద్ధతిలో జీవితాన్ని నడిపించుకుంటూ వెడితే - నేరాలు చేయాల్సిన అవసర ముండదు.

కొండలావు జీవితం అందు కుదాహరణ.

బ్రతకలేక బడిపంతులన్న సామెత కొండల్రావుకు వర్తించదు. ఉద్యోగం పురుషలక్షణమని తండ్రి ఆయన్ని బియ్యే బియ్యీడీ చేయించి పలుకుబడితో ఊళ్ళోని కమిటీ స్కూల్లో లెక్కలమేస్టారుద్యోగం వేయించాడు. ఉద్యోగంలో చేరినప్పు డాయనకు మూడు లక్షల రొక్కం, ముప్పై ఎకరాల పొలం, లంకంత యిల్లు ఉన్నాయి.

తండ్రి కొండల్రావును గారంగా పెంచాడు. చాలా గొప్పవాడన్న భావాన్ని కలిగిస్తూ పెంచాడు.

చిన్నతనం నుంచీ కొండల్రావు అన్ని విషయాల్లోనూ దర్జాగా ఉండడానికి అలవాటు పడ్డాడు.

ఆయన నెలనెలా కొత్తబట్టలు కుట్టించుకునేవాడు. చాకలి స్వయంగా వచ్చి ఇంటి దగ్గరే బట్టలుతికి చలువ చేసి వెళ్ళేవాడు.

ఆయన షాపులో ఏమన్నా కొనాలంటే - తన అభిరుచికి కాక ధరకు ప్రాధాన్యత నిచ్చేవాడు. ఖరీదైనవి తప్ప - బాగున్నాసరే చౌక వస్తువులు కొనకూడదన్నది ఆయన సిద్ధాంతం.

నిప్పుకు గాలి తోడయినట్లు - కొండల్రావు భార్య సీతారావమ్మ కూడా కలిగినింటి నుంచి వచ్చింది. ఆమె కూడా కొండల్రావు పద్ధతిలోనే తనింట్లో పెరగటంవల్ల - అభిరుచుల విషయంలో భర్తకూ ఆమెకూ సరిపోయింది.

కొండల్రావుకు ముప్ఫయిఏళ్ళప్పుడు తండ్రి పోయాడు. తండ్రి కర్మకాండకు కొండల్రావు బోలెడు డబ్బు ఖర్చు

పెట్టాడు. పెళ్ళి తంతుకంటే ఘనంగా జరిగిందని ఊరంతా ఓ పెద్ద విశేషంగా చెప్పుకున్నారు.

కొండల్రావుకు ఇద్దరు కూతుళ్ళు, ముగ్గురు కొడుకులు. పెద్దకూతురికి పదహారో యేట మంచి సంబంధం చూసి పెళ్ళి చేశాడు. పెళ్ళికి లక్ష రూపాయలు ఖర్చయింది. వియ్యాలవారు చిన్న తప్పు కూడా ఎత్తి చూపలేదు సరిగదా - పెళ్ళిలోనే సెభాషని మెచ్చుకున్నారు.

చదువుకుంటున్నారని కొడుకు లిద్దరికీ ఆయన అడిగినంతా డబ్బిచ్చాడు. ఆ కారణంగానే వారికి చదువు రాలేదు. ఎలాగో కష్టపడి ఇద్దరూ బియ్యే అనిపించారు. కొండల్‌రావు డబ్బు పారేసి వాళ్ళిద్దరికీ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించాడు.

వాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి.

కొండల్రావు ఖర్చుమనిషి కావచ్చుకానీ ఆయనకూ ఆదర్శాలున్నాయి. తనిచ్చేచోట ఘనంగానే యిచ్చినా కొడుకు లిద్దరికీ కూడా ఆయన పైసా కట్నం తీసుకోలేదు.

ఇప్పుడా కొడుకులు వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు.

ఇంట్లో ఉన్నది—

ఇంటర్మీడియేట్ ఫస్టు క్లాసులో ప్యాసయిన ఆఖరి కొడుకు మురళి—

బియ్యే రెండో సంవత్సరంలోకి వచ్చిన ఆఖరుకూతురు జానకి—

కొడుకు కింజనీరింగ్ కాలేజీలో సీటు కావాలంటే పదిహేను వేలు డొనేషన్ కట్టాలి. కూతురి పెళ్ళికి కనీసం పాతికవేలు కట్నం కావాలి.

ఇవీ ప్రస్తుతం కొండల్రావు అవసరాలు.

ఇవి కాక—

కొండల్రావు ఏటా అల్లుణ్ణి పండుగలకు పిలుస్తాడు. కూతురు తృప్తిపడేలా వాళ్ళను సత్కరిస్తాడు.

కొండల్రావు వంటి మామగారుండటం తన అదృష్టమని అల్లుడే కాదు - కోడళ్ళు కూడా అనుకుంటారు.

కూతురితో సమంగా కోడళ్ళనూ చూసుకుంటాడాయన.

అయితే........

కూర్చుని తింటుంటే కొండలయినా కరిగిపోతాయి. కొండల్రావుకు పేరులో కొండలున్నా ఆయన ఆస్తిని కొండతో పోల్చడానికి లేదు.

ఇప్పుడు కొండల్రావుకు నాలుగెకరాల భూమీ, ఇల్లూ మిగిలాయి. కొడుక్కి డొనేషన్ కట్టాలన్నా, కూతురి పెళ్ళి చేయాలన్నా ఆయన దగ్గర పూర్వపు ధైర్యం లేదు. ఉన్న ఎకరాలమ్మేస్తే - ఆ పైన ఏం చేయాలో అన్న భయం ఆయనకుండనే ఉంది.

అప్పుడాయన మొదటి నేరానికి తలపడ్డాడు.

నేరమంటే నేరం కాదు.

ఒకళ్ళకు సాయపడటమే తప్ప ఒకరిని సాయమడగటం నేరంగా భావిస్తాడు కొండల్రావు.

అది అయినవాళ్ళయినా సరే!

ఆ అయినవాళ్ల కన్నబిడ్డలయినా సరే!

## 2

కొండల్రావుకు నాలుగెకరాల పొలమూ, యిల్లూ కూడా తాకట్టులో ఉన్నాయి. వడ్డీతో కలిసి ఆ అప్పు పన్నెండు వేలు. ఆ బాకీ తీర్చితే తప్ప వాటిని అమ్ముకుందుకూ లేదు. వాటి మీద అప్పు తెచ్చుకుందుకూ లేదు.

అప్పిచ్చిన వ్యక్తి పేరు అయ్యన్న. అతడి కాయన పొలంమీదా, యింటిమీదా కూడా ఆసక్తి ఉంది. తక్కువ ధరకవి చెల్లుబడి చేసుకుందామని అయ్యన్న ఆశపడు తున్నాడు.

అయినవాళ్ళ నెప్పుడూ అప్పడిగి ఎరుగని కొండల్ రావు కిప్పుడడగటం తప్పనిసరి అయింది.

ముందాయన కొడుకుల నడిగాడు.

విషయం తెలుసుకున్నాక కొడుకు లిద్దరూ తమ తమ భార్యలకు చెప్పారు. తర్వాత నలుగురూ కలిసి చర్చలు జరిపారు.

బాగా చర్చించేక ఓ విషయం గ్రహింపుకు వచ్చింది.

ఆఫీసులోంచి అప్పు పుట్టించి యిద్దరూ చెరో ఆరు సేలూ పుట్టించి తండ్రికిచ్చి సాయపడొచ్చు. కానీ యిచ్చిన డబ్బు వెనక్కెలా వస్తుంది?

తండ్రి కాబట్టి బాకీ తీర్చమంటే బాగుండదు.

ఒకసారి అలవాటుపడితే తండ్రి మళ్ళీ మళ్ళీ డబ్బడగ వచ్చు.

లేదని చెప్పడం యిష్టంలేక - "నాన్నా! అమ్మ బంగారం తాకట్టు పెట్టలేకపోయావా?" అన్నాడు పెద్ద కొడుకు.

"ఇప్పుడు అమ్మకున్నదంతా నకిలీ బంగారం...." అంటూ ఇబ్బందిగా నిజం బయటపెట్టాడు కొండల్రావు.

"నీకు ప్రావిడెంటు ఫండ్‌లో లోన్ దొరకదా?" అన్నాడు రెండో కొడుకు - తెలుసుకుందుకు అడిగినట్లు.

"మొన్న ఉగాదికి లోన్ పెట్టాను....అంతా వచ్చి వెళ్లారుగా...." అన్నాడు కొండల్రావు.

తండ్రి పట్టిపోయాడని కొడుకు లిద్దరికీ అర్థమయింది.

"నాన్నా! నీ దగ్గిర్నుంచి తీసుకోడం అలవాటైన ఉన్న డబ్బుతో సరిపెట్టుకోలేక పోతున్నాం. నిన్నదక్క పోవడమే ఓ విశేషంగా భావిస్తున్నాం. నీకు సాయపడాలన్న కోరిక మాలో బలంగా ఉంది. కానీ అక్కకిలా ఉన్న వాళ్ళం కాదు గదా! ఈమాట చెప్పడానికే సిగ్గుగా ఉంది మాకు...." అనేశారు వాళ్ళిద్దరూ.

వాళ్ళు తెలివిగా తండ్రి దృష్టిని అక్కవైపుకి మళ్ళించారు.

నిజంగానే కొండల్‌రావు పెద్దకూతురు పని బాగుంది.

కానీ—

ఆడపిల్ల దగ్గిర డబ్బు తీసుకొనడం ఆ యింటి ఆచారం కాదు. పైగా అది నేరంగా భావిస్తాడు కొండల్‌రావు.

అయితే విధిలేనప్పు డేంచేయాలి?

కొండల్‌రావు మొదటినేరంచేసి భంగపడ్డాడు. రెండో నేరం చేయడానికి సిద్ధపడి కూతురు దగ్గిరికి వెళ్ళాడు.

అయితే డబ్బు కావాలని అడగలేదు కదా!

కొండల్‌రావు లౌక్యంగా కూతురుకి తన పరిస్థితి చెప్పుకుని - అప్పుకోసం తిరుగుతున్నట్లు చెప్పాడు.

కొండల్‌రావు కూతురు లౌక్యంలో తండ్రిని మించినది. చెప్పాలంటే ఆయనకు లౌక్యం తెలియదు. ఆమెకు తెలుసు.

"నువ్వు ఖర్చులు బాగా తగ్గించుకోవాలి నాన్నా! లేకపోతే నువ్వు అప్పులు చేయడమేమిటి?" అంటూ ముందు తండ్రిని బాగా మందలించింది. ఆ తర్వాత బాగుండదనుకుందో ఏమో - "ఆడపిల్ల సొమ్ము అప్పుగా కూడా తీసుకోకూడదన్న సిద్ధాంతం నీది. లేకుంటే నే నిప్పు

డున్న పొజిషన్లో—నీకు సాయపడి ఉండేదాన్ని!”
అంటూ ముందరికాళ్ళకు బంధం వేసింది.

తనకలాంటి సిద్ధాంతం లేదనడానికి కొండల్‌రావు మొహమాట పడి దిగులుగా ఇంటికి తిరిగి వెళ్ళాడు.

అయితే-రెండు నేరాలు చేసి ఫలితం పొందని తన దగ్గరకు నేరస్థుడే వెతుక్కుంటూ వస్తాడని ఆయన అనుకోలేదు.

సామాన్యుడి అవసరాల గురించి— నేరస్థులకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదేమో!

అందుకే రామచంద్రం వెతుక్కుంటూ కొండల్‌రావు కోసం వచ్చాడు.

# 3

రామచంద్రం కొండల్‌రావు బావమరిది. ఇంకా చెప్పాలంటే సీతారావమ్మకు ఒక్కగానొక్క తమ్ము డతడు.

తండ్రికి ఒక్కగానొక్క కొడుకు కావడంవల్ల విలాస జీవితానికి కలవాటుపడి జీవితంలో బాగా నష్టపోయాడు. అతడికి దురలవాట్లున్నాయనీ, చెడిపోయాడనీ బంధు వర్గంలో అనుకునేవారు. నాలుగేళ్ళక్రితం అతడికి తండ్రి పోయాడు. తన మామగారి కుటుంబమెంతలా చితికిపోయిందో అప్పుడే తెలిసింది.

కొండల్‌రావు బావమరిది నాదుకుంటానంటే సీతా రావమ్మే ఒప్పుకోలేదు.

“వాడు దుబారా వెధవ. మీరేమిచ్చినా తగలేస్తాడు. ఎవరి కర్మకెవరు కర్తలు? వాడికేం రాసిపెట్టుంటే అదే జరుగుతుంది. మీరు మాత్రం పట్టించుకోకండి—” అని భర్తను వారించింది.

తోడబుట్టిన అక్క తన గురించి అలా అన్నాక రామ

చంద్రం బావగారిని డబ్బు గురించి అడగనూలేదు. ఆ తర్వాత ఆ రెండు కుటుంబాల మధ్య రాకపోకలు తగ్గిపోయాయి.

రామచంద్రం క్రమంగా కాస్త బాగుపడ్డాడని కబురు తెలిసి సీతారావమ్మ మనసులో సంతోషించింది.

ఇన్నాళ్ళకు రామచంద్రం మళ్ళీ వచ్చి—

"బావా! తాత్కాలికంగా నేను నీకు సాయపడగలను. కానీ బదులుగా నువ్వు నాకు యాభై వేలు అప్పివ్వాలి!" అన్నాడు.

"అంటే?" అన్నాడు కొండల్‌రావు.

"నువ్వు పొలం తాకట్టు విడిపించాలనుకుంటున్న దెందుకు? అమ్మడానికే కదా! అమ్మగా వచ్చిన డబ్బులో నాకో యాభై వేలు అప్పుకావాలి. కొత్తగా వ్యాపారం ప్రారంభించాను. అందుకు పెట్టుబడి అవసరం! ఆర్నెల్లలో వడ్డీతో సహా నీ బాకీ తీరుస్తాను—"

కొండల్‌రావు భార్యను సలహా అడిగాడు.

"నాకు తమ్ముడైతే అయ్యాడు కానీ వాడు నమ్మతగ్గ మనిషి కాడు...." అంది సీతారావమ్మ నిర్మొహమాటంగా.

అయితే కొండల్‌రావు మరోవైపునుంచి ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు బావమరిది డబ్బివ్వకపోతే పొలం, ఇల్లు అయ్యన్న చెల్లుబడి చేసుకుని తనకు తోచిన ధరకట్టి మిగిలింది తనకిస్తాడు. అప్పుడు తనకు వచ్చే నష్టం చాలా ఎక్కువ. బావమరది తన్ను మోసం చేయడనే ఆయన నమ్మకం.

ఒకవేళ రామచంద్రం తనను మోసం చేస్తే— అయ్యన్న కొంత తినేబదులు—రామచంద్రం అంతా తిన్నట్లు అవుతుంది.

కొండల్‌రావు రామచంద్రంకు అప్పివ్వడాని కంగీక రించాడు.

అదృష్టవశాత్తూ పొలానికి మంచిబేరం వచ్చింది. ఎకరాని కిరవై రెండువేలు.

కొండల్‌రావు మొత్తం నాలుగెకరాలూ అమ్మేశాడు. అయ్యన్నకి పన్నెండువేలు బాకీ తీర్చి—ఆపైన యాభై వేలు రామచంద్రానికి అప్పుగా కూడా యిచ్చాడు. పది హేనువేలు కొడుక్కి డొనేషన్‌గా కట్టాడు. మిగతా డబ్బుకూడా వృధా చేయకుండా కొడుకు చదువు ఖర్చులకి పనికొస్తుందని బ్యాంకులో వేసి ఉంచాడు.

ఆయన ఉత్సాహంగా కూతురికి సంబంధాలు చూడ సాగాడు. అప్పుడన్ని విధాలా మంచి సంబంధమొకటి వచ్చింది.

అబ్బాయి యింజనీరు. బాగా ఆస్తిపరుడు. లాంఛనా లతో సహా కట్నం పాతికవేలే అడిగారు.

రామచంద్రం తిరిగిస్తాడు కదా అని కొండల్‌రావు ధైర్యంగా ఉన్నాడు. కానీ జానకి పెళ్ళిచూపులైన రెండు వారాలకే రామచంద్రం నుంచి పిడుగులాంటి ఉత్తరం వచ్చింది.

"బావా!

వ్యాపారంలో గట్టిదెబ్బ తిన్నాను. నీకు నా ముఖం చూపించలేను. నీ బాకీ తీర్చాలంటే నా జీవితం ధార పోయాలి. ప్రస్తుతానికదే నా జీవిత ధ్యేయం. కానీ అది నెరవేరడాని కెన్నేళ్ళు పడుతుందో నాకు తెలియదు. అక్కయ్యకీ విషయం చెప్పకు. దానికి నేనంటే అను మానం.

నావల్ల నీ కన్యాయం జరిగినా — చల్లని మనసున్న నీకు భగవంతుడి సాయం ఎప్పుడూ ఉంటుంది. సెలవు.

నీ

రామచంద్రం."

కొండల్‌రావు ఉత్తరాన్ని భార్యకు చూపించాడు. సీతారావమ్మ వెంటనే బయల్దేరి తమ్ముడి వద్దకు వెళ్ళి నానా మాటలూ అంది. రామచంద్రం ఆమె తిట్లన్నీ భరించి - "అక్కా! దేవుడు నామీద పగబట్టాడు. నా రోజులు బాగో లేవు" అని ఊరుకున్నాడు.

"సిగ్గులేని వెధవ!" అని కసిగా తిట్టింది సీతారావమ్మ. ఆ తిట్లామెకు యాభయి వేలూ తెచ్చిపెట్టలేదు. ఆమె యింటికి తిరిగి వెళ్ళింది.

ఇంట్లో అంతా దిగులుపడిపోయారు.

"ఇల్లమ్మేస్తాను ...." అన్నాడు కొండల్‌రావు.

అప్పుడు మొదటిసారిగా ఆ యింట్లో జానకి నోరు విప్పి - "ఇల్లమ్మిన డబ్బుతో నేను పెళ్ళి చేసుకోను" అంది.

"నోర్ముయ్ - ఇది నీకు సంబంధించిన విషయం కాదు" అంటూ కసిరింది తల్లి.

జానకి తల్లి నెదిరించబోయి - తండ్రి మరింత కఠినంగా మందలించడంతో నోరు మూసుకుంది. అయితే గుట్టుచప్పుడు కాకుండా తను చేయాల్సింది చేసింది.

ఇంటి పరిస్థితులు వివరిస్తూ పెళ్ళికొడుక్కు ఉత్తరం రాస్తూ - కట్నం లేకుండా పెళ్ళి చేసుకోమని కోరిందామె. దానికి బదులుగా - ఈ సంబంధం వదులుకుంటున్నట్లు పెళ్ళికొడుకు తండ్రి కొండల్‌రావుకు వుత్తరం రాశాడు. ఉత్తరంలో జానకి ప్రవర్తనకు ప్రత్యేకంగా నిరసించాడు.

కొండల్‌రావు కూతుర్ని పిలిచి నానా మాటలూ అన్నాడు.

"నేనూ చదువుకుంటున్నాను. ఉద్యోగం చేస్తాను. పెళ్ళి చేసుకోకుండా - కట్నముంటే తప్ప నన్ను పెళ్ళి చేసుకోననే మగ వెధవలకు దూరంగా ఉంటాను" అంది జానకి. ఎలా పెళ్ళి చేసుకోవో చూస్తానని తల్లి అంటే - ప్రతి పెళ్ళికొడుక్కూ- ఇలాగే ఉత్తరాలు రాస్తానని తల్లిని బెదిరించిందామె.

కూతురు బెదిరింపులకు లొంగదని తెలిసేక తలిదండ్రు లామెను మంచి మాటలతో లొంగదీసుకోవాలనుకున్నారు. కుటుంబం అప్పుడెన్ని కష్టాల్లో ఉన్నదీ చెప్పుకుని- ముందు ముందు జానకి పెళ్ళి మరింత కష్టమవుతుం దన్నారు.

అయితే అప్పుడు జానకి పెద్ద బాంబు పేల్చింది.

"మీది పాత తరం. మీ పద్ధతిలో మన చుట్టూ నేరస్థు లేర్పడ్డారు. ఆ కారణంగా మనకున్నదంతా దుర్వినియోగ మవుతోంది. మీరు చెప్పిన కష్టాలూ, ఇబ్బందులూ మీ వల్లనే వచ్చాయి. నాది కొత్తతరం. మన చుట్టూ వున్న నేరస్థుల మనసుల్లో పరివర్తన తీసుకుని వచ్చి మన పరి స్థితులు మెరుగుపర్చడానికి - కొన్నాళ్ళపాటు ఇంటిపెత్తనం నాకివ్వండి. ఇల్లమ్మకుండానే రెండు మూడేళ్ళలో నా కట్నం డబ్బులు నిలవేస్తాను...." అందామె.

దీనిమీద ఇంట్లో పెద్ద రాద్ధాంతం జరిగింది. కొండల్ రావు మాత్రం కూతురి మాటలు సవాలుగా తీసుకున్నాడు.

కటింగులన్నీ పోనూ తనకువచ్చే నెల జీతం పన్నెండు వందలూ కూతురి చేతికే యిస్తే- అన్నీ ఆమెకే తెలిసి వస్తాయని ఆయన అనుకున్నాడు.

అందుకే - "సరే నీ యిష్టం!" అన్నాడు కొండల్ రావు.

## 4

జానకి వెంటనే రంగంలోకి దిగింది.

ఆమె లంకంత కొంపను నాలుగు వాటాలు చేసి ఒక వాటాలో తను, తల్లి, తండ్రి ఉండేలా ఏర్పాటుచేసి మిగిలిన మూడు వాటాలూ అద్దెకిచ్చింది.

మొదట్లో ఇల్లు ఇరుకనిపించినా నెలకు ఆరువందల రూపాయల అదనపు ఆదాయం అద్భుతమనిపించింది కొండల్ రావుకి. పెద్దింట్లోంచి చిన్నింట్లోకి మారడంలో చాలా ఖర్చులు ఆదా అయ్యాయి. ముఖ్యంగా కరెంటు ఖర్చు. ఒకప్పుడు నెలకు వందరూపాయలు దాటేది— ఇప్పుడు పాతిక్కిలోపే అయింది. ఇంటి కవసరమైన ఫర్నిచరుంచుకొని మిగతాది అమ్మేస్తే—మూడువేల రూపాయలు వచ్చాయి. చిన్నిల్లు కావడంవల్ల పనిమనిషినికూడా మానిపించేయడంలో మరో పాతిక రూపాయలు ఆదా అయ్యాయి.

అటుపైన వారికి పెద్దపెరడుంది. గతంలో ఉండే పూల మొక్కల స్థానంలో జానకి కూరమొక్కలు, పాదులు వేసింది.

జానకి తెలివితేటలకు తలిదండ్రులు ముచ్చటపడ్డారు. అందుకు జానకి "ఇందులో నా తెలివితేటలేమీ లేవు. మీది గమ్యం తెలియని పయనం. నాకు నా గమ్యం తెలుసు" అంది.

ఇంటికి అక్క వచ్చింది. భోజనం పెట్టి ఆదరించడం మినహాయించి ప్రత్యేకమైన కానుకలేవీ యివ్వరాదంది జానకి. దీనిమీద కొండల్ రావు పెద్ద రాద్ధాంతం చేశాడు.

ఆ రాద్ధాంతం చూసి జానకి అక్క ఏమీ తీసుకోనని తండ్రికి చెప్పేసింది.

కూతురు మనసుకు కష్టం తోచిందని గ్రహించి— "నువ్వు పెత్తనం పేరుతో—అయినవాళ్ళను నాకాకుండా చేస్తున్నావు" అన్నాడు కొండల్‌రావు జానకితో.

"నువ్వు కష్టంలో ఉన్నప్పుడాదుకునేందుకు వాళ్ళు అయినవాళ్ళు కారు. నీకు శక్తిలేక ఏమీ యివ్వలేకపోతే ఆ కోపంలో వాళ్ళు నీకు కానివాళ్ళైపోతారు. అలాంటి వాళ్ళను అయినవాళ్ళనడమే సిగ్గుచేటు...." అంది జానకి.

ఈ మాటలే జానకి అక్కతో కూడా అంది.

అక్క ఆశ్చర్యపడి—"ఇలా నేనెప్పుడూ ఆలోచించ లేదు. జీవితం ఓ పద్ధతిలో వెళ్ళిపోతోంది" అంది.

"నువ్వు నేరస్థురాలివి. నాన్న నిన్నలా తయారు చేశాడు" అంది జానకి.

అక్క అసంతృప్తిగా—"నీకు పెళ్ళయ్యాక నువ్వెలా గుంటావో చూస్తానుగా" అంది.

"అక్కా! ఇది నువ్వు సవాలుగా తీసుకోకు. మన ఆలోచనల్లో మార్పు రావాలి. కొన్నేళ్ళు పోయాక—నేనూ నువ్వు చేసిన తప్పే చేస్తే—మీరందరూ నన్ను తప్పుపట్టి బుద్ధిచెప్పాలి తప్ప—హేళనచేసి ప్రతీకారం తీర్చుకోవాలనుకోకూడదు...." అంది జానకి వెంటనే.

చాలామంది ఆడపిల్లలకు లాగే జానకి అక్కకూడా— అంతదూరం ఆలోచించదల్చుకోలేదు. అందువల్ల ఆమె క్రమంగా పుట్టింటికి రాకపోకలు తగ్గించింది.

తలిదండ్రులకి పోకెట్ మనీగా నెలకు వందరూపాయలిచ్చేది జానకి. ఇంటి ఖర్చులన్నీ తనే చూసుకునేదామె.

పండుగ బట్టలుకూడా తనే కొనేదామె. ఎటొచ్చీ ఆమె కొనే బట్టలు తక్కువ ఖరీదువి.

ఇంటి అద్దె, ఆదా చేస్తున్న పనిమనిషి జీతం, ఇతర నిల్వలు—ఆమె బ్యాంకులోనో, పోస్టాఫీసులోనో దాచేది. ఆ విధంగా—మొదటి సంవత్సరంలోనే పదివేల రూపాయలు నిలవేసిందామె.

దర్జా కొనసాగనందుకు కొండంల్‌రావుకు అసంతృప్తిగా ఉన్నప్పటికీ—జానకి నిలవేస్తున్న డబ్బు — ఆయన బలాన్ని పెంచుతోంది.

జానకి బియ్యే ప్యాసయింది. బియ్యీడీ చేసింది.

కొండల్రావు రిటైరయ్యేసరికి బియ్యే బియ్యీడీగా సిద్ధంగా ఉన్న జానకికి—కమిటీ స్కూలువారు ఆయన స్థానంలో ఉద్యోగమిచ్చారు.

ఇప్పుడు జానకి నిజంగా ఆ యింటి యజమానురాలయింది.

అప్పుడు సీతారావమ్మ భర్తను పోరడం మొదలెట్టింది.

జానకి తను పెళ్ళిచేసుకోనంది.

"కూతురి జీతాని కాశపడి పెళ్ళిచేయడం లేదని—అంతా మమ్మల్నాడిపోసుకుంటారు. ఆ విధంగా మమ్మల్ని నేరస్థుల్ని చేయకు....'' అన్నాడు కొండల్‌రావు.

అలాంటి అపవాదుకు తండ్రి తట్టుకోలేడని జానకికి తెలిసింది. అందుకే ఆమె మోహన్‌రావుతో పెళ్ళికి ఒప్పుకుంది.

ఆ ఊళ్ళోనే వుంటున్నాడు మోహనరావు. జానకి తన కుటుంబాన్ని దిద్దుకుంటున్న తీరును చూసి అతడు ముచ్చటపడ్డాడు. తలిదండ్రులకు ఉత్తరం రాశాడు.

సంబంధం కుదిరింది. జానకి పెళ్ళైపోయింది.

ఆ యింట్లో కొండల్‌రావూ, సీతారావమ్మా మిగిలారు.

"నువ్వు లేకుండా—ఈ సంసారమెలా గడుస్తుంది?" అంటూ బాధపడింది సీతారావమ్మ.

"అమ్మా! సంసారంలో యింతవరకూ నేను చేసిం దేమీ లేదు. వృధాగా ఏదీ పోకుండా నిలబెట్టాను. మొద ట్నించీ మీరూ ఈమాత్రం జాగ్రత్తగా ఉన్నట్లయితే— మనమిప్పుడింకా ఎంతో వైభవంగా ఉండేవాళ్ళం...." అంది జానకి.

"వెధవ—ఇదంతా మీ మావయ్య మూలంగా వచ్చింది" అంది సీతారావమ్మ తమ్ముడి మోసం గుర్తుచేసుకుని.

"అమ్మా! నాకు మావయ్యమీద కోపంలేదు. మనం ఖర్చుపెట్టే పద్ధతిలో ఆ యాభై వేలూ ఎప్పుడో పోయుం డేవి. మావయ్య మూలంగానే ఇంటి పెత్తనం నాకు వచ్చింది. మనింటి పద్ధతులు మారాయి...." అంది జానకి.

అయితే రామచంద్రం ఆ యింట్లో మరో సంచలనం కలిగిస్తాడని అప్పుడు జానకికి కూడా తెలియదు.

## 5

మోహనరావు జానకి వ్యక్తిత్వానికి ప్రత్యేక గౌరవ మిచ్చాడు. అందువల్లె ఆమె తను కోరే కొత్త సంప్ర దాయాన్ననుసరించ గలిగింది. వేరు కాపురానికి వెళ్ళాక ఆమె ఏటా పండుగలకు తన అత్తమామలతో పాటు తలి దండ్రులకూ కొత్తబట్టలు కొనేది.

చెల్లెల్ని చూసి పెద్దకూతురు కూడా కొండల్‌రావుకు బట్టలు పెట్టడం మొదలుపెట్టింది. ఆడపిల్లలే తలిదండ్రుల నాదరిస్తూంటే తా మూరుకుంటే బాగుండదని కొడుకులు కూడా తమ శక్తికొద్దీ తలిదండ్రులకు కానుక లిచ్చుకోవడం

మొదలుపెట్టారు.

కొండల్‌రావు కిప్పుడు పూర్వపు దర్జాలేదు. కానీ సుఖ సంతోషాలున్నాయి. ఆయన జీవితమే తమకొక ఉదాహరణగా భావించి పిల్లలు కూడా జాగ్రత్తగా మసలడం నేర్చుకున్నారు.

ఈ పరిస్థితుల్లో మురళి ఇంజనీరింగు చదువు పూర్తయింది. అతడి కారణంగా కొండల్‌రావు పరపతి మరింత పెరిగింది. ఆయన కుటుంబ సంప్రదాయాన్నీ, మురళి చదువునూ చూసి—ఎక్కడెక్కడినుంచో సంబంధాలు రాసాగాయి. అలా వచ్చినవాటిలో రామచంద్రం సంబంధం కూడా ఉంది.

సీతారావమ్మ తమ్ముణ్ని చీదరించుకుని "నీతో సంబంధం చేసుకోవడమంత తెలివితక్కువ వేరే ఉండదు" అంది.

"మా రాధంటే మురళీ కిష్టం. రాధకూడా మురళిని తప్ప చేసుకోనంటోంది" అన్నాడు రామచంద్రం.

జరిగిందేమిటంటే రామచంద్రం పట్నంలో ఉంటున్నాడు. అక్కడే కాలేజీ హాస్టల్లో మురళి ఉండేవాడు. మురళికీ, రాధకూ పరిచయమై - అది ప్రేమగా కూడా మారింది. పిల్లలచేత అవుననిపించుకున్నాకే రామచంద్రం పెద్దల దగ్గరకు వచ్చాడు.

"నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. కుర్రాణ్ణి అమాయకుణ్ని చేసి వల్లో వేసుకున్నావన్న మాట! అప్పుడు బావనూ యిలాగే మోసం చేశావు. ఈసారి నీ ఆటలు సాగనివ్వను...." అంది సీతారావమ్మ కోపంగా.

"అప్పుడు మోసం చేశాననేగా - నీ కోపం! ఇప్పుడు యాభయి వేలూ కట్నంగా యిచ్చుకుంటే నీ కోపం పోతుందా?" అన్నాడు రామచంద్రం.

"నువ్వు కట్నం కూడా యిస్తావా?" అంది సీతా రావమ్మ.

"అంటే నువ్వు నన్ను మోసం చేశావా?" అన్నాడు కొండల్‌రావు.

"బావా - నిన్నొకరు మోసం చేయాలా? మోసపోవడానికి నువ్వెప్పుడూ రెడీయేకదా!" అన్నాడు రామచంద్రం.

"వాడి మాటలు నమ్మకండి. కట్నమిస్తానని మళ్ళీ మోసం చేస్తాడు. ఈ పెళ్ళి జరగదు...." అంది సీతా రావమ్మ.

"పెళ్ళి చేసుకునేది మురళి. కాదంటే వాడు మీ మాట వినడు. అవునంటే మీ మర్యాద దక్కుతుంది" అన్నాడు రామచంద్రం.

సీతారావమ్మకు రక్తం మరిగింది.

"సరే - నేను వాడితోటే మాట్లాడుతాను" అందామె.

రామచంద్రం వెళ్ళిపోయాడు.

తర్వాత కొండల్‌రావు, సీతారావమ్మ మురళిని పిలిచి పెళ్ళి గురించి మాట్లాడారు.

"నేను రాధను తప్ప ఇంకెవర్నీ పెళ్ళి చేసుకోను. ఈ పెళ్ళి మీ కిష్టం లేకపోతే ఆజన్మబ్రహ్మచారిగా ఉండి పోతాను" అన్నాడు మురళి.

"నీ మామయ్య నీచుడు. దుర్మార్గుడు. అయినవాళ్ళనే మోసం చేశాడు" అంది సీతారావమ్మ.

"నేను పెళ్ళి చేసుకునేది మావయ్యను కాదు. రాధను...."

"ఈ పెళ్ళి కూడా వాడి మోసంలో ఒక భాగం...."

"నేను నమ్మను...."

"అయితే ఒక పని చేయి. మన బంధువుల్లో నీ మావయ్యను గురించి ఏం చెప్పుకుంటున్నారో తెలుసుకుని రా!" అంది సీతారావమ్మ.

"ఎందుకు?"

"ఎటువంటి కుటుంబంతో నేను వియ్యమందబోతున్నానో తెలుసుకుంటావని!" అన్నాడు కొండల్‌రావు.

మురళి ఏమనుకున్నాడో అంగీకరించాడు.

రెండు వారాల్లో అతడి తల తిరిగిపోయింది. అతడు వెంటనే రామచంద్రాని కుత్తరం రాశాడు.

రామచంద్రం రెక్కలు కట్టుకుని కొండల్‌రావింటికి వచ్చాడు.

"మావయ్యా! మన బంధువర్గంలో నిన్నందరూ పరమ నీచుడని అనుకుంటున్నారు...." అన్నాడు మురళి.

"దాన్ని బట్టయినా నా త్యాగం మీరర్థం చేసుకోవాలి" అన్నాడు రామచంద్రం వెంటనే అక్కా, బావల వంక చూస్తూ.

"త్యాగమా?" అంది సీతారావమ్మ.

"అవును - త్యాగమే!"

"ఎలా?"

"నా కిచ్చిన యాభయివేలతోటీ మీరు జానకి పెళ్ళి చేయాలనుకున్నారు. ఆ యాభయి వేలూ మీకు దక్కని మాట నిజం. కానీ ఇంట్లో ఏ మిబ్బంది వచ్చింది? జానకి పెళ్ళి కూడా అయి సుఖంగా కాపురం చేసుకుంటోంది."

"అయితే?"

"పిల్లిని ఓ గదిలో పెట్టి నాలుగు తలుపులూ వేశామంటే అది పులిగా మారుతుంది. బావా! నువ్వు లేని పోని దర్జాలకు పోయి - ఉన్నదంతా తగలేసుకుంటున్నావు.

ఏదారీ లేకుంటే తప్ప నీ పద్ధతిలో మార్పు రాదు. నీకు కనీసం ఆ యాభయి వేలయినా మిగల్చాలని నీ దగ్గర అప్పడిగి తీసుకున్నాను. నీ డబ్బును పెంచాలని దాంతో షేర్లు కొన్నాను. యూనిట్లు కొన్నాను. అదిప్పుడు రెట్టింపుకు పైగా అయింది.

ఆ డబ్బును నీ డబ్బుగా భావించి అందులోంచి ఒక్క పైసా కూడా ముట్టుకోలేదు. ఆ డబ్బంతా రాధ ద్వారా మీ కుటుంబాని కందజేయాలనుకున్నాను. నా ప్రయత్నంలో నేను సఫలుడినయ్యాను. కానీ అందుకోసం ఎన్ని అపవాదులు వచ్చాయి? ఎలాంటి మాటలు పడ్డాను? నేను తల్చుకుంటే రాధ కిప్పుడు లక్షకుపైగా కట్నమిచ్చి వేరే సంబంధం చూడగలను. కానీ నేనుపడ్డ మాటలన్నీ మీ కోసం! అది వృధా కాకూడదు....” అన్నాడు రామచంద్రం.

“అంతా అబద్ధం. పెళ్ళి కోసం ఇప్పుడు ప్లేటు ఫిరాయిస్తున్నావు....” అంది సీతారావమ్మ.

“ఆగవే” అన్నాడు కొండల్‌రావు. ఆయన ఆలోచిస్తున్నాడు. రామచంద్రం ద్వారా యాభయివేలూ పోయుండకపోతే ఆ డబ్బు జానకి పెళ్ళికి ఖర్చయేది. తర్వాత యిల్లమ్మాల్సి వచ్చేది. చివరికే ఆధారమూ లేక కన్నకొడుకులమీద ఆధారపడి వారిచేత ఛీత్కరించబడవలసి వచ్చేది. జానకి తన కెదురు తిరిగిందంటే-అందుకు రామచంద్రమే కారణం.

“ఏమిటండీ?” అంది సీతారావమ్మ.

“మన చుట్టూ మంచివాళ్ళుగా కనిపించే నేరస్థులుంటారు. వాళ్ళు కన్నబిడ్డలు. అలాగే మన చుట్టూ నేరస్థుల్లా

కనిపించే మంచివాళ్ళుంటారు. రామచంద్రం ఏ ఉద్దేశ్యంతో నన్ను మోసం చేసినా అది మనకు మంచినే చేసింది. కాబట్టి రాధ మన కోడలవుతుంది" అన్నాడు కొండల్‌రావు.

వృధాగా పోవాల్సిన యాభయివేలూ లక్షగా మారి కట్నం రూపంలో వస్తూంటే తననే ఒక నేరస్థుడిగా నిరూపిస్తున్నట్లు ఫీలై కొండల్‌రావా మాటలన్నాడన్న విషయం ఆయనకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు.

అర్థం లేని సంప్రదాయాలతో ఉన్నది తగలేసుకుంటూ, లేనిపోని మెహర్బానీలతో అప్పులపాలవుతూ బ్రతికే మధ్యతరగతివాళ్ళు - తమలోని, తమచుట్టూ వుండే నేరాలను గుర్తిస్తే - అవినీతికి దూరంగా ఉంటూ కూడా - సుఖజీవితాన్ని గడపగలుగుతారనడానికి కొండల్‌రావు జీవితం ఒక ఉదాహరణ. □

## పిచ్చి డాక్టర్!!



# ప్రజ్ఞ

## రాజశేఖర పాండే

సాయంత్రం ఏడుగంటలైంది........

అద్దం ముందు నిలబడి పదిహేనోసారి నా టెర్లిన్ సూట్‌ను చూసుకొని, మళ్ళీతల దువ్వుకున్నాను. క్షణాలు యుగాల్లా వున్నాయి. తలతిప్పి ఈజీ చైర్‌వైపు చూశాను.

జ్వాలాసింహగారు ఈజీచైర్‌లో కూర్చొని తాపీగా

పేపరు చదువుకుంటున్నారు. ఇప్పుడప్పుడే లేచేటట్లు లేరు.

నా ఒళ్ళు మండిపోతోంది. అవతల ప్రఖ్యాత సినిమా తార కుముదినీ దేవి జ్వాలాసింహకు తన వివాహ సందర్భంగా విందు ఇవ్వబోతోంది. విందు పదిగంటలకైనా జ్వాలాసింహగారిని ఎనిమిది గంటలకల్లా వచ్చేయమంది. మరి ఈయనేమో ఇంకా కదలడంలేదు.

మెల్లగా వెళ్ళి ఆయన ప్రక్కనే నిలబడ్డాను.

జ్వాలాసింహగారు మెల్లగా కళ్ళుతెరచి "టైమెంతయింది?" అన్నారు.

నేను వెంటనే సంతోషంగా "ఎనిమిదవస్తోంది" అన్నాను.

ఆయన తాపీగా తలపంకించి మళ్ళీ ఆరిపోయిన చుట్ట వెల్గించారు. నాకు విసుగెత్తింది.

"మనం కోడంబాకం వెళ్ళాలనుకుంటాను." అన్నాను మెల్లగా.

ఆయన చిన్నగా నవ్వి "వెళదాం, నీ ఆదుర్దా నాకు తెలుసు. నేను స్నానం చేస్తాను"—అని పైకి లేచారు.

ఆయన వెళుతుంటే వెనకనుంచి చూస్తూ నిల్చున్నాను. జ్వాలాసింహ! ప్రఖ్యాత డిటెక్టివ్! శత్రువులకు సింహ స్వప్నం! భారీ విగ్రహం—కోరమీసాలు—ఎప్పుడూ పెదవులపై వెలిగే దరహాసం!

ఆయనంటే నాకు చెప్పలేనంత గౌరవం....అంతకు మించిన అభిమానం! నన్ను ఒకానొక ఆపదనుండి గట్టెక్కించి, ఉరికంబం బారి పడకుండా కాపాడారు. అప్పటి నుంచీ ఆయన్నంటి పెట్టుకొనే తిరుగుతున్నాను. కాని ఇంకా ఆయన మేధా సంపత్తిని అర్థం చేసుకోలేక పోతున్నాను. ఆయన తిరగని దేశం, తెలియని విషయం

అంటూ వుండవేమో అన్పిస్తుంది. ఆయన ఛేదించిన అనేక కేసుల్లో, నేనుకూడ సాయం వున్నాననే గర్వంతో వుప్పొంగుతుంటాను.

"వెళ్దామా!" అన్నమాటతో ఆలోచనలు కట్టిపెట్టి ఆయన ననుసరించాను.

టాక్సీ పరుగెడుతోంది....

గుప్పు గుప్పుమని సింహాగారు వదిలే పొగలు టాక్సీ నిండా మేఘాలు సృష్టిస్తున్నాయి.

"కుముదిని పెళ్ళయి సంవత్సరం దాటిందికదా! ఇప్పుడు పార్టీ ఏమిటి సార్? దొంగలు పడిన ఆరునెల్లకు...."

"ఆ సామెత అనవసరం....నేను ఇన్నాళ్ళూ మద్రాసు రాలేదు. అందుకే ఇప్పుడు పార్టీ యిస్తూంది కుముదిని."

"అసలు కుముదినితో మీకు పరిచయం!" ప్రశ్నించాను. నన్ను ఎన్నో రోజులనుంచి వేధిస్తున్న సమస్య ఇదొక్కటి!

"అదా! చాలా చిన్న విషయం....కుముదినిని బ్లాక్ మెయిల్ చేయడానికి కొన్ని దొంగ ఫోటోల ద్వారా ప్రయత్నాలు జరిగాయి. కుముదిని కారుడ్రయివర్ సాయంతో ఓ ముఠా డబ్బుగుంజే ప్రయత్నాలు సాగించింది. అప్పుడు ఆమె మద్రాసులో వున్న నా సాయం కోరింది. నేను పరిశోధిస్తూండగా అది చాలా పెద్ద ముఠా అని; కుముదినిని హత్యచేయడం ఖాయమని అర్థమైంది. తర్వాత ఆ ముఠా సపరివారంగా కటకటాల వెనక్కి కాపురానికి వెళ్ళింది. కాని—ఆ కృతజ్ఞతే ఈనాటికీ కుముదినిలో మిగిలింది."

తను చేసిన పనికి ఆయనకళ్ళు గర్వంతో మెరవడం లేదు. ఏదో గొప్ప సాధించానని అహం కన్పించలేదు.

తాపీగా హాయిగా చుట్ట కాల్చుకుంటూ చెప్పాడాయన విషయాన్ని.

పాండీ బజార్లో కుముదినికి బహుమానం యివ్వడానికి ఏవో తీసుకొన్నారాయన. తర్వాత టాక్సీ కోడంబాకం వైపు పరుగెత్త సాగింది.

కుముదినిని నేను చాలా పత్రికల్లో. సినిమాల్లో చూశాను. కాని ఇంతవరకు స్వయంగా చూడలేదు. ఇన్నాళ్ళకు గురువుగారి మూలంగా చూడబోతున్నాను. వీలుంటే ఓ పోజుకూడా విసరాలని, నా తెలివి తేటలు చూపాలని మనసులో ఓ మూల నిశ్చయం ఏర్పడింది. కుముదిని ముందు ఆమె హీరోలకంటే స్టైయిల్‌గా హావభావాలు, వీలుంటే ధైర్యసాహసాలు ప్రదర్శించాలని. దానితో ఆవిడ గుమ్మైపోయి....హా! ఆలోచనలు చాలా దూరం పోతున్నాయి.

కమ్మని కలల కంటూ సీటుపై వాలి కళ్ళు మూసుకున్నాను.

## 2

"రండి....రండి మీ కోసమే ఎదురుచూస్తున్నాము" అంది కుముదిని ఎదురునచ్చి స్వాగతం పల్కుతూ.

"కులాసాగా వున్నావా అమ్మాయ్." అని ఆప్యాయంగా ఆవిడను పలుకరించారు జ్వాలాసింహగారు. తర్వాత నన్ను చూపించి "ఇతను నా ఆప్తుడు. పేరు రాకెట్ రావు," అన్నారు.

కుముదిని ఓసారి నన్ను చూసింది. ఆ క్షణంలోనే కారులో రిహార్సల్సు వేసుకొన్న పోజులన్నీ కలిపి ఒకే పోజు బ్రహ్మాండంగా వేసి పారేశాను.

"లోపలికి వెళ్దాం పదండి....రండి సింహగారూ....

మీ పేరేమిటి? మర్చిపోయాను"

"రాకెట్ రావు" అన్నాను చటుక్కున.

"ఇంకానయం. స్పుట్నిక్ శాస్త్రి, చందమామయ్య అని పెట్టుకున్నారుకారు....రండి—" అంది కుముదిని లోపలికి దారితీస్తూ.

నాకు ఒక్కక్షణం ఆమె అవహేళనకు కోపం ముంచుకొచ్చింది. కాని ఆమె అందాన్ని చూసి పాపం! అని క్షమించేసి లోపలికి నడిచాను.

"వీరు మావారు కోమలీ స్టూడియోస్ ఆర్ట్ డైరెక్టర్ కెంపొరాజ్" అని భర్తను పరిచయం చేసింది. షేక్ హాండ్స్ యిచ్చుకున్నాము.

కెంపొరాజ్ లావుగా పొడుగ్గా వున్నాడు-వాడి ముఖంలో ఏమి కళవుంది ఆర్ట్ డైరెక్టర్ అయ్యాడో తెలియలేదు. దుబ్బుమీసాలు గండు పిల్లి ముఖం—కుముదిని ఎలా ప్రేమించిందో?

లోపల హాలులాటి గదిలోకి ప్రవేశించాము. లినో లియంతో గది అందంగా మెరుస్తోంది. మధ్యలో రోజ్ వుడ్ రౌండ్ టేబుల్, చుట్టూ అరిస్టోక్రాటిక్ చెయిర్స్ - వాటిలో కళ కళలాడే అతిథులు.

"వీళ్ళు నా ఆప్తవర్గంలోని వారు-" అని అందర్నీ పరిచయం చేసింది. అందరూ ప్రౌఢ్యూసర్లు, ముఖ్యమైన సాంకేతిక నిపుణులు.

"ఈయన మీలో చాలా మందికి తెలిసే వుంటారు. అపరాధ పరిశోధన ఈయన వృత్తి. గొప్ప వేదాంతి కూడా. నాకు మరువలేని మహోపకారం చేసిన ఘనుడు. ఈయన వారి అనుచరుడు రాకెట్ రావు."

కొందరు నోరు తెరుచుకు చూశారు. కొందరు మహా

గొప్పగా చూశారు. ఉలెన్ సూట్‌లో దాక్కున్న నా హృదయం ఉప్పొంగిపోయింది. నాగేశ్వర్రావులా శూన్యంలోకి ఓ పోజువిసిరి నిలబడ్డాను.

టైము సరిగ్గా 8.00 గంటలైంది....

"నేను స్నానంచేసివస్తాను కూర్చోండి" అని లోనికి వెళ్ళిపోయి "అన్నట్లు డైరెక్టర్ సతీష్‌బాబు వచ్చారా?" అనడిగింది భర్తను కుముదిని.

"లేదు....ఇందాకే డ్రైవర్ని పంపాను...." అన్నాడు కెంపారాజు.

"వాడు వెళ్ళలేదు. లోపలే వున్నాడు....ఆయన ముఖ్యంగా రావల్సినవాడు. డ్రైవర్ని త్వరగా పంపాలి." అని లోపలికి వెళ్ళిపోయింది కుముదిని.

"అంతదాకా రెండాటలు వెయ్యండి." అని రెండు కొత్త పేక సెట్లు ఇచ్చాడు కెంపారాజు.

కట్ జోకర్ మొదలయింది....ఇంతలో బైటికివెళ్తున్న డ్రైవర్ని చూసి—"ఇంకా ఇక్కడెందుకున్నావ్? ఊ! క్విక్ ....సతీష్‌బాబుగార్ని, వారి భార్యను - పిల్లల్ని కూడా తీసుకురా!" ఎగిరిపడ్డాడు కెంపారాజు....వాడు బయటకు పరుగెత్తాడు. కెంపారాజు కూడా పనులమీద బయటకు, లోపలికి తిరగసాగాడు.

ఇవేవీ పట్టించుకోకుండా ఆటలో నిమగ్నమైనాను. రైజు పడటంలేదు. కాని ముక్కలుచూస్తే పారెయ్యబుద్ధి కావడంలేదు. ఓసారి కౌంటిచ్చుకొన్నాను. అందుకే శ్రద్ధగా ఆడుతున్నాను.

జ్వాలాసింహగారు ఆడటంలేదు. తాపీగా తియ్యటి కలలు కంటూ కళ్ళు మూసుకుని చుట్టకాలుస్తున్నారు.

చాలాసేపు గడిచింది....కెంపొరాజ్ హడావుడిగా సింహగారి పద్దకువచ్చి ఏదో చెప్పాడు. సింహగారు చటుక్కున లేచి, ఆయనతో కూడా అవతలకు వెళ్ళి అయిదు నిముషాలు మాట్లాడారు.

"రాకెట్!" ఆయన పిల్చారు.

ముక్కలు టేబులుమీద పడేసి వెళ్ళాను. కెంపొరాజ్ ముఖం చాలా ఆదుర్దాగా, గాబరాగా వుంది.

"ఏం జరిగింది?" అడిగాను.

"కుముదిని కన్పించడంలేదు...." దీనంగా అన్నాడు కెంపొరాజ్.

"ఏమయింది?" అడిగాను, కంగారుగా.

కెంపొరాజ్ ఏదో చెప్పబోయాడు. ఇంతలో అతిధులందరూ గుమిగూడి ప్రశ్నలు వేయసాగారు. వారందరికీ క్లుప్తంగా సమాధానం చెప్పి, కెంపొరాజ్‌ను ప్రక్క గదిలోకి తీసుకు వెళ్ళారు సింహగారు.

"రాజుగారూ! కుముదినిని మీరు ప్రేమించే పెళ్ళి చేసుకున్నారా?"

"అవును...."

"ఆమెను ద్వేషించే వాళ్ళెవరైనా వున్నారా?"

నవ్వాడు కెంపొరాజ్...."ఇది ఫిలిం ఇండస్ట్రీ; ద్వేషాలు, మోసాలు ఇక్కడ నిత్యకార్యక్రమాలు; ఒక తార ఎంతమందికి ఇష్టమయితే, అంతకు మించిన ద్వేషం గల వాళ్ళూ వుంటారు."

నాకింకా చాలా ప్రశ్నలు వేయాలన్పించింది. కాని సింహగారు మాట్లాడకుండా వక్కపొడి పొట్లం శుభ్రంగా విప్పి నమలసాగారు. ఆయన ఏదో తీవ్రంగా ఆలోచిస్తూన్నారని నా కర్థమైంది.

"కుముదిని బాత్ రూంలోకి వెళ్లేటప్పు డెవరన్నా చూశారా?"

"పని పిల్ల రాజ్యం చూసిందిట. ఆవిడ వెళ్లాక ఈ పని మనిషి ఇంకో పనిమీద వెళ్ళింది. పదినిముషా లయ్యాక మళ్ళా చూస్తే బాత్ రూంలో లేదు. తలుపులు తెరచిఉన్నాయ్. బట్టలు కట్టుకుంటోందేమోనని చూస్తే, స్టాండుపై బట్టలలాగే వున్నాయి. ఇల్లంతా వెదకినా కన పడలేదు."

"బాత్ రూంకు వెళ్దాం పదండి" అన్నాడు సింహ.

బాత్ రూంలో ఓ పెద్ద టబ్ వుంది. దానికి అటాచ్ చేసి ఓ గొట్టం, క్రిందపైపు వున్నాయి. నేనాగదంతా వెదుకు తున్నాను. హంతకుడు తెలివైన వాడులా వున్నాడు.... ఒక్క సిగరెట్ పీక గూడా పారెయ్యలేదు.

"ఈ గొట్టం దేనికి? పైపు దేనికి?" అడిగారు సింహ గారు.

"ఈ టబ్ లో స్నానం చేశాక నీళ్ళు ప్రక్క గొట్టం గుండా బయటకు వెళ్ళిపోతాయి. నీళ్ళు నిండాక మనకు కావలసినంత మేరకు తగ్గించుకోవడానికి ఈ క్రిందిపైపు ఉపయోగపడుతుంది." వివరించాడు కెంపొరాజు. సింహ గారు ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నారు.

"సతీష్ బాబుగారు వచ్చారా?" హఠాత్తుగా అడిగా రాయన.

"ఆ! ఇప్పుడే వచ్చారు—"

"డ్రైవర్ని పిలవండి...." అని డ్రెస్సింగ్ రూము వైపు పరుగెత్తి, ఆమె స్నానానికి వెళ్ళేముందు తీసికొవిన దుస్తుల్ని పరిశీలించసాగారు. ఆమె స్నానానికి వెళ్ళే

టప్పుడు బయటకు తీసి వుంచిన దుస్తులు అలాగే వున్నాయి.

"డ్రైవరు వచ్చాడండి—" అన్నాడు కెంపౌరాజు. అతని ఆదుర్దా చూస్తే నవ్వాగింది కాదు నాకు. పాపం అతిధుల ప్రశ్నలకేం చెప్పాలో తోచక బిక్క చచ్చిపోతున్నా డతను.

"అబ్బాయ్! .... సతీష్‌బాబుగారింటికి నువ్వెప్పుడు వెళ్ళావ్?" సూటిగా అడిగా రాయన....

"ఎనిమిది పదిహేను నిముషాలకు సార్!" అన్నాడు డ్రైవరు తొణక్కుండా!

"అంత కరెక్టుగా నీకు టైమెలా తెలుసు?"

"అమ్మగారు లోపలికి వచ్చి ఎనిమిదింబావయింది.... త్వరగా వెళ్ళు—అన్నారండి."

"అప్పటిదాకా ఏం చేస్తున్నావ్...."

"నా భార్యతో కలిసి స్టీల్ సామాన్లు తుడుస్తున్నానండి—"

"భార్యంటే—!" అర్థోక్తిలో ఆగిపోయారు సింహ.

"రాజ్యం ఇతని భార్య. ఇద్దరూ మా ఇంట్లో పని చేస్తున్నారు. వంటగది ప్రక్కరూము వాళ్ళదే—"

"ఓ....అలాగా!" అని తలపంకించి ముందుకు కదిలారు సింహగారు.

ఇంతలో, కెంపౌరాజు ఓ వుత్తరం తెచ్చి ఇచ్చాడు.

చిన్న వుత్తరం....గజిబిజిగా రాసినట్లుంది.

"డియర్ కెంపౌరాజ్!

నీ భార్యను నేను తీసుకువెళుతున్నాను. ఆమె

సిక్కావాలంటే యాభై వేలు రెండు గంటల్లోగా ఇచ్చి విడిపించుకో!

—దుర్మార్గుడు"

—ఆ వుత్తరం చదివి నాకిచ్చారు. నేను చదివాను. నారక్తం ఉప్పొంగింది. మంచి కేసు....కిడ్నాపింగ్!! బహుశా, ఈ డ్రైవరుగాడు ఆ ముఠాకు సాయం చేస్తున్నాడేమో!

"డ్రైవర్ని గమనించు....నేను అతని గదికి వెళ్ళొస్తాను...." అని వెళ్ళిపోయారు సింహగారు.

ఇక సందేహం లేదు....వాడేవీడు! దుర్మార్గుడు. ఏ క్లోరోఫారమో ఇచ్చి కుముదినిని తీసుకెళ్ళుంటాడు. వెధవ! ఇప్పుడెలా? వీణ్నెలా లొంగదీయాలి?

"ఇతని పేరేమిటి? ఎలాటివాడు??" అని అడిగాను కెంపొరాజ్‌ను.

"గణేశన్....కుముదినికి ప్రీతిపాత్రుడు. చాలాకాలం నుంచీ పని చేస్తున్నాడు." అన్నాడతను ఏడుపు ముఖంతో- గొంతు బొంగురుచేసి. గంభీరంగా నవ్వాను.

"మీరెంత అమాయకులండీ....ఖూనీకోర్లందరూ నమ్మకస్థుల్లాగే ప్రవర్తిస్తారు....మేధావులయిన నాలాటివాళ్ళు అసలు రూపం తెల్సుకొంటారు...." అని డ్రైవరువైపు తిరిగి—"చెప్పు....ఎక్కడ దాచావ్?...." అని అడిగాను కఠినంగా.

వాడు "నాకేమి తెలియదు-" అన్నాడు.

"నోర్ముయ్—నిజం చెప్పు - నా కళ్ళు కప్పలేవు -" గర్జించాను.

వాడు నవ్వి - "మీరు హాల్లో వున్నారు. అమ్మగార్ని

నేను మాయం చెయ్యాలంటే, ఎత్తు కెళ్ళాలంటే, మార్గం ఏది? మీ కళ్ళుగప్పి ఎలా తీసుకెళ్తానో చెప్పండి—?" అన్నాడు.

ఠక్కున నోర్మూసుకొన్నాను. నిజమే! ఎలా మాయం చేయగలడు?....ఏమో! వీడు అఖండుడిలా వున్నాడు.... వీడి అంతు తేల్చాలి....తర్వాత ఎలా తీసుకెళ్ళాడో కనుక్కోవచ్చు....ఒకవేళ వీడు కుముదినిని హ....త్....అమ్మ బాబోయ్! హఠాత్తుగా కోపం వచ్చేసింది నాకు—

"డ్రైవర్! నీలాటి గుంటనక్కల అంతు తేల్చుకోందే వదలడు ఈ రాకెట్ రావు....ఖబడ్దార్! ఆమెను ఎక్కడ దాచావో చెప్పకుంటే, నేనే ఆ రహస్యాన్ని ఛేదిస్తాను." అని గాండ్రించాను.

ఇంతలో సింహగారువచ్చి, "రాకెట్! ఇందాక కుముదిని చేతిలోవున్న హాండ్ బాగ్ ఇలా తీసుకురా" అన్నారు. నేను తీసుకువచ్చాను—

సింహగారు బాత్ రూములో టబ్ అడుగునవున్న పైప్పై ఏదో పౌడరువేసి పరీక్షించసాగారు. ఆయన పని నాకర్థం కాలేదు. లక్షణంగా దొంగ డ్రైవరుగాడు దొరికిపోతే, వెధవది ఈయన ఈ పౌడర్లతో తంటాలు పడతారేమిటి? ఎవరి పిచ్చి వాళ్ళ కానందమట! నేను మాత్రం జాగ్రత్తగా డ్రైవర్ని కనిపెట్టున్నాను.

జ్వాలాసింహగారు లేచి నుంచున్నారు. ఆయన ముఖంలో యధాప్రకారంగా చిరునవ్వు వెల్గుతోంది. ఆయన మెల్లగా కెంపొరాజ్ దగ్గరకువెళ్ళి, "అబ్బాయ్.... అగ్గిపెట్టె వుందా?" అన్నారు చుట్టతీసి.

కెంపొరాజ్ అగ్గిపెట్టె ఇచ్చి—"సార్! ఏమిటి? ఏమ

యింది నా కుముదినీ!" అంటున్నాడు. అతని కళ్ళనిండా నీళ్ళున్నాయ్—

సింహగారు చుట్ట కాల్చుకొని "విం దెన్నిగంటలకు!" అడిగారు.

"పదింటికి."

సింహగారు చేయి మడిచి - "ఇప్పుడు తొమ్మిదిన్న రయింది. వెళ్ళు....ఏర్పాట్లు చూడు. పదింటికల్లా కుము దినితో నేను వస్తాను."

"ఆ!....మీరు...."

"అబ్బాయ్....మాట్లాడకు .... జ్వాలాసింహ అబద్ధ మాడడు. విందు తర్వాత ఓ మంచిచుట్ట కావాలి.... తెప్పించు....కుముదినిని విందులో చూస్తావ్." జ్వాలా సింహ గంభీరంగా అన్నారు. కెంపొరాజ్ వెళ్ళి పోయాడు.

"సార్! ఈ డ్రైవరు...." ఏదో చెప్పబోయాను.

"విందు దగ్గిరకు తీసుకెళ్ళు....వస్తాను—" అని బయటకు వెళ్ళిపోయారాయన....ఏదో ఒక పాకెట్ తో—

## 3

పదిగంటలయింది.

టేబుల్ నిండా పదార్థాలు అమర్చి వున్నాయి. ఇంకా విందు ప్రారంభం కాలేదు. అందరికి మనసులో కంగా రుగా వుంది. కెంపొరాజ్ వేసిన చిన్న కేకతో అందరూ అటు తిరిగారు.

ఎదురుగా ఎవరెట్లులా నిలబడి వున్నారు శ్రీసింహ! ఆయన ప్రక్కనే ఎవర్ బ్యూటీస్టార్ కుముదినీ దేవి!!!

అందరూ చుట్టుముట్టి లక్షతొంభై ప్రశ్నలు వేశారు.

అందర్నీ కూర్చోమని చెప్పి - సింహగారు వివరించారు.

"కుముదినీదేవి ఫియట్ కారులో కూర్చుని వుంది - తనే వెళ్ళింది....ఎలా వెళ్ళిందో నేను చెబుతాను. ఎందుకు వెళ్ళిందో ఆమెయే చెప్పాలి—" అన్నారు నవ్వుతూ.

అందరూ ఆశ్చర్యపడుతూ కుముదిని వయిపు చూశారు.

కుముదిని లేచి నిల్చుంది సిగ్గుపడుతూ - "తన అపార మేధాసంపత్తితో నన్ను ఇంతకు ముందు రక్షించారు శ్రీ సింహగారు. ఆయన అద్వితీయ చాకచక్యం, సమయోచిత ప్రజ్ఞ మళ్ళీ చూడాలని, మీకు చూపాలనీ ఈ ఎత్తు వేశాను. ఎలా వెళ్ళానో కూడా కనుక్కున్నారు శ్రీ సింహగారు - ఈ సంగతి ఆయన వివరిస్తారు" అని కూర్చుంది.

"కుముదిని మాయమైందనగానే నేను మొదట ఆశ్చర్యపడిన మాట వాస్తవం! ఇల్లంతా గాలించాను. లేదు. బయటకు ఎలా తీసుకెళతారు ఎవరయినా? గూర్ఖా నడిగాను. గణేశన్ ఎనిమిది పదిహేనుకు వెళ్ళాడని.... తర్వాత ఎవరూ వెళ్ళలేదని చెప్పాడు. గణేశన్ ఎనిమిదిన్నరకు నా కళ్ళ ముందే వెళ్ళాడు.

రెండవది....బాత్ రూమ్‌లో కుముదిని స్నానం చెయ్యలేదు. స్నానం చేస్తే టబ్ అడుగున నీళ్ళుండేవి. ప్రక్క గొట్టం వదలబడి వుండేవి సాధారణంగా. కాని పది నిముషాలు రూమ్‌లో డ్రెస్ మార్చుకుంది. ఎవరికీ అనుమానం

రాకుండా వుండేందుకు క్రింది పైపు వదిలింది టబ్ ఖాళీ చెయ్యడానికి. అందుకే పైపు మీది వేలిముద్రలు, కుముదిని వేలిముద్రలతో సరి చూశాను. తర్వాత రాజ్యం దగ్గరకు వెళ్ళి, డ్రైవర్ బట్టలు తనిఖీ చేశాను. మూడు జతల డ్రైవర్ దుస్తులలో ఒకే ఒక జత మిగిలి వుంది - రెండవది ఏమైంది? - ఇలా ప్రశ్నించుకొంటే సులభంగా తెలుస్తుంది.

ఎనిమిది పదిహేనుకు డ్రైవర్ గణేశన్ వెళ్ళిన మాట నిజం. అయితే ఎనిమిదిన్నరకు కుముదిని డ్రైవర్ దుస్తులతో మనందరి ముందూ వెళ్ళిపోయింది. గేటుదాటి వెళ్ళడం అనవసరం అనుకొని కార్ల షెడ్‌లో కూర్చుని వుంది."

"అయితే వుత్తరం మాట!" అడిగాడు కెంపొరాజ్.

నవ్వారు సింహ - "అదే సులభంగా పట్టించింది కుముదినిని. వుత్తరం ఎలా రాయాలో తెలియలేదు రెండు గంటల్లో ఏభై వేలు ఎక్కడివ్వాలి? కనీసం ఫోనన్నా చేయలేదు. తెలివయిన దొంగ ఎవరూ ఇంత పెద్ద పొరబాటు చెయ్యడు."

కరతాళ ధ్వనులతో గది మార్మోగిపోయింది.

"కాని, డ్రైవర్ గణేశన్ అంతా తెలిసే ఏమీ తెలియనట్లు ప్రవర్తించాడు" అన్నాడు కెంపొరాజ్.

"అవును....పాపం! అది తెలియక మా రాకెట్ అవస్థపడ్డాడు—" అన్నారు సింహ! నేను చటుక్కున తల దించుకొని పదార్థాలను తినసాగాను. □

[ఇరవయి ఏళ్ళనాటి అపస కథ]

# సాహసం

## వసుంధర

ఆఫీసులో లంచవర్లో భోంచేస్తూ అంతా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆరోజు టాపిక్ ధైర్యసాహసాల గురించి........

అందరూ జీవితంలో తాము ప్రదర్శించిన ధైర్యసాహసాల గురించి చెప్పుకుపోతున్నారు.

వారిలో మాట్లాడనిది నిరంజన్ ఒక్కడే.

ఆ విషయాన్ని రెండేళ్ళలో రిటైర్ కానున్న పట్టాభి రామం గమనించి "నువ్వేమీ చెప్పవేంటోయ్?" అన్నాడు.

నిరంజన్ నవ్వాడు.

"సాహసం అతడి ఊపిరి" అన్నాడు గోపీనాథ్ అనే ఓ ఉద్యోగి.

"నిండుకుండ తొణకదు" అన్నాడు రామారావనే ఇంకో ఉద్యోగి.

అక్కడున్నవారిలో చాలామందికి నిరంజన్ సాహసాలు తెలుసు.

సినిమాహాలు దగ్గర బ్లాకువాళ్ళతోటీ, ట్రయిన్ కండక్టర్ తోటీ, బీచి దగ్గర గూండాలతోటీ - ఇలా చాలా చోట్ల ప్రమాదకరమైన వ్యక్తులతో తలపడి తన ఆఫీసు వారిని రక్షించాడతడు.

అందరూ ఒక్కొక్కటిగా నిరంజన్ సాహసాలు చెప్పసాగారు.

"నిరంజన్ - నువ్వేం చెప్పడం లేదు" అన్నాడు పట్టాభిరామం.

"నా గురించి నేను కాదు. ఇతరులు చెప్పాలి. చెబుతున్నారు - మీరు వింటున్నారు" అన్నాడు నిరంజన్.

ఆ సమయంలో చటుక్కున అక్కడ ప్రవేశించాడు శ్రీహరి.

శ్రీహరి అక్కడున్న వారందరికీ బాస్.

హాల్లో ఉన్నట్టుండి నిశ్శబ్దం ఆవరించింది.

"మీ అందరి మాటలూ నేను విన్నాను" అన్నాడు

శ్రీహరి.

అందరూ ఉలిక్కిపడ్డారు. బాస్‌కి వ్యతిరేకంగా తామేమీ మాట్లాడటం లేదుగదా అని అంతా తామన్నది నెమరు వేసుకోసాగారు.

"ఇతరుల మాటలు పొంచి వినే దురలవాటు నాకు లేదు. కానీ ఇలా హాలుమీంచీ వెడుతూంటే అనుకోకుండా మీ మాటలు వినబడ్డాయి. టాపిక్ ధైర్యసాహసాల గురించి కావడంతో నాకూ ఆసక్తి పుట్టింది. మనలో ఎవరెలాంటి సాహసాలు చేశారో తెలుసుకోవాలనిపించింది. నిరంజన్ గురించింత కాలం నాకు తెలియదు" అన్నాడు శ్రీహరి.

నిరంజన్ కాస్త యిబ్బంది పడ్డాడు.

"చిన్న చిన్న అవసరాలకు - ఎవరికయినా ఎదురు తిరిగితే అది సాహసమనిపించుకోదు. సాహసమంటే అడ్వెంచరస్ స్పిరిట్ ఉండాలి. నిరంజన్ ధైర్యసాహసాలను నేను సవాలు చేస్తున్నాను" అన్నాడు శ్రీహరి.

అత దేం చెబుతాడో వినాలని అంతా కుతూహల పడ్డారు.

"హనుమంతు పేరు మీరు వినే ఉంటారు!" అన్నాడు శ్రీహరి.

"హనుమంతు పేరు తెలియని దెవరికి?

రెండు హత్యలు చేశాడన్న నేరం మీద జైల్లో ఉన్నాడు. రెండ్రోజుల క్రితమే జైల్నించి పారిపోయాడు. అతడు చిన్న కొండల మధ్య ఉంటున్నాడని పుకారు.

చిన్న కొండల మధ్య కొన్ని గుహలున్నాయి. ఓ గుహలో హనుమంతు మకాం పెట్టాడని చెప్పుకుంటున్నారు. కొందరు రాజకీయవాదుల ఒత్తిడి కారణంగా

పోలీసు లతడి కోసం అక్కడ వెతకడం లేదనీ - వెతికినా లేదని అసత్యం చెబుతున్నారనీ పేపర్లు రాస్తున్నాయి.

హనుమంతు ప్రమాదకరమైన నేరస్థుడు. ప్రజల్లో ధైర్యసాహసాలు లోపించడంవల్ల అతడిలా విచ్చల విడిగా తిరగ్గలుగుతున్నాడు. ఎవరైనా ఆ కొండల మధ్యకు వెళ్ళి హనుమంతును పట్టుకుంటే - అప్పుడు పోలీసులు చేయగలిగిందేమీ లేదు. నిజానికి హనుమంతుది పెద్ద పర్సనాలిటీయేం కాదు. అతడు సన్నగా పొట్టిగా ఉంటాడు. మనిషిలో తెగింపు, మొండితనం ఉన్నాయి. అదే తెగింపు, మొండితనం మనలో ఎవరికున్నా అతణ్ణి పట్టుకో వచ్చు. నిరంజన్ హనుమంతుని పట్టుకోగలడా అని నేను సవాలు చేస్తున్నాను...." అన్నాడు శ్రీహరి.

ఎవ్వరూ మాట్లాడలేదు. నిరంజన్ కూడా మాట్లాడ లేదు.

"నిరంజన్ హనుమంతుని పట్టుకుంటే నేను పదివేల రూపాయలు బహుమతిగా యిస్తాను" అన్నాడు శ్రీహరి మళ్ళీ.

అప్పుడు హాల్లో కలకలం రేగింది.

"ఒప్పుకో నిరంజన్!" అన్నాడు పట్టాభిరామం.

నిరంజన్ మాట్లాడలేదు.

"భయపడుతున్నావా?" అన్నాడు శ్రీహరి.

"పదివేల రూపాయలంటే మాటలుకాదు...." అన్నాడు గోపీనాథ్.

"నాకు డబ్బంటే మోజులేదు—" అన్నాడు నిరంజన్ నెమ్మదిగా.

"ఇది డబ్బు విషయంకాదు. నీ ధైర్య సాహసాలకే సవాల్. ఒప్పుకో" అన్నాడు రామారావు.

నిరంజన్ మాట్లాడలేదు.

"డబ్బంటే మోజు లేకపోవడం కాదు కారణం. నువ్వింధు కొప్పుకోవడంలేదంటే—అందుకు ప్రాణాలపై మోజు...." అన్నాడు శ్రీహరి.

"ఒప్పుకుంటున్నాను సార్—" అన్నాడు నిరంజన్.

"నీకు ప్రాణాలపై మోజుందనా?" నవ్వుతూ అన్నాడు శ్రీహరి.

"కాదు. హనుమంతుని పట్టుకొందుకు...." గంభీరంగా అన్నాడు నిరంజన్.

## 2

నిరంజన్‌కి పెళ్ళై ఆర్నెల్లయింది.

అందమైన భార్య సుగుణ—అనుకూలవతి కూడా!

ఆఫీసులో జరిగింది విని— "ప్రాణాలకంటే డబ్బెక్కువా? ఎందు కొప్పుకున్నారు?" అంది సుగుణ భయంగా.

"నా ప్రాణాలకేం భయంలేదు. ఎనభై యేళ్ళదాకా దేవతలు కూడా నన్నేం చేయలేరు. నా కలా వరముంది." అన్నాడు నిరంజన్.

"నిజంగానా?" అంది సుగుణ అమాయకంగా.

అందంతో పాటు అమాయకత్వం కూడా ఆడవారి సొత్తు. ఒకోసారి ఆ అమాయకత్వమే—ఎంతటి మాయదారులనూ వారి వశం చేస్తుంది కూడా!

"నిజం!" అన్నాడు నిరంజన్. అతడు తను చేసిన సాహసాల గురించి భార్యకు చెప్పి— "నా ధైర్యసాహసాలు నా కెప్పుడూ డబ్బు సంపాదించి పెట్టలేదు. ఈసారి డబ్బొస్తే అది నీ కోసం ఖర్చు చేద్దామని...." అన్నాడు.

అప్పుడు సుగుణ ప్రమాదం గురించి కాక పదివేల

గురించి ఆలోచించసాగింది. ఆమెకు మనసులో ఎన్నో కోరికలున్నాయి. పదివేల రూపాయల వలయంలోకి ఏ యే కోర్కెలను లాగవచ్చో ఆలోచిస్తూందామె.

శనివారం ఆఫీసు స్టాఫంతా వ్యాన్లో చిన్న కొండల దగ్గరకు వెడతారు. కొండగుహల మధ్యకు నిరంజన్ ఒక్కడూ వెడతా డప్పుడు. అతడికోసం రెండు గంటలు మాత్రం వారంతా ఎదురు చూస్తారక్కడ. తర్వాత అంతా కలిసి గుహలమధ్యకు వెడతారు.

ఈ ట్రిప్పు మగాళ్ళకు మాత్రమే పరిమితం.

ఎవరిసాయం లేకుండా నిరంజన్ హనుమంతుని పట్టుకుని రావాలి. అప్పుడే అతడికి పదివేలు వస్తాయి.

ఆఫీసు స్టాఫ్—మొత్తం అరవై మంది. అందులో పది మంది తాము రాకపోవడానికేవో కుంటిసాకులు చెప్పారు. నలుగురు సెలవులో ఉన్నారు. నలుగురు టూర్లోవున్నారు.

మొత్తంమీద వచ్చేవాళ్ళు శ్రీహరితో సహా—నలభై మంది తేలారు. వ్యాన్ కెపాసిటీ ఇరవై అయిదు.

రెండు ట్రిప్పులు వేయాలని తీర్మానమయింది.

మొదటి ట్రిప్పులోనే నిరంజన్, శ్రీహరి కూడా ఉంటారు. నిరంజన్ తన సాహసం కొనసాగిస్తూండగా వ్యాన్ రెండో ట్రిప్పుకు బయల్దేరి వెడుతుంది.

ఊళ్ళోంచి చిన్న కొండల దగ్గరకు పావుగంట చాలు వ్యాన్లో.

అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి.

ఆఫీసులో దీని గురించి ఎన్నో ఊహాగానాలు బయల్దేరాయి.

కొందరతడికి వచ్చే పదివేల రూపాయల గురించి ఆలోచిస్తున్నారు.

మరికొందరతడి భార్య డిగ్రీ గురించి అడుగుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి నిరంజన్ ప్రాణాలు పోతే— సుగుణకతడి ఉద్యోగం వస్తుందా అన్నది వారి ఆలోచన.

నిరంజన్ గంభీరంగానూ, ధైర్యంగానూ ఉన్నాడు.

ఇంట్లో అతడి భార్య పదివేల గురించీ కలలు కంటోంది.

## 3

ఆ రోజు శనివారం.

ఉదయం పదింటికే యిళ్ళదగ్గర భోజనాలు చేసి బయ ల్దేరా రందరూ.

పదిన్నరకల్లా చిన్న కొండల ప్రాంతం చేరారంతా.

వారు చేరిన ప్రాంతం పిక్నిక్‌స్పాటులా సమతలంగా చక్కగా ఉంది. చెట్లు లేకపోయినా కొన్ని కొండలు జనాలకు గొడుగు పడుతున్నాయి. వ్యాన్ దిగగానే చాలా మంది కొండ షేడ్స్ కిందకు చేరుకున్నారు.

అక్కడికి కాస్త దూరంలో సన్నని ఇరుకైన దారి కనబడుతోంది.

"అందులోంచి వెడితే గుహలు వస్తాయి-" అన్నాడు శ్రీహరి.

"ఈ ప్రాంతం మీకెలా తెలుసు?" అన్నాడు రామారావు.

"కాలేజీ రోజుల్లో పిక్నిక్కి వచ్చాం. అప్పుడు నే నొక్కడినే ఆ దారిలో వెళ్ళి గుహలకు ఫోటోలు తీశాను. అవిప్పటికీ నా దగ్గరున్నాయి. నే నప్పుడు వెయ్యి రూపా యల పందెం కూడా నెగ్గాను—" అన్నాడు శ్రీహరి.

"ఇప్పుడు మీరు గుహల దగ్గరకు వెళ్ళిరాగలరా?" అన్నాడు రామారావు కుతూహలంగా.

"హనుమంతు గురించి తెలిసుండకపోతే తప్పక పెళ్ళి ఉండేవాణ్ణి...." అన్నాడు శ్రీహరి తడుముకోకుండా.

"హనుమంతంటే మీకు భయమా?"

"కాదు. నా కిప్పుడు ప్రాణాలంటే తీపి. అప్పుడు వెయ్యిరూపాయల కోసం నా ప్రాణాలను రిస్కులో ఉంచగలిగాను. ఇప్పుడు నా సరదా కోసం పదివేలు పందెంలో పోగొట్టుకోగలను. ఇక సాహసాలేం చేస్తాను?" అన్నాడు శ్రీహరి.

"అయినా సాహసమంటే మీకున్న మోజు మెచ్చుకో తగ్గది. సాహసికుడికి పదివేలివ్వడానికి సిద్ధంగా ఉన్నారు" అన్నాడు పట్టాభిరామం.

"సాహసికులంటే నా కసూయ." అన్నాడు శ్రీహరి.

"ఎందుకు?" అన్నాడు నిరంజన్ కుతూహలంగా.

"మగాడికి సాహసమే ఊపిరి. సాహసం పేరు చెప్పి మగాళ్ళ ప్రాణాలు పోగొట్టుకోకూడదని- పెళ్ళి సృష్టించ బడింది. ఎందుకంటే మగాడు పెళ్ళయ్యాక నిర్వీర్యుడవు తాడు. కాదంటారా?"

అంతా నవ్వారు.

"నేను పెళ్ళయ్యాక ఒక్క సాహసకార్యంకూడా చేయ లేదు. నా భార్య నాకో ఆకర్షణగా మారి—నన్నన్ని విధాలా అదుపు చేసేది. మీకు గుర్తుండే ఉంటుంది—వెస్టిండీస్ బౌలర్ల మీద మన క్రికెట్ ప్లేయరాడుతూంటే అతడిభార్య మంగళసూత్రాలు కళ్ళకద్దుకుందని!" అన్నాడు శ్రీహరి.

అంతా నవ్వారు.

"నిరంజన్ పెళ్ళయినా సాహసానికి పూనుకున్నాడంటే ఆశ్చర్యంగా ఉంది. అందుకే పదివేలు పందెం కాశాను."

"నేనిక బయల్దేరుతాను" అన్నాడు నిరంజన్.

"సరే— రెండుగంటలు టైము" అన్నాడు శ్రీహరి.

సరిగ్గా పదకొండు గంటలకు నిరంజన్ రెండు కొండల మధ్య ఏర్పడిన సన్నటి దారిలో ప్రవేశించాడు.

"నిజంగానే వెళ్ళిపోతున్నాడు" అన్నాడు రామారావు.

"సాహసానికి మన నిరంజన్నే చెప్పుకోవాలి...." అన్నాడు పట్టాభిరామం ఉత్సాహంగా.

"తలపెట్టిన కార్యక్రమం నిజంగా ప్రమాదకరమైనది. అవతల హనుంమతున్నా డనడంలో సందేహం లేదు" అన్నాడు శ్రీహరి.

అక్కడున్న వారెవ్వరూ అంగుళంకూడా కదలలేదు. వాళ్ళందరూ చూస్తూండగా నిరంజన్ వారికి కనుమరుగయ్యాడు.

## 4

ఆ సన్నని దారిలో సుమారు ఫర్లాంగు దూరం నడిచాడు నిరంజన్. అప్పటికాదారి అంతం కనబడింది.

అక్కడ అతి విచిత్రమైన ప్రకృతి దృశ్యం.

అక్కణ్నించి పదిహేనడుగుల దూరంవరకూ నేల ఉంది. అక్కడిదాకా వెళ్ళి తొంగిచూస్తే ఏదో లోయ.... లోతుగా ....

నిరంజన్‌కి కళ్ళు తిరిగాయి.

అతడికి ఎత్తైన మేడమీద బాల్కనీలో నిలబడ్డట్లుంది.

ఆ ప్రాంతం నిజంగా మేడలాగే ఉంది.

అక్కణ్నించి తిన్నగా అటువెళ్ళినా యిటు వెళ్ళినా కూడా లోయవైపుకే చొచ్చుకు వెళ్ళిన కొండ. ఆ కొండలో మొత్తం ఎనిమిది గుహలు.

ఎప్పుడో ఎవరో అక్కడ గుహ లేర్పర్చుకున్నారనిపి

స్తుంది.

ఎందుకంటే ఆ గుహలో ఏ జంతువులూ ఉండే అవకాశం లేదు.

జంతువులుగానీ—పక్షులుగానీ మసలడం లేదక్కడ.

నిరంజన్ నెమ్మదిగా ఒకో గుహలోకే వెళ్ళాలనుకున్నాడు.

అతడి కేమాత్రమూ భయంగాలేదు.

మొదటి గుహలోకి వెళ్ళాడు ముందు. గుహలో గోడల మీద ఏవో అక్షరాలున్నాయి.

నిరంజన్ ఆశ్చర్యపడ్డాడు.

అక్కడ శ్రీహరి పేరు వ్రాసి ఉంది. తెలుగులో, ఇంగ్లీషులో.

రెండో గుహలో గోడమీద గుడ్లగూబ బొమ్మ ఉంది. అక్కడ కూడా శ్రీహరి పేరు వ్రాసి ఉంది.

మూడో గుహలో ఓ రుమాలుంది. రుమాలుకి రక్తముంది. రక్తం బాగా గెడ్డకట్టి ఉంది. గోడమీద శ్రీహరి పేరుంది.

నాలుగో గుహలో నాలుగు బల్లులున్నాయి. అన్నీ చచ్చి పడి ఉన్నాయి. వాటిలో ఒకటి బాగా ఎండి ఉంది.

గోడమీద—"ఇక్కడికి బల్లులెలాగొచ్చాయో చెప్పుకోగలరా" అని రాసి ఉంది. క్రింద శ్రీహరి పేరుంది.

అంటే శ్రీహరి ఇక్కడకు ముందుగా వచ్చేడా? వస్తే ఎందుకొచ్చాడు? తననెందుకీ పనికి పురమాయించాడు?

అయిదో గుహలో కొంత తుక్కుపడేసి ఉంది. ఎవరో కోడిని తిన్నారని ఆ తుక్కును చూస్తూనే గ్రహించవచ్చు. గోడమీద శ్రీహరి పేరు వ్రాసి ఉంది. పేరుకింద తేదీ ఉంది. పదేళ్ళక్రితం తేదీ అది.

పేరు పదేళ్ళక్రితం వ్రాసుండవచ్చు. కానీ అక్కడి తుక్కు—ఆ రోజుదే అనిపిస్తోంది.

నిరంజన్ ఆరో గుహలోకి వెళ్ళాడు. గోడమీద పుత్తి బొమ్మ వేసి ఉంది. క్రింద డేంజర్ అని వ్రాసి ఉంది. ఆ కింద శ్రీహరి పేరు రాసి ఉంది.

ఏదో గుహలో చిన్న ఎముకల గుట్ట ఉంది. ఆ ఎముకలు మనిషివని తెలుస్తూనే ఉంది.

శ్రీహరి పేరు అక్కడా ఉంది.

నిరంజన్ తటపటా యిస్తూనే ఎనిమిదో గుహలో అడుగుపెట్టాడు. అన్ని గుహల్లాగే అదికూడా చాలా చిన్నది. కానీ అందులో—

ఓ మనిషి ఉన్నాడు. అతడు నడివయస్కుడు. జుత్తు బాగా తెల్లబడింది. చింపిరి చింపిరిగా ఉందా జుత్తు.

మనిషిని చూడగానే పిచ్చివాడనిపిస్తుంది.

నిరంజరన్‌ని చూస్తూనే అతడు—"ఇహిహి ...." అని వెకిలిగా నవ్వాడు.

"నువ్వేనా హనుమంతువి!" అన్నాడు నిరంజన్.

"ఇహిహి—" అని మళ్ళీ నవ్వా డతడు.

"నీపేరు చెప్పు" అన్నాడు నిరంజన్.

అతడు నిరంజన్ వంక తీక్షణంగా చూశాడు.

"నీ చూపులకు నేను భయపడను. నాతో పద.... లేకుంటే బలవంతంగా లాక్కెడతాను" అన్నాడు నిరంజన్.

నిరంజన్ బాగా కండలు తిరిగి ఉన్నాడు. అవతలి వ్యక్తి బలహీనంగా ఉండడం అతడి ధైర్యాన్ని పెంచింది.

"నాతో నీకేం పని?" అన్నా డతడు.

"ముందు నువ్వెవరో చెప్పు...."

"నా పేరు జక్రక్ టుక్రూ...."

"అదేం పేరు?"

"ఇహిహి...." అని నవ్వా డతడు.

నిరంజన్ అతణ్ని జబ్బ పట్టుకుని బలవంతంగా గుహ బయటకు లాగాడు. తర్వాత సన్నని దారిగుండా లాక్కుంటూ వెళ్ళాడు.

అప్పటి కక్కడకు రెండో వ్యానుకూడా వచ్చింది. అంతా ఆత్రంగా నిరంజన్ రాకకోసం ఎదురుచూస్తు న్నారు.

నిరంజన్ ఆ మనిషిని వారందరికీ చూపించి తనేం చూసిందీ చెప్పాడు.

"ఇతడి మాటల్లో నిజానిజాలు తెలుసుకుందుకు మన మందరం బ్యాచిలుగా వెళ్ళి చూద్దాం" అన్నాడు శ్రీహరి.

అరగంటలో అంతా కలిసి నిరంజన్ చెప్పింది నిజ మని ఋజువుచేశారు.

నిరంజన్‌కు పట్టుబడ్డ మనిషి హనుమంతే అయుండా లని వారంతా అనుకున్నారు. అతణ్ని పోలీసుల కప్పగించా లనుకున్నారు.

"బాబూ—నాకేం తెలియదు. నేను హనుమంతుని కాదు. నన్ను వదిలి పెట్టండి" అన్నాడు జక్రక్ టుక్రూ.

"నిన్ను వదలడానికి లేదు" అన్నాడు రామారావు.

"నన్నిక్కడుండమని శ్రీహరి బాపే అట్టే పెట్టారు" అన్నాడు జక్రక్ టుక్రూ దీనంగా.

"అంటే?" అన్నాడు నిరంజన్.

"బాబెవరితోటో పందెం కాసి నన్నిక్క డుండ మన్నారు."

అంతా ఆశ్చర్యంగానూ, ప్రశ్నార్థకంగానూ శ్రీహరి వంక చూశారు.

"అతడు నిజమే చెబుతున్నాడు...." అన్నాడు శ్రీహరి.

"ఎవరతడు?" అన్నాడు నిరంజన్.

"మా పనివాడి చుట్టం....మహామొండి మనిషి...." అన్నాడు శ్రీహరి.

"అయితే నిరంజన్ పందెం నెగ్గినట్లేనా?" అన్నాడు పట్టాభిరామం.

"నిస్సందేహంగా....అక్కడ హనుమంతు లేడని నాకు ముందే తెలుసు. నిరంజన్ ధైర్యసాహసాలు పరీక్షించాలనుకుని ఆ ఏర్పాట్లన్నీ చేశాను. కాసేపాదారిలో ఉండి అన్నీ చూశానని తప్పించుకుంటే పట్టుకుందుకే ప్రతి గుహలోనూ ఓ విశేషం ఏర్పాటు చేశాను. నిరంజన్ అన్నీ కరెక్టుగా చెప్పాడు...." అన్నాడు శ్రీహరి.

ఒక్కసారిగా అంతా నిరంజన్ని గాలిలోకి లేపారు.

నిరంజన్‌కి ఆగకుండా అభినందన పరంపరలు....

## 5

భర్త చెబుతున్నదంతా సుగుణ ఆశ్చర్యంగా వింటోంది.

"ఎంత ధైర్యమండీ మీకు? మీరు చెబుతూంటేనే నా గుండె లవిసిపోతున్నాయి. అక్కడ ధైర్యంగా ఎలా నిలబడ గలిగారు?" అంది సుగుణ.

నిరంజన్ ఛాతీ ఉబ్బింది - "మా బాసేమన్నాడో తెలుసా? పెళ్ళయితే మగాడి సాహసం చచ్చిపోతుందిట. ఆయన విషయంలో అలాగే జరిగిందిట. కానీ నా విష

యంలో అలా కాదు. పెళ్ళయ్యాక నా ధైర్యం రెట్టింపయింది" అన్నాడు.

"కానీ నేను పిరికిదాన్నండీ - అలాంటప్పుడు పెళ్ళయ్యాక మీ ధైర్యం రెట్టింపెలాగయిందీ?" అంది సుగుణ అమాయకంగా.

"నువ్వు పిరికిదానివి కాదు. చాలా ధైర్యవంతురాలివి...."

"నిజంగానా?" అంది సుగుణ సంతోషంగా.

"కాకపోతే ఆ చిన్నకొండల గుహలను చూడ్డానికొంటరిగా వెళ్ళాలంటే ఎంత ధైర్యం కావాలి?" అన్నాడు నిరంజన్.

అప్పుడు సుగుణకో అనుమానం వచ్చింది-"మిమ్మల్ని పరీక్షించడానికి ముందే అక్కడన్ని ఏర్పాట్లూ చేశారు కదా - అంటే మీ బాస్ నీకంటే ధైర్యవంతులు. ఆయన ముందే ఆ గుహలు చూశారు కదా!"

నిరంజన్ కీ అనుమానం నచ్చలేదు. ఓ క్షణం ఆలోచించి "అసలు సంగతి నీకు తెలియదు" అన్నాడు.

"ఏమిటండీ అది?" అంది సుగుణ కుతూహలంగా.

"అసలు సంగతేమిటంటే హనుమంతు మా బాస్‌కి చిన్ననాటి స్నేహితుడై ఉంటాడు" అన్నాడు నిరంజన్.

సుగుణ కళ్ళు పెద్దవయ్యాయి - "అదెలా?"

నిరంజన్ వివరించాడు.

శ్రీహరి, హనుమంతు చిన్ననాటి స్నేహితులు. చిన్నతనంలో హనుమంతు శ్రీహరి ప్రాణాలు కాపాడి ఉంటాడు. తర్వాత యిద్దరివీ దారులు వేరయ్యాయి. హనుమంతు గజదొంగగా మారాడు. హంతకుడయ్యాడు.

శ్రీహరి గొప్పవాడయ్యాడు. సమాజంలో మంచి హోదా సంపాదించుకున్నాడు.

హనుమంతు తను చేసిన నేరానికి పట్టుబడి జైలు పాలుకాగానే శ్రీహరి అతణ్ని కలుసుకుని తప్పించుకునే ఉపాయం చెప్పాడు? గతంలో చూసిన మూలాన అతడికి చిన్న కొండల గుహాలు బాగా తెలుసు. హనుమంతు నిక్కడకు పారిపోమన్నాడు. పోలీసులు కూడా ధైర్యం చేసి వెళ్ళని చోటది.

హనుమంతు ఆ గుహల్లోకి పారిపోయాడు. పోలీసు లతడి కోసం మాటు వేశారు ఆ ప్రాంతాల నుంచి బయటకు రాగానే అతణ్ని పట్టుకోవాలనుకున్నారు.

శ్రీహరి హనుమంతును విడిపించటం కోసం ఓ పెద్ద పథకం వేశాడు. అందులో ఒక భాగమే - నిరంజన్ వి సవాలు చేయడం. సవాలు పేరు చెప్పి నిరంజన్ హను మంతుని లాక్కొచ్చి శ్రీహరి కప్పగించాడు. అంతా అతడు హనుమంతు కాదనే అనుకుంటారు. వ్యానులో గుంపుగా వచ్చిన జనంలో హనుమంతుంటాడని పోలీ సులు కూడా అనుమానించలేరు. ఆ విధంగా శ్రీహరి హనుమంతుని తప్పిస్తాడు.

"నిజంగా మీ బాస్ చాలా తెలివయినవాడు. హను మంతుని మీ ద్వారా రక్షిస్తున్నాడు. అయితే అందు కోసం పదివేలు ఖర్చుపెడుతున్నా డాయన. ఆ డబ్బెవ రిస్తారు? హనుమంతే ఆయన కిస్తాడా?" అంది సుగుణ.

"స్నేహం డబ్బు కోసం చూసుకోదు" అన్నాడు నిరంజన్.

"ఈ రోజుల్లో డబ్బు తర్వాతే స్నేహమని మా

నాన్నగారంటూంటారు....” అంది సుగుణ.

“అది మీ నాన్నగారి విషయంలో నిజం కావచ్చు. అందరి విషయంలోనూ కాదు” అన్నాడు నిరంజన్.

సుగుణ ముఖం ఎర్రబడింది - “మా నాన్నగారికి నీతీ నిజాయితీ ప్రాణం. ఇతరుల గురించే ఆయన హెచ్చరిస్తూండేవారు. నా అభిప్రాయంలో మీ బాస్ మిమ్మల్ని మోసం చేశాడు. హనుమంతుని పట్టుకుంటే ప్రభుత్వం డబ్బిస్తుంది. తను పట్టుకునే ధైర్యం లేక ఆయన మీ ద్వారా హనుమంతుని పట్టుకున్నాడు. మీరేమో తెలివితక్కువగా ఆ హనుమంతు నాయన కప్పగించి వచ్చేశారు. ఆయనేమో వాణ్ని పోలీసుల కప్పగించి - బోలెడు డబ్బులు కొట్టేస్తాడు....”

“కొడితే మనకేం? పదివేలొస్తాయి మనకి....”

“పదివేలు....ముష్టి పదివేల కోసం కక్కుర్తిపడి మీరు పేరు ప్రఖ్యాతులు పోగొట్టుకున్నారు. హనుమంతును పట్టుకొన్నందుకు పోలీసులు మీ బాస్‌కే యాభయివేలో బహుమతిగా యిస్తారు. అందులో ఓ పదివేలాయన మీ ముఖాన కొడతాడు.”

నిరంజన్ సాలోచనగా - “నువ్వు చెప్పింది నిజమే.... కానీ బాస్ అంత మోసం చేస్తాడా? మోసం చేసి రేపొద్దున్న ఆఫీసులో అందరి ముందూ తలెత్తుకు తిరగగలడా?” అన్నాడు.

“అసలు విషయం మీ అందరికీ ఎలా తెలుస్తుంది?”

“బాస్‌కి యాభయివేలు బహుమానం వస్తే - ఫోటోతో సహా ఆ వివరాలు పేపర్లో వేస్తారు. అందరికీ తెలిసి పోతుంది....”

"పై హోదాలో ఉన్నవాళ్ళకి సిగ్గుండదు. వాళ్ళ నెవరూ తప్పుపట్టేవా రుండరని ధైర్యం...." అంది సుగుణ!

"కానీ—సుగుణా! ఆ హనుమంతు పారిపోవడానికి కూడా ప్రయత్నించలేదు. బాగా ఎరిగున్నవాడిలా అభిమానంగా, సంతోషంగా బాస్ పక్కకి వెళ్ళాడు. తనని పట్టించేవాడి దగ్గిర కెవరూ అలా వెళ్ళరు...." అన్నాడు నిరంజన్ అనుమానంగా.

"అందుకే మీ బాస్‌ను నేను మరింతగా అనుమానిస్తున్నాను. మీరు చెప్పినట్లు హనుమంతు ఆయనకు చిన్ననాటి స్నేహితుడే! మీరు చెప్పినట్లే ఆయన హనుమంతుకు అన్నీ చెప్పాడు. హనుమంతాయన్ను నమ్ముతున్నాడు. మీ బాస్ హనుమంతుకి నమ్మకద్రోహం చేస్తాడు. ఆ తర్వాత మీకూను...."

అదే నిజమైతే తనేం చేయాలా అని ఆలోచనలో పడ్డాడు నిరంజన్. ఆలోచన అతడి ఆశల్ని పెంచుతోంది. పదివేల స్థానంలో యాభై వేలు కనపడ్డంలో—పదివేలు చాలా చిన్న మొత్తంలా కనబడుతోంది.

## 6

భర్త రాకకోసం కాళింది ఆత్రుతగా ఎదురుచూస్తూంది.

కాళింది శ్రీహరి భార్య.

ఆమె మహా ధైర్యవంతురాలు. సాహసానికి పెట్టింది పేరు. ఆడదైనప్పటికీ—కండలు తిరిగిన మగాళ్ళకే ఎదురు నిలిచి సమాధానం చెప్పిందామె కాలేజీలో.

కాళింది శ్రీహరికి స్వయానా మరదలు. ఆమె ధైర్య సాహసాలకు ముచ్చటపడి అత డామెను పెళ్ళి చేసు

కున్నాడు.

కారణం—శ్రీహరి పిరికివాడు. అతడి పిరికితనం అవధులు మించినది.

అతడికి బొద్దింకలంటే భయం. బల్లులంటే భయం. చీకటి పడితే దెయ్యాలభయం.

అతడు రిక్షావాళ్ళతో, కూలివాళ్ళతో దెబ్బలాడడు. అప్పుడతడికి పరువుపోతుందన్న భయం.

తనింటి ఆడపడుచులతో బైటకు వెళ్ళేవాడు కాదతడు. వారినే కాలేజీ కుర్రాళ్ళైనా ఏడిపిస్తే—తను వారించలే నన్న భయం.

తల్లి అతణ్ణి కంటికి రెప్పలా కాపాడుకునేది.

తనను కంటికి రెప్పలా కాపాడుకుంటుందనే కాళింది నతడు పెళ్ళి చేసుకున్నాడు.

కాళింది అతడి భయాన్ని వేళాకోళం చేస్తూండేది.

గతిలేక సహించేవాడు శ్రీహరి.

ఇప్పుడు శ్రీహరి కిద్దరు పిల్లలు. అయిదు, మూడు చదువుతున్నారు.

కొన్నాళ్ళక్రితం వాళ్ళింట్లో ఓ ఎలకపిల్ల ప్రవేశిస్తే శ్రీహరి చేసిన హడావుడింతా అంతా కాదు.

అప్పుడు భార్య అతణ్ణి చాటుగా చీవాట్లువేసి—"ఇలా గైతే మీ పిల్లలు కూడా మీకులాగే ఎందుకూ పనికిరాని వాళ్ళైపోతారు—" అంది.

శ్రీహరి కోపంవచ్చి—"నేనెందుకూ పనికిరానివాణ్ణి కాదు. నేనెందరికో బాస్‌ని—" అన్నాడు.

"బాస్ అయితే మాత్రం మీ పిరికితనం పోలేదుకదా!"

"తెలివిగలవాడు ధైర్యవంతుడికంటె గొప్పవాడు. నా తెలివికి అధికారం తోడయింది—" అన్నాడు శ్రీహరి.

"తెలివితో సాహసకార్యాలు చేయగలరా?" అంది కాళింది.

"ఏం చేయాలో చెప్పు...."

"చిన్న కొండల దగ్గర కొన్ని గుహలున్నాయి. అవి మొత్తం ఎన్ని? అక్కడ ఏమేం విశేషాలున్నాయి.... వెళ్ళి మీ రొక్కరూ తెలుసుకు రాగలరా?"

"విశేషాలు తెలుసుకురాగలను."

"అంటే పదిమందిని సాయం తీసుకుని వెళ్ళడం కాదు...."

శ్రీహరి నవ్వి—"నేనక్కడికి వెళ్ళను. కానీ ఒక్కణ్ణే పంపిస్తాను. మా ఆఫీసులో ఓ సాహస వీరుడున్నాడు—నిరంజన్ అని! అతడినిందుకు నియోగిస్తాను...." అన్నాడు.

"అధికారాన్నుపయోగిస్తారా?"

"కాదు—తెలివి: ...."

ఆ విధంగా మొదలైంది కథ. కాసేపట్లో భర్త రావాల్సి ఉంది—గుహల రహస్యం ఛేదించుకుని.

అంతకు ముందురోజే కాళింది అక్కడ అన్ని ఏర్పాట్లూ చేసి తనకు తెలిసిన ధైర్యవంతుడైన మనిషిని కూడా ఉంచింది....

కాసేపట్లో శ్రీహరి వచ్చాడు. అంతవరకూ జరిగిన విశేషా లొకటొక్కటిగా ఆమెకు చెప్పాడు.

"మీరు చెప్పినవన్నీ సరైనవే....కానీ మీరు చేసిన

పని చాలా తెలివి తక్కువగా ఉంది. స్వయంగా సాహసం చేయలేక పదివేలు నష్టపోతున్నారు...."

శ్రీహరి నవ్వి- "నేనీ పనిచేసింది నేనెంత సమర్థుడినో ఋజువు చేసుకుందుకు. నిరంజన్‌కి నేనొక్క పైసా కూడా యివ్వను...." అన్నాడు.

"ఇవ్వకపోతే ఊరుకుంటాడా అతడు? అసలే అతడు మహాసాహసి. ఆ విషయం నిరూపించుకున్నాడు కూడా!" అంది కాళింది.

"అతడు మహా బలవంతుడు కావచ్చు. సాహసి కావచ్చు. సమర్థుడు కావచ్చు. కానీ ఎలాంటి సాహసమైనా చేయగల్గి ఉండవచ్చు. కానీ మనదేశంలో ఉన్నంతకాలం-బాస్‌ని తప్పు పట్టే సాహసం మాత్రం చేయలేడు. అందుకే నేను ధైర్యంగా సవాలు చేశాను...." అన్నాడు శ్రీహరి.

"నేను నమ్మను...." అంది కాళింది.

"నేనేమైనా అతడికి డబ్బు బాకీ ఉన్నానా? ఏదో సరదాకి పందెం కాశానంతే! పందెం డబ్బడగడానికి కతడికెంత ధైర్యం?" అన్నాడు శ్రీహరి.

"అడిగితే ఏం చేస్తారు?"

"అడిగే ప్రసక్తి ఎక్కడుంది? నేనిస్తే పుచ్చుకుంటాడు. లేకుంటే అడగడు. అంతే జరుగుతుంది...." అన్నాడు శ్రీహరి.

శ్రీహరి మాటలు నిజమయ్యాయా?

జవాబు తెలుసుకోవాలంటే—ఏ ఆఫీసుకైనా వెళ్ళి బాస్ కింది ఉద్యోగుల నడగండి: □

# ముగ్ధ

సుంకరి రాంప్రసాద్

నీలి మేఘాల మధ్య ఆఘమేఘాలపై దూసుకుపోతూంది ఎయిర్ ఇండియా వారి బోయింగ్ విమానం.

విండో ప్రక్కనున్న సీట్లో కూర్చుని ఉన్నాను నేను. అమెరికాలో ఎం.బి.ఎ. పూర్తి చేసుకొని, మాతృదేశానికి

తిరిగి వస్తున్న నా మనసు ఆనందంతో ఆ విమానం లాగే మబ్బుల్లో తేలిపోతూంది.

'హోమ్ సిక్‌నెస్' అంటే ఏమిటో నాకు అమెరికాలో ఉన్నప్పుడే తెలిసింది.

పాపికొండల మధ్య పరవళ్ళు త్రొక్కే గోదావరి నీలి కెరటాల నురుగులు తమ పాదాలను తాకుతుంటే. పరవశముతో పచ్చగా వళ్ళు విరుచుకొనే జీడి మీమిడి తోపులు....

దుత్తలతో పాలు, పెరుగు, నేయి పట్టుకొని, రేవు దగ్గిర గూడు పడవకోసం ఎదురు చూసే వయ్యారి పల్లె పడచులు....

భూతలస్వర్గంగా అభివర్ణింపబడే అమెరికాలో ఉన్నప్పుడు కూడా, నాకు ప్రతిక్షణం మా 'వ్రేపల్లె' గుర్తుకు వచ్చేది.

జనని, జన్మభూమి స్వర్గంతో సమానమన్నారు కదా! ఆ స్వర్గం కోసం నా మనసు ఆత్రంగా ఎదురు చూస్తూంది.

ఇక్కడ ఆలోచించాల్సింది....

అమెరికాను కూడా మరిపించగలిగేంతటి అందమైనదా మా 'వ్రేపల్లె'—అని కాదు.

ఇక్కడ సమస్య అందం కాదు. అనుభూతి.

ఈ చిన్నపల్లెతో నేను పెంచుకున్న అనుబంధం, నేను పంచుకున్న అనుభవం....నాలో, నా అణువణువులో నిండి, నాలో ఏదో తెలియని భావావేశం ఉప్పొంగుతోంది.

అమ్మ ఒడిలోనికి చేరాలని ఆరాటపడే పసివాడిలా ఉంది ఇప్పటి నా మనస్థితి.

అమ్మలో చూసేది అందాన్ని కాదుగదా!

అందానికి అతీతమైన ఏదో తీయని భావం నా మనసుకు కళ్ళెం వేసి వ్రేపల్లె వైపు లాక్కుపోతూంది.

తూర్పున వెలుగురేఖలు విచ్చుకోక ముందే, గోదావరిలో ఈదులాడటం. దోసిలి నిండా నందివర్ధనాలూ, ఎర్ర గన్నేరులూ కోసుకొని ఎవరు ముందుగా గుడి ప్రాంగణం లోనికి అడుగుపెడతారా అని పందెం వేసుకొని గుడిమెట్లపై పరుగులు తీయటం....

పూజారి యిచ్చిన కొబ్బరిచెక్కను ధ్వజస్తంభం దగ్గిర పగలగొట్టుకొని వంతులేసుకోవటం, వాదులాడుకోవటం..

రాయుడిగారి తోటలో ఆడుకున్న కోతి కొమ్మచ్చులు, అవధాని గారి పెరడు గోడను గెంతి, దొంగతనంగా తీయ మామిడికాయలు కోస్తూంటే చింతబరికె పట్టుకొని ఆయన వచ్చేసరికి, ఆయనకు అందకుండా పరుగులు తీయటం....

ఇలా ఎన్నని....?

ఒక్కొక్క అనుభవం ఒక్కొక్క రంగుల చిత్రంలా నా మస్తిష్కంలో కదలాడుతున్నాయి.

కాలేజీ చదువులకోసం కాకినాడ వెళ్ళినా, విశాఖలో యూనివర్సిటీలో జాయిన్ అయినా, తరువాత ఎం.బి.ఎ. చదవడానికి అమెరికా వెళ్ళినా, ఆ తీయని స్మృతులు మాత్రం నన్ను విడిచి పోలేదు.

మారుతున్న కాలంతో పాటు మనుషులలోనూ ఎంత మార్పని!

నాగరికత వెర్రితలలువేస్తున్న అమెరికన్ యువతరపు విశృంఖలత్వాన్ని, దాని చేదు ఫలితాలను ప్రత్యక్షంగా చూశాను.

పాశ్చాత్య నాగరికతా వ్యామోహంతో మన సంస్కృతి సంప్రదాయాలను మరచిపోయి, వారి విజ్ఞాన సంపదను గాకుండా, వారి విశృంఖలత్వాన్ని మాత్రమే దిగుమతి

చేసుకుంటూ ఉన్మత్తులవుతున్న నా దేశపు యువతనూ చూస్తున్నాను.

ఎక్కడికి పోతున్నాం మనం?

ఆత్మానందం నుండి స్వార్థానికి, ముగ్ధత్వం నుండి విచ్చలవిడితనానికి దారి తీస్తున్న ఈ నవ నాగరికత అంటేనే నాకు భయం.

నాకు అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది. నేను ఒక శతాబ్దం ముందు పుట్టాల్సిన వాడినని, నేను ఈ తరంతో రాజీ పడలేను. నాకు మొన్నటితరం, ఆ మనుషులు, వారి మనసులలో పెనవేసుకున్న ఆత్మీయతా మాధుర్యంకావాలి.

అందుకే ఎన్నో గొప్పింటి సంబంధాలు వచ్చినా, ప్రేపల్లెలోని గోపాలం మామయ్యగారి అమ్మాయి పారిజాతాన్నే నా జీవిత భాగస్వామిగా ఎన్నుకున్నాను.

నా నిర్ణయాన్ని ఆరునెలల ముందు, అంటే నేను అమెరికాలో ఉన్నప్పుడే వారికి తెలియబరచాను. ఆ ఉత్తరం చూసి వారెంతగా ఉప్పొంగిపోయారో;

కాని, వారికేం తెలుసు?

నేను ఈ అధునిక యాంత్రిక జీవితంతో విసిగిపోయానని, నాగరికతా క్రిమీడలు సైతం సోకని ప్రేపల్లెలో....ముగ్ధత్వం వీడని పారిజాతాన్ని, కేవలం నా కోసం నేను కోరుకుంటున్నానని, నేను కలలుగన్న అచ్చమైన తెలుగు పడుచును ఆమెలోనే చూసుకుంటున్నానని... వారికేం తెలుసు?

తెలిమంచు తెరలలో తడియారని కురులనుండి నీటి బొట్లు ముత్యాలై రాలుతుంటే, ముంగిట చేర్చిన ముత్యాల ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు పెడుతున్న పారిజాతం చెక్కిళ్ళపై సోకిన అరుణుని లే కిరణం పారిజాతమై

పూచినట్లు.....

సన్నజాజి పందిరి క్రింద నా గుండెలపై తల ఆన్చి, పారిజాతం నిద్రించే వేళ, వెన్నెల వెలుగులు సైతం మా మీద సోకకుండా పూలతోనే కప్పేయాలని, సన్నజాజి తీవె ఒక్కొక్క పూవే రాలుస్తుంటే....తానే సిగ్గిల్లి మబ్బుల మాటున చంద్రుడు దాక్కున్నట్లు....

ఎన్ని కలలు కన్నానని?

ఎన్ని తీయని ఊహలు అల్లుకున్నానని?

నేను ఊహల్లో తేలుతుండగానే మద్రాసు మీనంబాకం ఎయిర్‌పోర్ట్‌లో ప్లేన్ లాండ్ అయింది.

స్టెయిర్స్ గుండా మెల్లగా క్రిందకు దిగుతున్నాను నేను. ప్యాసెంజర్స్ లాంజ్ నుండి ఎవరో నావైపే చూస్తూ ఆనందంగా చేతులు ఊపుతున్నారు.

'ఎవరబ్బా!' అని పరికించి చూసాను.

గోపాలరావు మామయ్య, ఆయన ప్రక్క ఎవరో ఒక ఆధునాతన యువతి. పాశ్చాత్య నాగరికతను పుణికి తెచ్చుకున్నట్లుంది ఆమె అలంకరణ.

జీన్స్‌లో బనియన్ ఇన్‌చేసిందామె. బిగుతైన ఆ దుస్తులు ఆమె శరీరంలోని వంపులను కొట్టవచ్చినట్లు చూపుతున్నాయి.

బాబ్డ్ హెయిర్, లిపిస్టిక్ పూసిన ఎర్రని పెదాలు, నుదురును సైతం కప్పేస్తున్న పెద్ద గాగుల్స్. ఆమె నిలుచున్న తీరులో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తూంది.

నన్ను చూసి వారిద్దరూ మరో రెండడుగులు ముందుకు వేసారు.

"ప్రయాణం బాగా సాగిందా బాబూ!" అంటూ గోపాలం మామయ్య ఆప్యాయంగా నా భుజం తట్టారు.

"హాయ్. శ్రీ! హౌ నైస్ టు సీ యూ!"

షేక్‌హాండ్ కోసం కుడిచేతిని ముందుకు చాస్తూ అంది ఆ యువతి.

నేను ఇబ్బందిగా ఆమెవంక చూసాను.

"అదేమిటి శ్రీకాంత్! అలా చూస్తావు? మన పారిజాతం. పోల్చలేదా?" నవ్వుతూ అన్నాడు గోపాలం మామయ్య.

అంతే!

ప్రక్కలో బాంబు పడ్డట్లు అదిరిపోయాను నేను.

"పారిజాతం ఏమిటి డాడీ? సింపిల్‌గా 'రిజా' అని పిలవమని ఎన్నిసార్లు చెప్పాలి?"

ముద్దుగా విసుక్కుంది ఆ ముద్దుగుమ్మ.

ఈమె....ఈ ఆధునిక యువతా పారిజాతం? ఎవరి కోసం నేను అమెరికానుండి రెక్కలుకట్టుకొని వ్రాలానో, ఏ అమాయక ముగ్ధత్వంకోసం ఇన్నాళ్ళు కలలుగన్నానో ఆ పారిజాతాన్ని....

ఇలా....ఈ రూపంలో....

"నో....!"

బాధగా తల విదలించాను నేను.

'పట్టు పరికిణీ అంచులు తడవకుండా సుతారంగా ఎత్తి పట్టుకొని, కురిసిన వర్షపు నీళ్ళల్లో పారాణి పెట్టుకున్న ఎర్రని పాదాలు కొలనులో విరిసిన అరవిందాలై మెరుస్తుంటే....

మువ్వల పట్టీల చిరుసవ్వడులకు తాళంవేస్తూ మిన్నాగు లాంటి నల్లని జడకు కట్టిన బంగారు కుప్పెలు అందమైన జఘనంపై మరింత అందంగా చిందులేస్తుంటే....

పేరంటానికి వెళ్తున్న పారిజాతం, కిటికీ ప్రక్కన

నిలుచున్న నన్నుచూసి, సిగ్గుతో అడుగులు తడబడుతుంటే జారని పైటను సవరించుకుంటూ, క్రీగంటతో నన్ను చూసిన వేళ....

ఆ సోగ కన్నులతో చిప్పిల్లిన ముగ్ధత్వం!

అదీ! ఆ పారిజాతాన్ని నేను కోరుకున్నాను.

నేను కలల మనిషిని. కాని, నా కలలు కల్లలయితే భరించగలిగే శక్తి నాకు లేదు.

"ఆరు నెలలుగా మద్రాసులో ఉంటూ నీకోసం ఆ భాషన్నన్నీ నేర్చుకుంది బాబూ పారిజాతానికి నీవంటే 'ఇదని' ".

—అంటూ గోపాలం మామయ్య ఏదో చెబుతున్నాడు.

కాని....నాకేమీ వినిపించటంలేదు.

నా చెవుల్లో ఏదో హోరు.

నేను నిలుచున్న పర్వత శిఖరం నిలువునా చీలిపోయి నేను ఆ అగాధం లోనికి కూలిపోతున్న భావన.

నా మనసులో రగులుతున్న భావసంచలనాన్ని వారికెలా చెప్పేది?

నాకు కావాల్సింది....

రంగూ, వాసనా లేని ఈ కాగితపు పూవు కాదని. కోవెల గంటల చిరుసవ్వడికే అదరి, రెమ్మల మాటునుండి జారి దోసిలిలోనికి రాలే....ఆ పారిజాతం, ముగ్ధత్వం వీడని ఆ పల్లెలోని దేవ పారిజాతాన్ని నేను కావాలనుకుంటున్నానని వారికెలా చెప్పేది?

అనాసక్తంగా చూస్తున్న నన్నుచూసి తెల్లబోతున్నారు గోపాలం మామయ్య, పారిజాతం....

అహా....పారిజాతం కాదు రిజా! □

# ప్రతాప రవిశంకర్

# మహా యాత్ర

సీరియల్

(గత సంచిక తరువాయి)

కళ్ళు తెరిచాడు ఆ ఖైదీ. ఆ అకారాన్ని చూసి భయంతో పెద్దగా అరవబోయాడు. కాని వెడల్పుగా వున్న ఆ ఆకారం చెయ్యి నోరు నొక్కిపట్టి వుండటంతో అరవలేకపోయాడు.

రెండో చేత్తో ఆ ఖైదీ గొంతు నొక్కుతూ అక్కడి నించి వెళ్ళిపోయింది మనిషో - మృగమో తెలియని ఆ ఆకారం.

ఖైదీలంతా గాఢనిద్రలో వున్నారు.

గాలికి చెట్లు వూగుతున్నాయి పిచ్చిపట్టినట్లు.

## 24

పిశాచాలు ఆవహించినట్టుగా పెద్దగా కేకలు పెట్టాలనుకున్నారు వాళ్ళంతా. భరించలేనంత ఉత్కంఠ వాళ్ళ గుండెల్ని బద్దలు చేసింది.

ఇంకో ఖైదీ కూడా ఆ రాత్రి మాయమైపోయాడని నిద్ర లేవటంతోనే వాళ్ళకు తెలిసిపోయింది తెల్లారిన

తర్వాత.

పాలిపోయిన మొహాలతో ఒకరి నొకరు చూసుకున్నారు.

ఎట్లా మాయమైపోయాడని వాళ్ళంతా మాట్లాడుకోలేదు.

ఆ విషయం వాళ్ళ వూహకు అందనిదిగా ఎప్పుడో నిర్ణయమై పోయింది. ఎంత ఆలోచించినా వుపయోగం వుండదని వాళ్ళకి తెలుసు.

ఆ దీవిలో మనుషులను ఎత్తుకు వెళ్ళిపోయే ఏదో శక్తి వుంది. అది మనిషో జంతువో, ఇంకేదైనా దయ్యం లాంటిదో తెలీదు. అదే ఖైదీలను ఈ రెండు రాత్రుల్లో తీసుకు వెళ్ళింది.

ఇప్పుడు ఇరవై మంది మిగిలారు. ఇంకేవిధంగానూ ఎవ్వరూ మరణించకుండా వుంటే ఇరవై రాత్రుల్లో అంతా మాయమైపోతారు.

వాళ్ళు చివరగా నిర్ణయించుకున్నదీ - ఆలోచించుకున్నదీ ఇదే.

ఆకలిగా వున్నా వాళ్ళు దాన్ని తీర్చుకోటానికి అంతగా ఆసక్తి చూపించలేదు. ఆకలి తీర్చుకున్నా, తీర్చుకోకపోయినా ఏ క్షణంలో ఐనా ప్రాణం పోవచ్చుననే భావం అందర్లోనూ కలిగింది.

సూర్యుడు ఆకాశం మీద పాకుతున్నాడు.

ఎండ చురుగ్గా వుంది.

గాలి కూడా వేడిని నింపుకొని వీస్తోంది.

"ఆత్మహత్య చేసుకుంటాను. నాకు పిచ్చిపట్టినట్టుగా వుంది" అన్నాడొక ఖైదీ హఠాత్తుగా.

అతని మాటలకు ముందు అంతా అదిరిపడినా తర్వాత

అతని మాటల్లో నిజం వున్నట్టుగా అంతా ఒప్పుకున్నారు.

ఏదో ఒక వైపునుండి మరణం సంభవిస్తుందని తెలుస్తూనే వుంది. ప్రాణాలు కాపాడుకోటానికి ఎక్కడ దాక్కోవాలో - ఏం చెయ్యాలో తెలీని పరిస్థితి. ఆ దీవి నుండి బయటకు వెళ్ళేందుకు అవకాశం లేదు. చుట్టూ సముద్రం అడ్డగిస్తున్నట్టు.

ఆ పరిస్థితుల్లో ఎవరికైనా మతి పోతుంది. ఉన్మాదిగా మారిపోక తప్పదు. ఏ విషపక్షికో బలైపోయేకంటే ఆత్మహత్య చేసుకోవటమే సులభమైన పనిగా కనబడింది వాళ్ళకి.

"ఇక్కడ కూర్చుని మనం చెయ్యగలిగింది ఏమీ లేదు. లేవండి....మాయమైన మనుషులు ఎక్కడయినా కనపడతారేమో వెతుకుదాం" అన్నాడు నరేంద్ర.

అయిష్టంగా అంతా అ పొడుగాటి చెట్లదగ్గిర నుండి కదిలారు. ఎవ్వరిలోనూ ఉత్సాహం లేదు. నీరసంగా నడవటం మొదలు పెట్టారు. చేతుల్లో వున్న చెట్టు కొమ్మలు బరువుగా అనిపించాయి.

బలివ్వటానికి తీసుకు వెళుతున్న జంతువుల మొహాల్లాగా వున్నాయి వాళ్ళ మొహాలు.

మధ్యాహ్నం దాకా ఆ దీవి ఇంకో వైపుకు వెళ్ళి తిరిగారు. ఎక్కడా ఆ ఎర్రరంగు విషపక్షి వాళ్ళకు కనబడలేదు. దాని గురించే వాళ్ళు అప్పుడప్పుడు చెట్లమీదకు చూస్తున్నారు.

చెట్లు అంతమయిపోయి మళ్ళీ ముళ్ళ పొదలు వచ్చాయి. వాటి మధ్యనుండి నడుస్తున్నప్పుడు ముందుగా నడుస్తున్న నరేంద్రకు ఒక పొదపక్కగా అక్కడక్కడ పొడుగ్గా వున్న ఎముకలు కనబడ్డాయి.

"ఎముకలు" అన్నాడతను వెంటనే.

ఆగిపోయారు.

"ఇవి మనుషుల ఎముకలు....అదిగో, ఆ పొద పక్కనే కపాలం కూడా వుంది" అన్నాడు స్టీఫెన్.

"సందేహం లేదు. మనిషి ఎముకలే ఇవి. ఐతే ఈ దీవిలో మనుషులు వున్నారు". అన్నాడు బలదేవ్.

"జాగ్రత్తగా చూడండి....ఈ ఎముకలు దీవిలో మనుషులవి అయివుండవు. ఈ ఎముకలకు ఇంకా అక్కడక్కడ మాంసం అంటుకుని వుంది. అంటే...." అంటూ ఆగిపోయాడు నరేంద్ర.

ఆలోచించటానికే వణికిపోయారు వాళ్ళు....నరేంద్ర వుద్దేశం ఏమిటో వాళ్ళకు తెలిసిపోయింది. మాయమై పోయిన ఖైదీల్లో ఆ ఎముకలు - కపాలం ఎవరివో అయి వుంటాయని ఆతను అంటున్నాడని వాళ్ళు గ్రహించారు.

"నిజమే. ఈ ఎముకలు రాత్రి మాయమైపోయిన మనిషివి కాదు. మొదటి రాత్రి కనపడకుండా పోయిన మనిషివే అయివుండాలి. మనకు అనుమానం అవసరంలేదు. వాళ్ళని ఎత్తుకుపోయి ఎవరో తినేశారు. ఈ దీవిలో నరమాంస భక్షకులు వున్నారు. ఐతే వాళ్ళు తెలివయినవాళ్ళు. అందర్నీ ఒక్కసారి చంపి తినకుండా ఒక్కొక్కరినే తీసుకెళుతున్నారు. వాళ్ళకి మనం ఎక్కడ వుంటున్నామో తెలిసిపోతోంది. మనల్ని కనిపెడుతూనే వున్నారు" అన్నాడు స్టీఫెన్.

వాళ్ళకి తెలీకుండానే వాళ్ళ అంతరంగంలో ఎక్కడైనా ఆ దీవి నుండి బయటపడగలమనే ఆశ వుంటే ఆ క్షణంలో అది ఎగిరిపోయింది.

కొంచెంసేపు ఆ ఎముకలను చూస్తూ అక్కడే వుండి

పోయారు. వాటిని చూస్తూంటే ఆ రాత్రి భయంగా వుందంటూ కన్నీళ్ళు పెట్టిన ఆ సన్నగా వుండే ఖైదీ వాళ్ళ కళ్ళముందు కదిలాడు.

మాట్లాడకుండా నరేంద్ర అక్కడి నుండి ముందుకు నడిచాడు.

ఇంకొంచెం దూరం వెళ్ళేసరికి ఒక ముళ్ళ పొదకు చిక్కుకుపోయి ఖైదీ దుస్తులు వాళ్ళకి కనపడ్డాయి. ఆ ఎముకల గురించి అనుమానం పూర్తిగా చెరిగిపోయింది. ఖైదీల మాయంలోని అంతరార్థం వాళ్ళకు బాగా తెలిసి పోయింది.

ఎవ్వరూ మాట్లాడటానికి ప్రయత్నం చెయ్యలేదు. ఖైదీ దుస్తులను దాటి వెళ్ళిపోయారు.

అక్కడి నించి మళ్ళీ ఎత్తుగా - విశాలంగా కొమ్మలు వున్న చెట్లు అక్కడక్కడ వున్నాయి. వాటి మధ్యనించి వాళ్ళకి చిన్న ఇళ్ళులాంటివి కనపడ్డాయి.

"అవిగో....ఇళ్ళు...." అన్నాడు బలదేవ్ కొంచెం పెద్దగా.

"ఆగండి" అన్నాడు నరేంద్ర వెంటనే.

అంతా ఆగిపోయారు.

"అవి ఇళ్ళే. ఐతే ఎవరివో మనకు తెలీదు. మన మనుషుల్ని ఎత్తుకుపోయిన నరమాంసభక్షకులవి అయి వుండవచ్చు. కాబట్టి మనం ఆ ఇళ్ళకేసి వెళ్ళటం మంచిది కాదు" అన్నాడు నరేంద్ర.

అక్కడ నిలబడే ఆ ఇళ్ళను పరీక్షగా చూశారు. ముందుకు వెళ్ళటానికి ధైర్యం చాల్లేదు. అందులో నిజం గానే నరమాంస భక్షకులు వుంటే అందరికీ చావు తప్పదు. ఐతే వాళ్ళు అందర్నీ ఒకేసారి చంపుతారో

లేదో తెలీదుకాని—ఏమైనా ప్రమాదం.

ఒక్క నిముషం ఆగి "బాగా గమనించండి. ఆ ఇళ్ళు పాడుపడిపోయినట్టుగా వున్నాయి. వాటిమీద కప్పిన ఆకులు సగం వరకు రాలిపోయివున్నాయి. బూజు కూడా వేల్లాడుతోంది. ఇళ్ళముందు చెట్ల ఆకులు రాలి గుట్టలుగా పడివున్నాయి. ఆ వాతావరణం చూస్తుంటే మీకు ఏమని పిస్తోంది" అనడిగాడు స్టీఫెన్ వాళ్ళని.

అప్పుడు వాళ్ళంతా బాగా ఆ ఇళ్ళను చూశారు.

"చాలా కాలంగా ఆ ఇళ్ళను ఎవరూ వుపయో గించటంలేదని తెలుస్తూంది." అన్నాడు నరేంద్ర.

"అవును. నరమాంసభక్షకులయినా - ఇంకే జాతి మనుషులయినా ఆ ఇళ్ళలో వుంటున్నట్టయితే అవి అట్లా వుండవు. మనుషులు తిరుగుతున్న అలికిడి కూడా లేదు. పదండి వెళ్ళి చూద్దాం" అంటూ అందరికంటే ముందుగా తనే అడుగు ముందుకువేశాడు.

"ఆ ఇళ్ళలో జంతువులు వున్నాయేమో" అన్నాడు బలదేవ్.

"జంతువులా? ఉండకపోవచ్చు. ఇప్పటివరకూ మనకు ఒక్క జంతువు కూడా కనపడలేదు. ఉంటే మనదగ్గిర వున్న కొమ్మలతో ఎదుర్కుందాం" అన్నాడు నరేంద్ర.

నెమ్మదిగా నడిచి ఆ ఇళ్ళదగ్గిరకు వెళ్ళారు. చెట్ల కొమ్మలమీద ఆకులు కప్పి ఆ ఇళ్ళను నిర్మించారు.

జాగ్రత్తగా చూశారు.

వాళ్ళ వూహ నిజమే అయ్యింది. లోపల చాలా కాలంగా మనుషులువున్న జాడలు కనపడలేదు. తొమ్మిది ఇళ్ళు వున్నాయి. అన్నీ ఖాళీగానే వున్నాయి.

"ఆశ్చర్యంగా వుంది. ఈ ఇళ్ళు నరమాంసభక్షకులవి

కాదు. ఏదో ఆటవిక జాతివాళ్ళు నివసించినవే....”
అన్నాడు స్టీఫెన్.

“ఈ ఇళ్ళలోవుండే మనుషులంతా ఏమైపోయారు?”
అన్నాడు బలదేవ్.

స్టీఫెన్ మాట్లాడలేదు. ఆ ఇంట్లో మసకచీకట్లో ఒక చోట పడివున్న ఆయుధాలను చూశాడు. వాటి దగ్గిరకు నడిచాడు. ఒకదాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

అవన్నీ ఈటెలు.

కొయ్యతో తయారుచేసినవే. అడవి జంతువులను వేటాడటానికి ఆటవికులు వుపయోగించే ఆయుధాలు. బాగా వాడిగా వున్నాయి.

పది వున్నాయి.

“కొంతవరకు ఫర్వాలేదు. మన ప్రాణాలు కాపాడు కోటానికి ఆయుధాలు దొరికాయి. తీసుకోండి” అన్నాడు స్టీఫెన్.

ఆ ఈటెలను వాళ్ళు తీసుకున్నారు. వాటికి పట్టివున్న బూజునీ, దుమ్మునీ చెట్ల ఆకులతో తుడిచేశారు. ఆ ఇంట్లో ఒకప్పుడువున్న మనుషులకు నిదర్శనంగా ఇంకే ఇతర ఆధారాలూ వాళ్ళకు కనపడలేదు.

ఇళ్ళలోనించి బయటకు వచ్చారు మళ్లీ.

“ఈ ఇళ్ళలోవుండే మనుషులంతా ఏమైపోయి వుంటారు?” అన్నాడు నరేంద్ర.

ఏదో చెప్పటానికన్నట్టు స్టీఫెన్ చిన్నగా దగ్గాడు.

అంతా అతనివైపు చూశారు.

“ఈ ఇళ్ళలో మనుషులంతా చచ్చిపోయివుంటారు. ఒక్కోసారి ఇటువంటి దీవుల్లో కేవలం కొన్ని గంటల్లోనే

అందరి ప్రాణాలుతీసే విషజ్వరాలు వస్తూవుంటాయి. అటు వంటి జబ్బుతో అంతా చచ్చిపోయివుండొచ్చు" అన్నాడు స్టీఫెన్.

అతను చెప్పిన కారణం అందరికీ సరయినదిగానే అనిపించింది. కారణం ఏదయినా వాళ్ళకు చలినుండి రక్షణగా ఆశ్రయం దొరికింది. ప్రమాదాలను ఎదుర్కోటానికి ఈటెలు కూడా దొరికాయి.

"మనం ఈరాత్రికి ఇక్కడే పడుకుందాం" అన్నాడు నరేంద్ర.

"నరమాంసభక్షకులు ఇక్కడకు కూడా వస్తారేమో" అన్నాడు బలదేవ్.

"రావొచ్చు....వాళ్ళు మనల్ని వెంటాడుతూనే వున్నారని నా అనుమానం. అటువంటప్పుడు మనం ఎక్కడ పడుకున్నా వాళ్ళ చేతుల్లో పడక తప్పదు" అన్నాడు స్టీఫెన్.

"ఐతే ఏం చేద్దాం?" ఒక ఖైదీ అడిగాడు.

"ఈ రాత్రికి అంతా నిద్రపోకూడదు. ఒకరో ఇద్దరో వంతులవారీగా కాపలా వుండాలి మిగిలినవాళ్ళకి. అప్పుడే మనుషుల్ని ఎత్తుకుపోతున్న వాళ్ళని పట్టుకోటం లేకపోతే ఎదుర్కోవటం సాధ్యమవుతుంది" అన్నాడు నరేంద్ర.

"అవును. అంతకంటే దారిలేదు. చెకుముకిరాళ్ళతో నిప్పు తయారుచేద్దాం. ఎండిన చెట్లకొమ్మలతో నెగడు ఏర్పాటు చేసుకుందాం. వంతుల ప్రకారం కాపలా ఏర్పాటు చేసుకుందాం" అని చెప్పాడు స్టీఫెన్ వాళ్ళతో.

అందరూ ఒప్పుకున్నారు.

ఆ ప్రదేశంలో కూడా పీలిరంగు దుంపల ముక్కలు, సీటికాయల మొక్కలు వాళ్ళకు దొరికాయి. వాటితో

ఆకలిని తీర్చుకుని ఆ ఇళ్ళను శుభ్రం చెయ్యటం మొదలు పెట్టారు.

అంతా పూర్తయ్యేసరికి సాయింత్రమయ్యింది.

కొంతమంది ఖైదీలు చెట్లుఎక్కి ఎండిపోయిన కొమ్మలను విరుచుకుని వచ్చారు. వాటన్నిటినీ ఆ ఇళ్ళముందు గుట్టలుగా పడేశారు.

"ఏదైనా జంతువు దొరికితే బాగుంటుంది" అన్నాడొక ఖైదీ.

"వద్దు. మనకు ఏ జంతువు - పక్షీ దొరక్కుండా వుండటమే మనం కోరుకోవాలి. ఎందుకంటే ఇది మృత్యుదీవి. అన్నీ మనకు శత్రువులే" అన్నాడు నరేంద్ర.

నలుగురు ఖైదీలు కలిసివెళ్ళి కొంచెం దూరంలోవున్న చెకుముకిరాళ్ళను ఏరుకువచ్చారు.

వాళ్ళ పనులన్నీ పూర్తయ్యేసరికి చీకటి పడింది.

"ఈ మృత్యుదీవిలో మనం మూడోరాత్రి గడపబోతున్నాం" అన్నాడు స్టీఫెన్.

"ఈరాత్రి మనలో ఒక మనిషి తగ్గిపోకూడదు" అన్నాడు నరేంద్ర వెంటనే.

"నిజమే, ఎవ్వరూ గాఢనిద్రలోకి జారిపోవద్దు. అంతా వీలున్నంతవరకు నిద్రను ఆపుకునే ప్రయత్నాలు చెయ్యండి. మన మనుషుల్ని ఎత్తుకువెళుతున్న ఆ నరమాంసభక్షకుల గురించి మనం తెలుసుకోవాలి. సాధ్యమయితే వాళ్ళను పట్టుకోవాలి. అర్థ మయ్యిందా?" అన్నాడు స్టీఫెన్ అందరినీ చూస్తూ....

తలలు వూపారంతా.

చీకటి దుప్పటిలాగా ఆ ప్రాంతాన్నంతటినీ చుట్టివేసింది. చెకుముకిరాళ్ళతో ముందుగా ఎండుటాకులకు

నిప్పుచేసి మండించారు.

ఒక్కసారిగా వెలుతురు అటూ ఇటూ పరుగెత్తింది.

తర్వాత ఎండు కొమ్మలకు నిప్పు అంటించారు.

అవి కూడా అంటుకుని మంట లేచింది.

ఆ వెలుతుర్లో కొంచెం దూరంవరకు పరిసరాలు వాళ్ళకు కనపడ్డాయి.

కొంచెం పొద్దుపోయేవరకూ అంతా బయటనే కూర్చున్నారు. ఆ దీవినుంచి బయటపడటం గురించి రకరకాలుగా ఆలోచించారు.

## 25

కొంత రాత్రి గడిచింది.

గాలి పరుగులు దీస్తున్న చప్పుడు—ఇళ్ళముందువున్న చెట్లు గాలికి వూగుతున్న చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగానే వుంది.

ఇద్దరు ఖైదీలు వాళ్ళవంతు కాపలాగా ఈటెలు తీసుకుని మంటదగ్గిర ఎదురెదురుగా కూర్చున్నారు. మిగిలిన వాళ్ళంతా ఆకులతో ఏర్పాటు చేసుకున్న పక్కలమీద పడుకున్నారు.

ఆలోచనలతో కళ్ళుమూసుకుని కొంచెం సేపటిలోనే నిద్రపోయారు.

ఇళ్ళబయట మంటదగ్గిర ఇద్దరు ఖైదీలు భయపడుతూనే కూర్చున్నారు. కాపలాగా కూర్చోక వాళ్ళకు తప్పలేదు. వాళ్ళ తరువాత బాధ్యతను నరేంద్ర - బలదేవ్ తీసుకుంటారు.

స్టీఫెన్ తను కూడా ఈటె తీసుకుని కాపలా వుంటానని అన్నా వాళ్ళు ఒప్పుకోలేదు. అవసరం లేదనీ విశ్రాంతి తీసుకోవాలనీ అన్నారు.

గాఢనిద్రలో లేదుకాని స్టీఫెన్ కూడా నిద్రపోతు న్నాడు. అప్పుడప్పుడు అతనికి బయట ఖైదీలు మాట్లాడు కోవటం వినపడుతూనే వుంది.

నీలూ గురించిన ఆలోచనల్లో వున్నాడు నరేంద్ర. హటాత్తుగా ఆ దీవిలో ఎక్కడైనా నీలూ ఎదురుపడితే బాగుండుననే ఆలోచన అతడికి పదేపదే కలుగుతోంది.

హటాత్తుగా అతనికి నీలికొండలు కోట్లఖరీదు చేసే వజ్రాల రహస్యం గుర్తుకు వచ్చింది.

అతనికి బాధ కలిగింది. వచ్చేటప్పుడు ఆ రహస్యాన్ని నీలూకు చెప్పినట్లయితే బాగుండేది. ఇప్పు డా రహస్యం తనతోనే అంతమయిపోతుంది. కోట్ల విలువైన ఆ వజ్రాలు ఎవరికీ దక్కకుండాపోతాయి.

ఆలోచనలు పూర్తి అవకుండానే అతను నిద్రపో యాడు.

మంట ఉజ్వలంగా వుంది.

వాళ్ళు ఎండు కొమ్మలను మంటమీదకు నెడుతున్నారు.

అప్పుడప్పుడు వెలుగు పడినంతమేర చూస్తున్నారు - ఎవరైనా వస్తున్నారేమోనని.

అర్ధరాత్రి దాటింది. ఖైదీలిద్దరికీ కళ్ళుమూసుకు పోతు న్నట్టు అనిపించింది నిద్ర వస్తున్నట్టుగా—వాళ్ళు మంట దగ్గిర్నుంచి లేచారు.

లోపలకువచ్చి నరేంద్రను - బలదేవ్‌నీ నిద్రలేపారు.

వాళ్ళిద్దరూ ఆ పక్కలమీద పడుకున్నారు.

ఈటెలు తీసుకుని మంటదగ్గిరకు వచ్చారు నరేంద్ర - బలదేవ్.

"దాదాపుగా మూడుగంటలు మనం కాపలాకాస్తే చాలు. ఆ తర్వాత ఎవర్నయినా లేపుదాం" అన్నాడు బలదేవ్

ఇంకా నిద్రమత్తు వదలక.

తల వూపాడు నరేంద్ర.

ఎదురెదురుగా మంటదగ్గిర కూర్చున్నారు.

మంట వేడికి చలి తెలీలేదు వాళ్ళకి. బాగా వెచ్చగా వుంది. వెచ్చదనం తగిలేసరికి ఇద్దరికీ నిద్రమత్తు పారిపోయింది.

"మనం ఎదురుచూస్తున్న ఆ మనుషులు వస్తారంటావా?" అడిగాడు బలదేవ్....

"రావొచ్చు. వస్తారనే నమ్మకంవుంది. ఒక్క మనిషే అయివుంటాడని నాకు అనిపిస్తూంది. కొంతమందిగా కలిసివస్తే ఒకే ఒక్కమనిషిని తీసుకువెళ్ళరు. మనందర్నీ తీసుకువెళ్ళేవాళ్ళు. ఒక్కమనిషే అనుకుంటే ముందుగా అందర్నీ చంపి మాంసాన్ని కుళ్ళబెట్టడం అతనికి ఇష్టం వుండివుండదు. అందుకే ఒక్కోరాత్రి ఒక్క మనిషినే ఎత్తుకుపోయి తింటున్నాడు. కాబట్టి ఈ రాత్రి కూడా తన ఆహారంకోసం తప్పకుండా వస్తాడు."

నరేంద్ర మాట్లాడుతున్నప్పుడు చెట్లపైవునించి ఎవరో నడిచివస్తున్నట్టు ఎండుటాకులమీద చప్పుడయ్యింది.

"ఎవరు? ఆ చప్పుడు నీకు వినపడుతోందా?" అడిగాడు బలదేవ్.

"అవును. సందేహంలేదు. ఎవరో నడుస్తున్నారు" అన్నాడు నరేంద్ర.

ఇద్దరూ చెవులు రిక్కించారు.

చప్పుడు ఆగిపోయింది.

"జంతువయి వుంటుందా?"

"కాదు. ఈ దీవిలో మనకు ఒక్క జంతువుకూడా కనపడలేదు. కనీసం పాములుకూడా కనపడలేదు. తప్ప

కుండా ఆ నరమాంస భక్షకుడే అయివుంటాడు."

మళ్ళీ చప్పుడయ్యి ఆగిపోయింది.

"నువ్వు ఆవైపుకు వెళ్ళి చూడు. నేను ఈ చెట్లవైపు వెళతాను" అంటూనే ఈటె పట్టుకుని చెట్లవైపు వెళ్ళాడు. బలదేవ్ ఇంకోవైపు వెళ్ళాడు.

వెలుగు పడుతూనే వుంది.

వెనక్కి తిరిగి నిలబడ్డాడు నరేంద్ర చెట్లవెనక్కి చూస్తూ. అతని దృష్టి చీకట్లోకి వుండటంతో వెనక ఏం జరుగుతున్నదో తెలుసుకోలేకపోయాడు.

ఇళ్ళపక్కగా వున్న చెట్ల వెనకనుండి నరేంద్ర దగ్గరకు చిన్నగా నడుస్తూ వచ్చింది ఆ నల్లని ఆకారం. ఒక చెయ్యి పైకెత్తింది.

చిన్నగా అలికిడయ్యింది సరిగ్గా అప్పుడు.

వెనక్కి తిరగబోయాడు. కాని అతని మొహంమీద బొచ్చు బాగా పెరిగిపోయిన ఆ ఆకారం అరచెయ్యి పడిపోయింది. పడకముందే అరిచాడు నరేంద్ర ప్రమాదాన్ని గుర్తిస్తూ—

చివుక్కున వెనక్కి తిరిగాడు బలదేవ్. తిరుగుతూనే నరేంద్ర వెనక నిలబడ్డ ఆ ఆకారాన్ని చూశాడు. ఆశ్చర్యంతో, భయంతో శిలలాగా నిలబడిపోయినా వెంటనే తేరుకుని గురిచూసి ఈటును బలంకొద్దీ ఆ ఆకారంమీదకు విసిరాడు.

రివ్వున దూసుకువెళ్ళిన ఈటె ఆ ఆకారం మెడలో సూటిగా దిగబడింది. అంతే—నరేంద్ర గొంతుచుట్టూ చేతులు బిగిస్తున్న ఆ ఆకారం అతన్ని వదిలిపెడుతూ పెద్దగా ఆ దీవి అంతా అదిరిపోయేట్టుగా బాధతో అరిచింది ముందుకు పడిపోతూ—

ఆ అరుపుతో ఇళ్ళలో నిద్రపోతున్న స్టీఫెన్ మిగిలిన ఖైదీలు ఉలిక్కిపడి లేచి బయటకు వచ్చారు.

వాళ్ళు వచ్చేసరికి నరేంద్ర—బలదేవ్ ఆ ఆకారాన్ని గుండెల్లో ఈటెలతో పొడుస్తూ కనపడ్డారు.

ఇంకా అరుస్తూనే వుంది ఆ ఆకారం—తన్నుకుంటూ బాధతో.

కాళ్ళు చేతులు మనిషికిలాగానే వున్నాయి. కాని వంటి నిండా ఎలుగుబంటికి వున్నట్టు నల్లని బొచ్చు ఉన్నది. చప్పిడి ముక్కు వుంది. నోట్లోంచి పదునుగా వున్న పళ్ళు బయటకు వచ్చాయి. కళ్ళుమాత్రం చిన్నవిగా వున్నాయి. ఆ బొచ్చులో కనుబొమ్మలు తెలీటంలేదు.

దాన్ని చూడగానే వాళ్ళందరికీ గుండెలు అదిరాయి.

"మనిషా? జంతువా?" అడిగాడో ఖైదీ.

"జంతువులాంటి మనిషి....లేకపోతే మనిషిలాంటి జంతువు. హిమాలయ పర్వతాల్లో మంచుమనుషులు వుంటారని విన్నాను. ఈ దీవిలో వున్న ఈ వింత మనిషిని మనం దీవి మనిషి అని పిలుచుకోవచ్చు. ఈ దీవి మనిషే మనలో ఇద్దరు మనుషుల్ని ఎత్తుకుపోయి చంపి తిన్నాడు. మొదటి రాత్రే మనం ఇట్లా మంటచేసి కాపలా ఏర్పాటు చేసుకుని పడుకుని వుంటే బాగుండేది. ఇద్దరు మనుషులు బతికి వుండేవాళ్ళు" అన్నాడు స్టీఫెన్.

దీవి మనిషిని కసితో ఈటెలు పెట్టి శరీరాన్ని తూట్లుగా పొడిచేశారు. ఆ మనిషిలో కదలికలు పూర్తిగా ఆగిపోయి ప్రాణం ఎగిరిపోయింది.

ఆ ప్రదేశమంతా నెత్తురుతో నిండిపోయింది.

ఖైదీలు ఆ నరమాంసభక్షకుడిని చంపినందుకు బలదేవ్‌ను సంతోషంతో పైకెత్తారు. నృత్యంచేస్తూ ఆ దీవి

మనిషి శవం చుట్టూ తిరిగారు.

"ఈ శవాన్ని మంటల్లో వేద్దాం" అన్నాడు ఒక ఖైదీ కొంచెం సేపటికి—

"వద్దు. భరించలేని వాసన వస్తుంది. ఇక్కడ మనం వుండలేము. తెల్లారిన తర్వాత ఎక్కడైనా దూరంగా పొదల్లో విసిరేసి రండి" అన్నాడు స్టీఫెన్.

బలదేవ్‌ని కౌగిలించుకుని కృతజ్ఞతలు చెప్పుకున్నాడు నరేంద్ర తన ప్రాణాన్ని ఆ దీవిమనిషి నుండి కాపాడి నందుకు—

ఎండు కొమ్మలు చప్పుడుచేస్తూ మంటల్లో కాలిపోతున్నాయి.

"ఇక భయంలేదు. తెల్లవారేవరకూ అందరూ నిర్భయంగా నిద్రపోవచ్చు" అన్నాడు బలదేవ్.

"వద్దు. మన జాగ్రత్తలో మనం వుండక తప్పదు. ఇటువంటి దీవి మనుషులు ఈ దీవిలో ఎంత మంది వున్నారో మనకు తెలీదు. ఒక్కడే ఐతే చచ్చిపోయాడు. ఇంకా ఇటువంటి మనుషులు వుంటే మనకు ప్రమాదం తప్పదు. అందుకే కాపలా ఉండాలి" అన్నాడు స్టీఫెన్.

మిగిలిన ఖైదీలు కూడా స్టీఫెన్ ఆలోచనను బలపరిచారు.

మళ్ళీ మంటకు రెండువైపులా ఈటెలు పట్టుకుని కూర్చున్నారు నరేంద్ర—బలదేవ్.

కొంచెం దూరంలో చచ్చి పడివున్న దీవి మనిషి శరీరం నెత్తురులో వికృతంగా వాళ్ళకు కనపడుతోంది.

## 26

తెల్లవారిన తర్వాత ఆ దీవి మనిషి శరీరాన్ని కొంత మంది ఖైదీలు ఈడ్చుకు వెళ్ళి గొయ్యితీసి పాతిపెట్టి

వచ్చేశారు.

అక్కడికి దగ్గర్లోనే దొరికిన సిలిరంగు దుంపలతోనే ఆకలిని తీర్చుకున్నారు. వాళ్ళ అదృష్టకొద్దీ ఆ దుంపల మొక్కలు ఆ దీవిలో బాగానే దొరుకుతున్నాయనుకున్నారు.

అంతా ఇళ్ళబయట ఈ బెలు దగ్గిర వుంచుకునే కూర్చు న్నారు. ఆ దీవిలో ఒక్క మనిషికూడా లేదని వాళ్ళు నిర్ధారించుకున్నారు.

జంతువులుకూడా లేవు. కాని—ఆ ఎర్రరంగు విష పక్షుల గురించే భయపడ్డారు. ఆ పక్షులవల్లనే తమకు ప్రమాదం. లేకపోతే ఎన్ని రోజులయినా నిర్భయంగా ఆ దీవిలో తిరగొచ్చు.

ఎండ బాగా పెరిగిపోతున్నప్పుడు వాళ్ళకు ఇళ్ళకు ఎడమవైపు నుండి చల్లటి గాలి వీస్తున్నట్లు తెలిసింది.

అక్కడికి సముద్రం దగ్గర్లో లేదని వాళ్ళకి తెలుసు. ఏదో నీటి ప్రవాహంమీదగా వస్తున్న గాలి అయివుంటుం దని అనుకున్నాడు నరేంద్ర.

"దగ్గిర్లో ఏదైనా నీటిమడుగు వుందేమో....చూసి వద్దాం" అన్నాడు నరేంద్ర.

"ఉండదేమో....వుంటే ఇంతదూరం తిరిగినా ఒక్క నీటి మడుగయినా కనపడకుండా వుంటుందా?" అన్నాడు స్టీఫెన్.

"ఏమో .... ఉండొచ్చు. వెతకటం మంచిది కదా" అన్నాడు నరేంద్ర.

ఖైదీ లెవ్వరూ అతనితో కలసి వెళ్ళటానికి ఆసక్తి చూపించలేదు. రాత్రి సరిగ్గా నిద్ర లేకపోవటంతో వాళ్ళంతా మత్తుగా వున్నారు.

"నేను వస్తాను. పద....చూసివద్దాం" అన్నాడు బల

దేవ్.

ఇద్దరూ బయల్దేరారు.

బలదేవ్ చేతిలో ఈటె వుంది. నరేంద్ర ఖాళీ చేతుల తోనే కదిలాడు.

"ఎక్కువదూరం పోవద్దు. తొందరగా వచ్చెయ్యండి" అన్నాడు స్టీఫెన్.

వాళ్ళు ఇళ్ళవెనక్కు వచ్చేశారు.

చెట్ల కింద నుంచి నీడలో నడుస్తూ ముందుకు వెళ్ళారు. ఆ వైపునుండే చల్లటి గాలి వీస్తోన్నది

"రాత్రి సమయానికి ఈటె విసిరి నన్ను రక్షించావు. లేకపోతే ఆ దీవి మనిషి నన్ను చంపివుండేవాడు. నిజంగా నాకు పునర్జన్మ కలిగించావు" అన్నాడు కృతజ్ఞతగా. నరేంద్ర.

"అందర్లోకి నిన్ను ఎక్కువగా అభిమానిస్తున్నాను. నీ వెనక ఆ మనిషిని చూడగానే నాకు భయం పుట్టింది. నీకు ప్రమాదం జరుగుతుందనుకోగానే ధైర్యంచేసి ఈటె విసి రాను. నీకేదైనా ప్రమాదం జరగటాన్ని నేను భరించ లేను నరేంద్రా" అన్నాడు బలదేవ్ ప్రేమగా—

ఆ మాటలతో చలించిపోయాడు నరేంద్ర. బలదేవ్ అభిమానానికి అతనికి కన్నీళ్ళొచ్చాయి. అతని రుణం తీర్చుకోలేని దనుకున్నాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది నరేంద్రకు కోట్ల విలువైన వజ్రాల రహస్యం. అవును. ఎప్పటికైనా ఆ దీవినుంచి బయటపడి స్వేచ్ఛాజీవితాన్ని అనుభవించే అవకాశం కలిగి నప్పుడు ఆ వజ్రాలను తను-బలదేవ్ సమంగా పంచుకో వాలి. ఆ రహస్యం బలదేవ్‌క్కూడా తెలియాలి - అను కున్నాడు.

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్?" అడిగాడు బలదేవ్. నరేంద్ర మొహంలోకి చూస్తూ.

"నీ కో రహస్యం చెప్పాలనుకుంటున్నాను."

"రహస్యమా?" నడుస్తూనే ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. కోట్ల రూపాయల విలువైన రహస్యం నా గుండెల్లో వుంది. దాని గురించి ఇంతవరకు ఎవ్వరికీ చెప్పలేదు. దాని నిప్పుడు నీతో చెప్పాలని అనుకుంటు న్నాను" అన్నాడు నరేంద్ర.

"నిజంగానా!" నమ్మలేనట్టుగా అడిగాడు బలదేవ్.

తల వూపి "నిజమే అయివుండాలి. చచ్చిపోవటానికి ముందు భిలాస్‌పూర్ దివాన్ చెప్పాడు. ఆ రహస్యం కోసమే ఆయన్ని ఎవరో మాయంచేసి బంధించారు" అంటూ అ వజ్రాల రహస్యం గురించి నీలికొండలకు తాము వెళ్ళొచ్చిన సంగతీ బలదేవ్‌తో చెప్పాడు నరేంద్ర.

"ఈ రహస్యమే నిజమైతే మనం జీవితాంతం హాయిగా బతకొచ్చు" అన్నాడు బలదేవ్.

"నువ్వు నా ప్రాణాలు రక్షించావనే కృతజ్ఞతకొద్దీ ఈ రహస్యాన్ని చెప్పాను. నువ్వు కూడా ఈ రహస్యాన్ని కాపాడాలి" అన్నాడు నరేంద్ర.

తల వూపాడు బలదేవ్.

అప్పటికే వాళ్ళు ఇళ్ళను దాటి చాలా దూరం వచ్చేశారు.

హటాత్తుగా వాళ్ళకు చెట్లమధ్యగా కొంచెం పెద్దదిగా వున్న నీటిమడుగు కనబడింది.

"అవిగో నీళ్ళు" అరిచాడు నరేంద్ర.

"నీ వూహ నిజమే అయ్యింది. నీళ్ళు కూడా బాగానే

వున్నాయి. ఈ నీళ్ళు చూస్తే మనవాళ్ళంతా సంతోషపడతారు" అన్నాడు బలదేవ్.

ఇద్దరూ మడుగులో నీళ్ళు తాగారు.

కొంచెంసేపు అక్కడే వుండి బయల్దేరారు. ఆ మడుక్కి ఒక వైపున కొంత దూరం వరకూ పీలంగా బాగా బురదగా మెత్తగా వుంది. అక్కడ ఇసక నేల వాళ్ళకు కనబడలేదు. ఆ మట్టి కూడా నల్లగా వుంది. అక్కడి నించి ఆ మడుక్కి చాలా దూరంవరకూ నేల నల్లగానే వుంది! అటువైపు చెట్లు కూడా ఎక్కువగా లేవు. అక్కడక్కడ విసిరేసినట్టుగా వున్నాయి.

"మన కోసం వాళ్ళు ఆందోళనపడుతూ వుంటారు, తొందరగా నడుద్దాం" అన్నాడు నరేంద్ర నడక వేగాన్ని పెంచుతూ—

సరిగ్గా అప్పుడే కెవ్వుమన్న అరుపు వినిపడింది వాళ్ళకి.

ఉలిక్కిపడ్డారు.

ఆ వైపుకు ఎర్రరంగు విషపక్షి వస్తోందని తెలిసిపోయింది.

ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా ముందుకి పరుగుదీశాడు నరేంద్ర. బలదేవ్ ఈటె తీసుకుని అక్కడే నిలవడి పక్షి అరుపు వినపడ్డ దిక్కుకేసి చూస్తున్నాడు.

పెద్దగా అరిచాడు నరేంద్ర పరిగెత్తుతూనే.

చివుక్కున తలతిప్పి చూశాడు బలదేవ్.

ఆశ్చర్యపోయాడు. కొంచెం దూరంలో ఒక చెట్టు కింద నరేంద్ర ఊబిలోకి దిగబడిపోయాడు. అప్పటికే మోకాళ్ళపై వరకు కూరుకుపోయాడు.

"బలదేవ్!" పెద్దగా అరిచాడు మళ్ళీ.

అక్కడకు వెళ్ళాడు బలదేవ్.

"ఊబి చూడలేదు. నువ్వు నా వెనకే పరిగెత్తక పోవటం అదృష్టం. నన్ను రక్షించే అవకాశం వుండేది కాదు. నువ్వు కూడా ఊబిలో దిగివుండేవాడివి. ఆ ఈటె అందించు" అన్నాడు నరేంద్ర.

బలదేవ్ ఏదో మాట్లాడబోయాడు. అప్పుడే ఎక్కడి నుండో ఆ ఎర్రరంగుపక్షి అరుపు వినబడింది. మాట్లాడకుండా ఈటె అక్కడే వుంచి గబ గబా చెట్టుపైకి ఎక్కాడు బలదేవ్.

అప్పటికి నరేంద్ర ఇంకొంచెం ఊబిలోకి దిగి పోయాడు.

"తొందరగా నన్ను కాపాడు....ఊబిలోకి దిగిపోతు న్నాను. ఆ ఎర్రరంగు పక్షి ఇటువైపుకు రావటంలేదు. వచ్చినా ఈటెతో దాన్ని ఎదుర్కోవచ్చు. నన్ను రక్షించు" అన్నాడు నరేంద్ర.

నవ్వాడు బలదేవ్.

నవ్వటం ఆపి "నిన్ను రక్షించను. నువ్వు ఊబిలో పూర్తిగా మునిగిపోయేవరకూ ఇక్కడే వుండి సంతోషంగా చూస్తాను" అన్నాడు.

ఆ మాటలతో అదిరిపడ్డాడు నరేంద్ర.

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్ను నేనే చంపాలనుకుంటున్నాను ఎవ్వరికీ అనుమానం రాకుండా అనుకోకుండా నా కోరిక తీరే మార్గం దొరికింది. కోట్ల విలువైన వజ్రాల రహస్యం గురించి నాకు తెలిసిన తర్వాత నువ్వు బతికుండగూడదు. చచ్చి పోవాలి."

"ఛీ....నువ్వింత ద్రోహి వనుకోలేదు" అన్నాడు

నరేంద్ర బాధగా.

మళ్ళీ నవ్వాడు బలదేవ్.

"ఇంకొన్ని క్షణాల్లో నువ్వు చచ్చిపోతున్నావు. అసలు రహస్యం ఏమిటో నీకు చెబుతాను. ఈ కోట్ల విలువైన వజ్రాల రహస్యం నీ దగ్గిర తెలుసుకోటానికే నేను నీతో స్నేహంగా వున్నాను. ఈ రహస్యం గురించి మల్కాన్‌పురి జైల్లో నన్ను కలుసుకున్న జస్వంత్ చెప్పాడు. నేను జస్వంత్ అనుచరుడ్ని. దివాన్ క్కావలసిన మనిషిగా నీతో మాట్లాడాడు. వజ్రాల రహస్యం అడిగాడు. కాని నువ్వు దివాన్‌ను కలుసుకోలేదని చెప్పావు. అందుకే ఎట్లాగైనా ఆ రహస్యాన్ని తెలుసుకొనే బాధ్యత తను నా మీద వుంచి వెళ్ళాడు. అందుకే నీ పక్కనే తిరిగాను. నీతో స్నేహాన్ని నటించాను. రాత్రి ఆ దీవి మనిషి బారినుండి కూడా నిన్ను వజ్రాల రహస్యం కోసమే రక్షించాను. ఆ రహస్యం నాకు తెలిసింది. ఇక నువ్వు బతకాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఆ వజ్రాలరహస్యం నా ఒక్కడికే తెలుసు."

అప్పుడే మళ్ళీ బాగా దగ్గిర నుండి ఎర్రరంగు పక్షి అరుపు వినపడింది. ఉలిక్కిపడుతూ చెట్టు కొమ్మమీద కదిలాడు బలదేవ్.

అంతే - పట్టుజారి తలకిందులుగా వూబిలోకి పడిపోయాడు పెద్దగా అరుస్తూ - పడటంతోనే లోపలకు వెళ్ళిపోయాడు బలదేవ్.

ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూశాడు నరేంద్ర.

అతనింకా ఆశ్చర్యం నుండి తేరుకోక ముందే చెట్ల మధ్య నుండి ఈటెలతో వస్తున్న ఖైదీలు, వాళ్ళ ముందు స్టీఫెన్ కనబడ్డారు.

అప్పటికి నరేంద్ర భుజాల దాకా వూబిలో దిగి పోయాడు.

ఎర్రరంగు విషపక్షి ఎటో ఎగిరి పోయింది.

## 27

ఖైదీలంతా విచార వదనాలతో కూర్చున్నారు ఇళ్ళ ముందు - బలదేవ్ వూబిలో పడి చచ్చిపోయినందుకు.

నరేంద్రకు కూడా బాధగానే వుంది. స్వార్థంతోనే ఐనా అతను క్రితం రాత్రి తన ప్రాణాన్ని కాపాడాడు. స్వార్థంతోనే చివరకు చచ్చిపోయాడు. అతన్ని నమ్మి వజ్రాల రహస్యం గురించి బలదేవ్‌తో చెప్పినందుకు విచారం కలిగింది.

ఆ రహస్యమే తెలీకుండా వుంటే బలదేవ్ చచ్చిపోయే వాడు కాదు - అనుకున్నాడు.

"ఈ దీవి మనలో చాలామందిని బలి తీసుకుంది. నిజంగా ఇది మృత్యుదీవి" అన్నాడు స్టీఫెన్.

నీటి మడుగు కనపడ్డదనే సంతోషం కూడా ఎవ్వరికీ లేదు. ఆ వైపుకు వెళ్ళటానికే ఎవ్వరూ సాహసించలేదు. ఎక్కడ వూబి వుందో తెలీదు.

చెట్లు చిన్నగా వూగుతున్నాయి.

నిశ్శబ్దంగా వుంది ఆ ప్రదేశమంతా.

"మనం ఇక్కడే వున్నందువల్ల ప్రయోజనం లేదు. సముద్రతీరానికి కూడా వెళ్ళి చూసి రావటం మంచిది" అన్నాడు స్టీఫెన్.

"ఎందుకు?" ఎవరో అడిగారు.

"ఆ రాత్రి తుఫానులో ఓడ పూర్తిగా మునిగి పోయిందో లేదో తెలీదు. మునిగిపోతుందనే భయంతో మేం సముద్రంలోకి దూకాం. ఒకవేళ మునిగిపోకుండా

వుంటే మనల్ని వెతుక్కుంటూ ఎవరైనా ఈ వైపుకు రావొచ్చు. లేకపోతే ఏవైనా ఓడలు ఈ దీవి పక్కనించి పోతూ వుండొచ్చు" అన్నాడు స్టీఫెన్.

"నిజమే. ఇప్పటిదాకా ఈ ఆలోచన మనకు రాలేదు. మన అదృష్టం బాగుంటే ఏదైనా ఓడ సముద్రంలో కన పడొచ్చు" స్టీఫెన్ ఆలోచనను బలపరిచాడు నరేంద్ర.

"ఇంకా ఆలస్యం ఎందుకు? పదండి ఇప్పుడే బయ ల్దేరుదాం" అన్నాడు ఒక ఖైదీ.

స్టీఫెన్ నిలబడ్డాడు. అతనితో మిగిలినవాళ్ళు కూడా నిలబడ్డారు. ఈటెలు తీసుకుని అక్కడినించి బయల్దేరారు.

బలదేవ్ లేని లోటు గురించి మాట్లాడుకుంటున్నారు కొంతమంది ఖైదీలు. నరేంద్ర మాట్లాడకుండా నడుస్తు న్నాడు.

స్టీఫెన్ కూడా ఏదో ఆలోచిస్తున్నట్టుగా మౌనంగా అడుగులు వేస్తున్నాడు.

నడుస్తున్నా అంతా జాగ్రత్తగానే వున్నారు. ఎర్ర రంగు విషపక్షుల గురించిన భయం అందరికీ వుంది. అందుకే నడుస్తూ కూడా అటూ ఇటూ దిక్కులు చూస్తు న్నారు.

ఇళ్ళదాటి చాలా దూరం వచ్చేశారు. దగ్గరలోనే సముద్రం వున్నట్టుగా హోరు వినపడుతోంది.

"దగ్గరకు వచ్చేశాం" అన్నాడు నరేంద్ర.

ఇంతలోనే "అటు చూడండి" అన్నాడొక ఖైదీ.

అంతా చూశారు ఖైదీ చూపించిన వైపుకు. నిలబడి పోయారు. కొంచెం దూరంలో ఎన్న చెట్టు పక్కనే ఒక ఖైదీ బట్టలు కనబడ్డాయి. వాటికి కొంచెం దగ్గరలో కొన్ని

ఎముకలు - కపాలం పడివున్నాయి.

"మన మనిషివే. ఆ దీవి మనిషి ఎత్తుకొచ్చి ఇక్కడ తిని వుంటాడు" అన్నాడు స్టీఫెన్ ఆ అస్తికలను చూస్తూ.

ఒక్కసారిగా అందరికీ ఆ ఖైదీ గుర్తుకు వచ్చాడు.

మౌనంగా నిలబడ్డారు ఆ ఖైదీ దుస్తులను చూస్తూ.

సరిగ్గా అప్పుడే ఎర్రరంగు పక్షి కెవ్వుమని అరుచుకుంటూ వేగంగా వచ్చింది. ఉలికిపాటుతో వాళ్ళంతా ఈటెలను పైకెత్తబోయారు. అప్పటికే ఈటె చేతిలోలేని స్టీఫెన్ వైపుకు వచ్చిన పక్షి అతని మెడమీద వాడిగా వున్న ముక్కుతో పొడిచి వెళ్ళిపోయింది.

బాధతో అరిచాడు స్టీఫెన్. మెడమీద నుండి నెత్తురు కారింది. అక్కడే కూలబడిపోయాడు ప్రాణభయంతో.

అంతా అతని చుట్టూ చేరారు.

స్టీఫెన్ మొహంలో మృత్యు భయం కనపడింది వాళ్ళకు. అతను చచ్చిపోతాడని అందరికీ తెలుసు. తెలిసినా అతన్ని చావకుండా బతికించుకోవటం ఎట్లాగో వాళ్ళకు అర్థం కాలేదు.

కొంతమందికి ఏడుపు వచ్చింది. భయంతో స్టీఫెన్‌కు మాట కూడా రాలేదు. కొన్ని క్షణాల్లో చావు ముంచుకు వస్తుందని అతనికి తెలుసు. ఆ పక్షి కరిచిన ఒక ఖైదీ ఎంత దారుణంగా చచ్చిపోయాడో వాళ్ళందరికీ బాగా గుర్తుంది.

స్టీఫెన్ కళ్ళముందు నీలిరంగులోకి మారిపోయి చచ్చిపోయిన ఆ ఖైదీ కళ్ళముందు కదిలాడు.

"వెళ్ళిపోతున్నాను.... మిమ్మల్నందరినీ వదిలి వెళ్ళిపోతున్నాను" అన్నాడు స్టీఫెన్ హీనస్వరంతో.

అతన్ని ఓదార్చాలని, ధైర్యం చెప్పాలని అందరికీ

అనిపించింది కాని అందువల్ల వుపయోగం లేదని పూరుకున్నారు. విషపక్షి కరిచిన మనిషి బతికి వుండటం సాధ్యం కాదని వాళ్ళకి తెలుసు. అందుకే అంతా కళ్ళతోనే విచారం వ్యక్తం చేశారు.

అప్పటికే స్టీఫెన్‌కు దృష్టి మందగించి పోయింది. చుట్టూ వున్న ఖైదీలంతా మసగ్గా - అలికినట్టుగా కనపడ్డారు.

"చూపు పోయింది. కొన్నిక్షణాల్లో మృత్యువు నన్ను పూర్తిగా వశపరుచుకుంటుంది. ఓడలో పారిపోతున్న మిమ్మల్ని కాల్చమని ఉత్తర్వులు ఇచ్చినందుకు ఆఖరిసారిగా క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను. ఒకప్పుడు మీరు నేరస్థులేమో—కాని ఇప్పుడు నా దృష్టిలో మీరంతా మంచివాళ్ళు. మీకు ఈ మృత్యు దీవినుండి విముక్తి కలగాలనీ—మీరంతా స్వేచ్ఛా ప్రపంచంలో సుఖంగా బతకాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అందరికీ సెలవ్...." రెండు చేతులూ జోడించాడు స్టీఫెన్. నరేంద్ర చేతిలో ఒరిగిపోయాడు.

అప్పటికే అతని శరీరం రంగు మారిపోయింది.

ఆ విచారం నుండి ఎవ్వరూ తేరుకోకముందే ఎర్రరంగు విషపక్షుల అరుపులు కొంచెం దూరంనుండి వినపడ్డాయి.

వాళ్ళ విచారం ఎగిరిపోలేదు కాని—స్టీఫెన్ శరీరాన్ని పూడ్చివెయ్యాలనే వాళ్ళ ఆలోచనలు చెదిరిపోయాయి.

ఆ విషపక్షుల ఎత్తుగడ ఏమిటో తెలిసిపోయింది. పొడిచి ఎగిరిపోయిన పక్షి మిగిలిన పక్షులను తీసుకువస్తుంది. వాటికి దొరికితే మిగిలిన వాళ్ళుకూడా ప్రాణాలు పోగొట్టుకోవాలి.

విషపక్షుల అరుపులు ఇంకా దగ్గరనుండి వినపడ్డాయి.

"లేవండి" ఆ పక్షులకు దొరక్కుండా సముద్రతీరానికి పరుగెత్తండి" అరిచాడు నరేంద్ర—స్టీఫెన్ తలను నేల మీద వుంచుతూ—

అందర్ని అట్లాగే వదిలి వెళ్ళటం వాళ్ళలో ఏ ఒక్కరికీ ఇష్టంలేదు. కాని ప్రాణభయంతో వదిలిపెట్టక తప్పలేదు.

కొంచెం దూరంలోనే రివ్వున దూసుకు వస్తున్న విష పక్షులు వాళ్ళకు కనపడ్డాయి.

"పరిగెత్తండి" అంటూ ముందుకు పరిగెత్తాడు నరేంద్ర. మిగిలిన ఖైదీలు అతడ్ని అనుసరించారు ఈలె లతో.

వాళ్ళు ఎక్కువదూరం వెళ్ళకముందే ఎర్రరంగు విష పక్షులు స్టీఫెన్ శరీరం చుట్టూ చేరి సంతోషంతో కెవ్వు మంటూ అరవటం మొదలుపెట్టాయి.

కొన్ని నిముషాలకే సముద్ర తీరానికి చేరుకున్న ఖైదీ లంతా ఆశ్చర్యానికి గురైనారు సముద్రాన్ని చూస్తూనే.

ఎందుకంటే—వాళ్ళకి దీవివైపుకు వస్తూ కొంచెం పెద్దదిగానే వున్న పడవ కనపడింది. అందులో వున్న మనుషుల్ని వాళ్ళు దూరంనుండే గుర్తుపట్టారు.

వాళ్ళలో ఇంకొంతమంది ఖైదీలు వున్నారు.

ఒక్క క్షణం విచారాన్ని మరచిపోయి సంతోషంతో ఈలెలు పైకెత్తి పెద్దగా అరిచారు పడవను చూస్తూ—ఖైదీలు.

## 28

ఖైదీలంతా పడవలోకి ఎక్కారు. ఆ పడవలో ఓడలో ఉన్న కొంతమంది సెంట్రీలు—ఇద్దరు జైలు అధికారులు ఉన్నారు. ఖైదీలుకూడా కొందరు ఉన్నారు.

ఆ రాత్రి తుఫానులో ఓడ మునిగిపోలేదని చెప్పారు

పెంట్రీలు. కొంచెం సేపటికే తుఫాన్ తగ్గిపోయిందిట. ఈతరావి ఖైదీలు ఓడలోనే ఉండిపోయారు. వాళ్ళే ప్రాణాలతో మిగిలిపోయారు. పడవలో వాళ్ళు ఒక్కొక్క దీవినే వెతుకుతూ ఆ దీవివైపుకు వచ్చారు.

ఆ దీవిలో జరిగిన సంఘటనలను—ప్రాణాలు పోగొట్టుకున్న మనుషుల గురించీ వాళ్ళతో చెప్పారు ఖైదీలు. స్టీపెన్‌ను ఆ విషపక్షులకు వదిలి రావలసిన పరిస్థితినికూడా వాళ్ళతో చెప్పారు.

పడవలో ఉన్న మనుషులంతా ఖైదీలపట్ల సానుభూతిని విచారాన్ని వ్యక్తపరిచారు.

సముద్రం ప్రశాంతంగానే వుంది. మృత్యుదీవి నించి బయటపడి వెళ్ళిపోతున్నందుకు సంతోషంగానే వున్నా, ఆ దీవిలో తమ మనుషుల్ని పోగొట్టుకున్నందుకు బాధ పడ్డారు వాళ్ళు.

దూరంగా ఎక్కడో వున్న ఓడవైపుకు పడవ కదులుతోంది. ఆ ఓడ ఆ ఖైదీలందరినీ అండమాన్ దీవులకు చేర్చుతుంది.

నరేంద్ర దూరమవుతున్న మృత్యుదీవిని చూస్తూ ఆలోచనల్లో లీనమైపోయాడు. అతడికి తన వాళ్ళంతా గుర్తుకువచ్చారు. కోట్ల విలువైన వజ్రాల రహస్యం, నీలి కొండలు గుర్తుకు వచ్చాయి.

ఊబిలో ప్రాణాలు పోగొట్టుకున్న బలదేవ్ గుర్తుకు వచ్చాడు. అతడు చెప్పిన మల్కాన్‌పురి జైల్లో తనని కలుసుకున్న మనిషీ గుర్తుకొచ్చాడు.

అతడి పేరు జస్వంత్ అని చెప్పాడు బలదేవ్.

జస్వంత్ ఆ వజ్రాల రహస్యం గురించి ఎటువంటి ప్రయత్నాలు చేస్తున్నాడు?

బలదేవ్ పంపే సమాచారం కోసం ఎదురుచూస్తు న్నాడా?

## 29

భిలాస్‌పూర్—

పాతాళ గృహంలో కాగడా నిశ్చలంగా వెలుగుతోంది. కాగడా వెలుగు ఆ ప్రాంతాన్నంతా పలుచగా ఆవరించుకుని వుంది.

అక్కడ ఉన్న బందిఖానాలో కొంతమంది మనుషులు ఉన్నారు. వాళ్ళంతా జీవంలేని మొహాలతో దీనంగా ఉన్నారు.

వాళ్ళు, నరేంద్ర అన్నయ్య—వదిన వాళ్ళ ముగ్గురు పిల్లలు. ఒక గదిలో నీలూ కూడా బంధించబడి వుంది. ఆమె మొహం కూడా వాడిపోయి వుంది. దిగులుతో ఆమె బాగా చిక్కిపోయింది

వాళ్ళ మొహాల్లో భయం కదులుతోంది.

టైమెంతయ్యిందో తెలీదు. ఏడ్చి ఏడ్చి ముగ్గురు పిల్లలు నిద్రపోతున్నారు.

ఉన్నట్టుండి ఎక్కడో తలుపు తెరచుకున్న చప్పుడు వినబడింది.

ఒకరినొకరు భయంగా చూసుకున్నారు.

కొంచెం సేపటికి నలుగురు మనుషులు మెట్లుదిగి వచ్చారు. వాళ్ళలో జస్వంత్ అందరికంటే ముందు వున్నాడు. అయితే ఇప్పుడు అతను ముసుగులో లేడు. మామూలుగానే వున్నాడు. మిగిలిన వాళ్ళు అతని అనుచరులు.

"ఇంకా నిద్రపోలేదా?" వస్తూనే అడిగాడు జస్వంత్ భూపేంద్రనీ—రేణునీ చూసి.

వాళ్ళు మాట్లాడలేదు.

"ఇంతకీ ఏం నిర్ణయించుకున్నారు? చావటానికే నిర్ణయించుకున్నారా? లేకపోతే బతకటానికి నిర్ణయించుకున్నారా?"

అప్పుడు కూడా మాట్లాడలేదు.

జస్వంత్ నవ్వి "చెప్పండి....నరేంద్ర జైలుకు వెళ్ళటానికి ముందు ఆ వజ్రాల రహస్యాన్ని మీకు తప్పకుండా చెప్పివుంటాడు....అబద్ధాలు చెప్పి తప్పించుకోలేరు" అన్నాడు.

"మా ప్రాణాలకంటే ఆ వజ్రాలు మాకు ఎక్కువ కాదు. నరేంద్ర మాకు ఏ రహస్యం చెప్పలేదు" అన్నది రేణు.

"ఆడదానివి. నీకు చెప్పివుండకపోవచ్చు. ఈ భూపేంద్రకు చెప్పేవుంటాడు."

"నాకూ కూడా చెప్పలేదు. నరేంద్రకు ఏ రహస్యం తెలీదు. తెలిసివుంటే తప్పకుండా నాతో చెప్పేవాడు. మమ్మల్ని హింసలు పెట్టడం అనవసరం. వదిలెయ్యి" అన్నాడు భూపేంద్ర కిందపడివున్న పిల్లల్ని చూస్తూ.

"నరేంద్రకు ఆ రహస్యం తెలుసు. నా అనుచరుడ్ని నరేంద్ర రాతికోట ముందు దెబ్బతీశాడు. దివాన్‌ని కలుసుకున్నాడు. కాని నరేంద్రని జైల్లో కలుసుకున్నప్పుడు తను దివాన్‌ని ఎప్పుడూ కలవలేదని అబద్ధం చెప్పాడు. ఎందుకో తెలుసా? అతనికి దివాన్ ఆ వజ్రాల రహస్యం చెప్పాడు. కాబట్టి నరేంద్రకు ఆ వజ్రాల రహస్యం తెలుసు. నరేంద్రకు తెలుసు కాబట్టి మీకూ కూడా ఆ రహస్యం తెలిసేవుంటుంది. కాని—మీరు చెప్పటం లేదు. మొండికేస్తున్నారు. అవునా?"

"నిజంగా తెలీదు. నిన్నెట్లా నమ్మించాలో మాకూ తెలీడంలేదు" అన్నాడు భూపేంద్ర.

పెద్దగా నవ్వాడు జస్వంత్.

"మీ మాటలు నమ్మటానికి నేను అమాయకుడినికాదు. నరేంద్ర జీవిత ఖైదుపడి అండమాన్ దీవులకు వెళ్ళిపోయాడు. తిరిగి ప్రాణాలతో మిమ్మల్ని చేరుకుంటాడనే నమ్మకం లేదు. అటువంటి మనిషి ఆ కోట్లవిలువైన వజ్రాల రహస్యాన్ని దగ్గిరపెట్టుకొని ఏంచేసుకొంటాడు? తనకు ఆప్తులయిన వాళ్ళకు చెప్పి వెళ్ళిపోతాడు. నరేంద్రకు ఆప్తులు మీరే. తప్పకుండా మీకు తెలిసివుండాలి. చెప్పండి, ప్రాణాలు దక్కించుకోండి."

జస్వంత్‌తో మాట్లాడి వుపయోగంలేదని వాళ్ళు మవునంగా వుండిపోయారు.

జస్వంత్ వాళ్ళు మొండిగా ప్రవర్తిస్తున్నారని అనుకొన్నాడు. అనుచరులకు సైగచేశాడు. వాళ్ళు క్రూరంగా వాళ్ళని చూసి నిద్రపోతున్న పిల్లలదగ్గరకు వెళ్ళారు. విసురుగా వాళ్ళని పైకెత్తారు.

"వద్దు....వాళ్ళనేం చెయ్యొద్దు...." పెద్దగా అరిచింది రేణు.

"జాలి. దయ అనేవి నాకు తెలీదు. నాకు తెలిసింది ఒక్కటే, నేను కోరుకున్నది—నాక్కావలసింది ఏదో ఒక రకంగా సాధించుకోవడం. దానికోసం నేను ఏమైనా చేస్తాను. ఇది కేవలం బెదిరించటమే అనుకుంటే మీరు మోసపోతారు, చెప్పండి" అన్నాడతను.

"నువ్వింత మూర్ఖుడివనుకోలేదు. నీ మూర్ఖత్వంతో మమ్మల్ని హింసపెడుతున్నావ్. నిజంగా మాకు ఏ రహ

వ్యం తెలీదు. నిన్ను నమ్మించటానికి ఏం చెయ్యాలో చెప్పు" అన్నది రేణు.

"నువ్వేమీ చెయ్యనవసరంలేదు. ఏం చెయ్యాలో నాకు బాగా తెలుసు." అంటూ ఒక్కసారి ఆ గదిలోనించి బయటకు వెళ్ళి కొరడాతో తిరిగి వచ్చాడు.

దాన్ని చూడటంతోనే భూపేంద్ర - రేణు వణికిపో పోయారు.

నీలూకి మాటలు వినపడుతున్నాయికాని - వాళ్ళు కన పడటంలేదు. ఆ పిచుడు ఏం చేస్తాడోనని ఆమె కూడా భయపడుతూనే వుంది.

కొరడా పైకెత్తి విసురుగా భూపేంద్ర మొహంమీద కొట్టాడు జస్వంత్.

బాధతో అరిచాడు భూపేంద్ర.

"వద్దు....అయన్నేమీ చెయ్యొద్దు" అన్నది రేణు. ఏడుస్తూ.

ఐనా జస్వంత్ ఆగలేదు. శివమెత్తినవాడిలా ఆప కుండా కొంచెం సేపటివరకూ భూపేంద్ర శరీరంమీద కొరడాతో కొడుతూనే వున్నాడు.

ఇక అరవలేక ఆగిపోయింది రేణు.

కళ్ళు మూసుకొని పళ్ళు బిగబట్టి వుండిపోయాడు భూపేంద్ర. పిల్లలు ముగ్గురూ ఆ దృశ్యాన్ని చూసి భయ పడి పెద్దగా ఏడుపు మొదలుపెట్టారు.

వాళ్ళ ఏడుపు వినలేక జస్వంత్ అనుచరులు పిల్లల్ని పైకెత్తి చేతులతో వాళ్ళ నోర్లు మూశారు.

ఆగిపోయాడు జస్వంత్.

"చెప్పండి....లేకపోతే ఈ కొరడాతో మీ చర్మం వొలిచేస్తాను" అన్నాడు వూగిపోతూ—

"నీకు సిగ్గులేదు. నువ్వు వెధవ్వి....నిజం తెలీకుండా హింసపెట్టడం మగాడి లక్షణంకాదు. ఇన్ని బాధలు పెట్టేకంటే ఒక్కసారి మా అందరినీ చంపెయ్యి" అన్నది రేణు.

"నువ్వెన్ని తిట్టినా నా హింసాకాండ ఆగిపోదు. చంపుతాను. అందరినీ చంపుతాను. వజ్రాల రహస్యం తెలిసేవరకూ అందరినీ చంపుతూనే వుంటాను. ముందుగా నీ ఆఖరికొడుకును చంపుతాను. చూసి ఆనందించు. ఆనందించలేకపోతే ఆ నిజాన్ని చెప్పెయ్యి. అంటూ అందర్లోకి తక్కువ వయసులోవున్న చిన్న పిల్లాడిని అనుచరుడి చేతిలోనించి లాక్కున్నాడు."

"వద్దు....వాడ్ని చంపవద్దు." అన్నది రేణు పెద్దగా ఏడుస్తూ....ఆమె ముందుకు రావటానికి వీలులేకుండా గోడకువున్న ఇనుప గొళ్లాలకు కట్టేశారు తాళ్ళతో.

రెండో చేతితో అనుచరుడు అందించిన కత్తిని తీసుకొన్నాడు.

"ఇదే ఆఖరి అవకాశం. ఈ పిల్లాడిని కాపాడుకోవాలంటే నిజం చెప్పెయ్యండి." అని వాళ్ళ మొహాల్లోకి చూశాడు జస్వంత్.

"ప్రమాణంచేసి చెబుతున్నాను....మాకు నరేంద్ర ఏ రహస్యాన్ని చెప్పలేదు. వాడిని వదిలిపెట్టు" దీనంగా అన్నాడు భూపేంద్ర.

"మీరు నిజంగా మొండివాళ్ళు" అంటూ పదునుగా వున్న కత్తిని పైకెత్తి ఆ పిల్లాడి గుండెల్లోకి బలంగా దించాడు.

కెవ్వుమన్నాడు పిల్లాడు. ఒక్కక్షణమే. ఆ తర్వాత వెంటనే ప్రాణం పోయింది. నెత్తురు బయటకు చిమ్మింది.

పెద్దగా అరిచారు రేణు - భూపేంద్ర....ఆ దృశ్యాన్ని చూడలేక భయంతో స్పృహ తప్పిపోయారు.

పిల్లల ఏడుపుతో అక్కడ నిశ్శబ్దం ఎగిరిపోయింది.

క్రూరంగా నవ్వాడు జస్వంత్, నెత్తురు నిండిన కత్తిని చూస్తూ. నీలూ గుండెలు దడదడమని కొట్టుకున్నాయి.

# 30

అండమాన్స్—

సెల్యులర్ జైల్లో ఖైదీలందరినీ వుంచారు. అక్కడకు వెళ్ళిన రెండురోజులకు నరేంద్రకు ఆరోగ్యం దెబ్బ తిన్నది. జైలుకు సంబంధించిన వైద్యుడి దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఆయన యిచ్చిన మందులతో కొద్ది రోజుల్లోనే అతని ఆరోగ్యం తిరిగి బాగుపడింది.

ఒకరోజు ఒక జైలు అధికారి దగ్గర్నుంచి పిలుపు వచ్చింది. ఎందుకో ఆ వచ్చిన మనిషి చెప్పలేదు.

ఆ మనిషి వెంట వెళ్ళి ఆ అధికారిని జైలు ఆవరణ లోనే కలుసుకున్నాడు.

ఆయన కుర్చీలో కూర్చుని వున్నాడు. ఆయన పేరు ఎడ్వర్డ్. ఒక్క నిముషం నరేంద్రను ఆపాదమస్తకం పరీక్షగా చూశాడు.

"కూర్చో" అన్నాడు కొంచెంసేపటి తర్వాత....

కాని—నరేంద్ర కూర్చోలేదు.

నిలబడే వున్నాడు.

ఈసారి ఆయన నరేంద్రను కూర్చోమని చెప్పలేదు. ఎందుకంటే బ్రిటిష్ అధికారుల యెదుట భారతీయ ఖైదీలు సరిగ్గా నిలబడటానికి కూడా భయపడతారు. అధికారులు కూడా ఖైదీలకు గౌరవం ఇవ్వరు.

"ఓడ తుఫాన్లో చిక్కుకున్నప్పుడు అధికారులను ఎది

రించి ముందుగా బయటకు పరుగుదీసినఖైదీవి నువ్వేనా?"
అనడిగాడు ఆయన.

కాదన్నట్టు తలవూపాడు నరేంద్ర.

"నువ్వు కాదా?" అడిగా డాయన మళ్ళీ.

"నేను కాదు. ఒక గడ్డం ఖైదీ."

"ఆ ఖైదీ ఇప్పుడు ఇక్కడ వున్నాడా?"

"లేడు....చచ్చిపోయాడు. చచ్చిపోయి మృత్యుదీవి సముద్రతీరంలో పడివుంటే అతని శవాన్ని అక్కడే పూడ్చిపెట్టాం...."

"మృత్యుదీవా! అంటే మీరంతా సముద్రంలో దూకి చేరుకున్న దీవేనా?" నరేంద్ర కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

తల వూపాడు నరేంద్ర.

"స్టీఫెన్ చావు గురించి నేనొక వార్త విన్నాను. అది నిజమేనా?" అడిగాడు ఎడ్వర్డ్.

"ఏ వార్త? ఆయన్ని ఎర్రరంగు విషపక్షి పొడిచి చంపటం గురించేనా?" అడిగాడు నరేంద్ర.

"ఆ....అవును....అదే....వివరంగా చెప్పు నువ్వు" ఏదో నిజం తెలుసుకోవాలన్నట్టు నరేంద్ర కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

నరేంద్ర స్టీఫెన్ మరణం గురించి అంతా వివరంగా చెప్పాడు.

"ఇదంతా నిజమేనా ...?" అనుమానంగా అడిగాడు.

"మీరు నమ్మలేకపోతున్నారా?" కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు నరేంద్ర.

"అవును. నేనే కాదు, ఇంకొంతమంది అధికారులు కూడా నమ్మలేకపోతున్నారు. ఇదంతా ఒక కథలాగా

వుంది....అతన్ని మీ ఖైదీలు కలిసి చంపివుంటారని అను మానంగా వుంది" అన్నాడాయన.

ఆయనలా అన్నప్పుడు నరేంద్ర మొహంలో రంగులు మారాయి. ఒక్కక్షణం ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. ఖైదీలందరినీ వీళ్ళంతా అనుమానిస్తున్నారా? మృత్యు దీవిలో అనుక్షణం ప్రాణభయంతో గడిపి కొంతమంది ఖైదీలను పోగొట్టుకొని తిరిగి జైలుకు వస్తే ఈ అధి కారులు చూపించే సానుభూతి ఇదా?

"మీ కెలా చెప్పాలో తెలీటంలేదు. ఐనా నిజాన్నే చెబుతాను. స్టీఫెన్‌గారిని ఖైదీలంతా కలిసి చంపాల్సిన అవసరంలేదు. ఆయనతో మాకు శతృత్వంలేదు. ఆ దీవిలో ఆయన మాకు ధైర్యం చెప్పి మార్గదర్శకుడుగా వున్నాడు. ఆయన అధికారి, మేమంతా ఖైదీలం అనే భావాన్ని ఆయన ఒకసారి కూడా చూపలేదు. ఓడలో మే మంతా పారిపోతున్నప్పుడు కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసినందుకు ఆయన తర్వాత మా దగ్గర ఎన్నోసార్లు బాధ పడ్డాడు అయన్ని ఎర్రరంగు విషపక్షి పొడిచి—ఆయన మృత్యువుకు దగ్గరవుతున్నప్పుడు మేమంతా ఒక గొప్ప ఆత్మీయుడిని పోగొట్టుకున్నామని బాధపడ్డాం. ఇది నిజం" అన్నాడు నరేంద్ర.

"నిజంగా ఆ దీవిలో ఎర్ర రంగు విష పక్షులు వున్నాయా?"

"ఉన్నాయి, మొదటిసారి ఆ పక్షి కనపడ్డప్పుడు అది చిత్రంగా వుందనుకున్నా. కాని అది మా మీదకు వచ్చి ఒక ఖైదీ మెడమీద ముక్కుతో పొడిచింది. కొంచెం సేపటికే ఆ ఖైదీ చచ్చిపోయాడు. అతని శరీరం రంగు

మారిపోయింది. సరిగ్గా అటువంటి విషపక్షే మే మంతా సముద్రతీరానికి వస్తున్నప్పుడు స్టీఫెన్‌గారి మెడమీద ముక్కుతో పొడిచింది. ఆయన కూడా అలాగే చచ్చిపోయాడు. నా చేతిలోనే ఆయన కన్ను మూశాడు. ఆయన చివరిసారిగా అన్న మాటలు ఇంకా మా హృదయాల్లో నుంచి చెరిగిపోలేదు" ఆ మాటలు అంటున్నప్పుడు నరేంద్ర గొంతు వణికింది ...కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.

"ఏమన్నాడు స్టీఫెన్ చివరిసారిగా?" తలెత్తి అడిగాడు ఎడ్వర్డ్.

"చూపు పోయింది. కొన్ని క్షణాల్లో మృత్యువు నన్ను పూర్తిగా వశపరచుకుంటుంది. ఓడలో పారిపోతున్న మిమ్మల్ని కాల్చమని ఉత్తర్వులు యిచ్చినందుకు ఆఖరిసారిగా క్షమాపణ తెలియజేసుకుంటున్నాను. ఒకప్పుడు మీరు నేరస్థులేమో—కాని ఇప్పుడు నా దృష్టిలో మీరంతా మంచివాళ్ళు. మీకు ఈ మృత్యుదీవినుండి విముక్తి కలగాలనీ - మీరంతా స్వేచ్ఛా ప్రపంచంలో సుఖంగా బతకాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అందరికీ సెలవ్...."

చెప్పటం ఆపాడు నరేంద్ర.

ఎడ్వర్డ్ ముఖంలోకి చూశాడు.

ఆయన కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు.

"ఇప్పటికైనా మీరు నేను చెప్పినదంతా నిజమని నమ్ముతారా?" అడిగాడు నరేంద్ర.

ఒక్కక్షణం ఆయన మాట్లాడలేదు. తర్వాత "స్టీఫెన్ యెవరనుకొంటున్నావ్? నా తమ్ముడు" అన్నాడు.

ఉలిక్కిపడ్డాడు అతను..

అవును. అందుకే ఎడ్వర్డ్‌లో స్టీఫెన్ పోలికలు కన

పడ్డాయి. ఐనా అంతగా ఆ విషయం గురించి ఆలోచించ లేదు.

"నిజమే....స్టీఫెన్ మనస్తత్వం నాకు బాగా తెలుసు. ఉద్యోగంలో ఉన్నప్పుడు యెంత కఠినంగా వుంటాడో తర్వాత అంత స్నేహంగా వుంటాడు. మానవతా విలువ లకు ప్రాముఖ్యత యిచ్చే మనిషి....నువ్వు అంతా నిజమే చెబుతున్నానని నమ్ముతున్నాను....ఇంకా ఆ దీవిలో పరి స్థితులు ఎలా వున్నాయి?" అనడిగాడు ఎడ్వర్డ్ కళ్ళు తుడుచుకుంటూ.

మృత్యుదీవి గురించి అంతా చెప్పాడు నరేంద్ర ఆయ నకు....అంతా విన్న తర్వాత అన్ని ఇబ్బందులను యెదుర్కోవలసి వచ్చినందుకు - క్షణం క్షణం మృత్యు వుతో పోరాడినందుకు ఎడ్వర్డ్ సానుభూతి చూపిం చాడు....

"నువ్వు చేసిన నేరం యేమిటి?" చివరగా అడిగాడు ఎడ్వర్డ్.

"ఒక నీచుడిని హత్య చేశాను."

"నువ్వు హత్య చేశావా?" ఆశ్చర్యంగా అడిగాడు ఎడ్వర్డ్.

మాట్లాడకుండా తలవూపాడు నరేంద్ర.

"నమ్మలేకుండా వున్నాను. జీవిత ఖైదు పడిందా?"

"అవును...."

"ఎవ్వరూ లేరా?"

"ఉన్నారు. అన్న - వదిన వున్నారు."

"పెళ్ళి చేసుకోలేదా?"

"లేదు. జైలుకు రాకుండా వుంటే చేసుకునేవాడినే. కాని ఆ అదృష్టం నన్ను వెనక్కు నెట్టింది" బాధగా

చెప్పాడు నరేంద్ర.

అతనికి సీలూ గుర్తుకొచ్చింది.

"ఏం చేస్తూ వుండేవాడివి నువ్వు?"

"ఖిలాస్‌పూర్‌కు దగ్గర్లో వున్న అడవిలో జంతువు లను వేటాడి వాటి చర్మాన్ని వ్యాపారులకు అమ్మే వాడివి."

"నీకు వేటాడటం తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆయన.

"తెలుసు."

"తుపాకీ పేల్చటం కూడా తెలుసా?"

"తెలీదు. కత్తితోనే జంతువులను ఎదుర్కొంటాను."

"నువ్వు బాగా ధైర్యవంతుడివై వుండాలి. ఎప్పు డయినా పులిని చంపావా?" అడిగాడు ఎడ్వర్డ్.

"చంపాను. ఒకసారి ఖిలాస్‌పూర్ వూళ్ళోకి వచ్చిన పులిని చంపాను."

ఎడ్వర్డ్ లేచి నిలబడ్డాడు. ప్రశంసాపూర్వకంగా నరేంద్ర భుజం మీద చేత్తో తట్టాడు.

"వెళ్ళు .. నీ గురించి ఆలోచిస్తాను....మళ్ళీ కబురు పెడతాను...." అని అతన్ని అక్కడినించి తిరిగి గదికి పంపించి వేశాడు ఎడ్వర్డ్.

ఆలోచిస్తూ వెనక్కి మళ్ళాడు నరేంద్ర.

ఎడ్వర్డ్ చిత్రమైన మనిషి - అనుకున్నాడు.

## 31

"మనందరికీ చావు తప్పదు" అన్నాడు భూపేంద్ర.

"మనం చచ్చిపోవటమే మంచిది. ఈ దుర్మార్గుడు ఒక పసివాడ్ని చంపేశాడు. మిగిలిన వాళ్ళని కూడా చంపు తాడు. ఈ ఘోరాన్ని చూడకుండా ముందుగా నన్ను

చంపితే బాగుంటుంది" అన్నది రేణు.

"అంతా మన దురదృష్టం. నిజంగానే దివాన్-నరేంద్రకు వజ్రాల గురించిన రహస్యం చెప్పినట్టయితే అతను మనతో చెప్పకుండా ఎందుకు అండమాన్ దీవులకు వెళ్ళిపోతాడు?" భూపేంద్ర అన్నాడు.

వాళ్ళ మాటలు నీలూకి సరిగ్గా వినపడటం లేదు. జస్వంత్ ఆమెను తీసుకు వచ్చి బంధించాడు కాని-ఇంకా ఆమెను ఆ రహస్యం కోసం హింసించలేదు.

"నరేంద్ర తెలివైన మనిషి. మన శ్రేయస్సు కోసమే ఈ రహస్యాన్ని తనకు తెలిసినా మనకు చెప్పలేదని నాకూ అనిపిస్తోంది" అన్నదామె.

"సూచనగా అర్థమవుతోంది. ఆ దుర్మార్గుడికి అంత ఖరీదైన వజ్రాలు దొరకటం నరేంద్రకు ఇష్టం లేక పోవచ్చు. మనకు చెప్పినట్టుగా ఈ నీచుడు ఏమాత్రం అనుమానించినా మనల్ని వదలడని మనతో చెప్పి వుండడు" అన్నాడు భూపేంద్ర.

"అంతే అయివుంటుంది. నీలూ కూడా ఆ రహస్యం చెప్పి వుండదు....పాపం. నీలూని కూడా తెచ్చి బంధించాడు. ఎన్ని హింసలు పెడతాడో....మనమంతా చావుకు దగ్గరలో వున్నాం" అన్నది రేణు.

భూపేంద్ర మాట్లాడలేదు.

రేణు కళ్ళు బాగా ఏడపటంతో వుబ్బిపోయాయి చచ్చిపోయిన పిల్లాడి శవాన్ని అక్కడ నుండి అప్పుడే తీసుకుపోయారు.

చచ్చిపోకుండా వాళ్ళందరికీ ఏదో ఆహారం పెట్టారు. పిల్లలు ఆకలితో తిన్నారు కాని - వాళ్ళు తినలేదు.

వాళ్ళు తిరిగి ఏదో మాట్లాడుకోబోయేంతలో తలుపు తెరుచుకున్న చప్పుడు వినపడింది.

వాళ్ళ గుండెలు అదిరాయి. కొంచెంసేపటికి జస్వంత్ అనుచరులతో మెట్లు దిగి వచ్చాడు.

బందిఖానా తాళాలు తీశారు అనుచరులు.

"బాగున్నారా?" హేళనగా అడిగాడు.

తలలు వంచుకున్నారు వాళ్ళిద్దరూ.

పిల్లలు నిద్రపోతున్నారు.

"మిమ్మల్ని బతిమిలాడే సహనం - ఓపిక నాకు లేవు. తొందరగా చెప్పండి. ఆ రహస్యం చెప్పటానికి నిర్ణయించుకున్నారా?" అడిగాడు జస్వంత్ అనుచరుడి చేతిలో నుండి కత్తిని అందుకుంటూ.

"అందర్నీ ఒక్కసారి చంపెయ్యి. నువ్వు మా ఎదురుగా ఎన్ని ఘోరాలు చేసినా మాకు తెలీని నిజాన్ని మేము చెప్పలేము. ఈ రహస్యం గురించి నీకంటే మాకు ఎక్కువ తెలీదు. నీ యిష్టం...." అన్నాడు భూపేంద్ర.

"సరే. మీకు ఆ వజ్రాల రహస్యం తెలిసినా తెలీకపోయినా - నా గురించిన రహస్యం తెలిసిపోయింది. మీరు బతికి వుండటం నాకు ప్రమాదం. అందుకోసమైనా మీ అందర్నీ చంపుతాను. కాచుకోండి" అంటూ ముందుగా కింద పడుకుని నిద్రపోతున్న పిల్లలిద్దర్నీ కత్తితో పొడిచాడు.

కెవ్వుమన్నారు వాళ్ళు.

పిచ్చి పట్టినట్టు అరిచింది రేణు....అప్పుడే ఆమెకు మతి పోయింది.

దయ్యం పట్టినవాడిలాగా నవ్వుతూ జస్వంత్ భూపేంద్ర దగ్గిరగా వెళ్ళి "ఆ రహస్యం మీకు తెలీదు

కదూ?" అన్నాడు.

మళ్ళీ తనే "తెలీకపోతే బాధలేదు. ఒకవేళ తెలిస్తే ఆ రహస్యం మీతోనే అంతమయిపోవాలి. నాకు తెలియని రహస్యం ఇంకెవ్వరికీ తెలిసి వుండటానికి వీల్లేదు. మీ ఇద్దరినీ చంపినా ఆ రహస్యం తెలిసిన నరేంద్రను సులభంగా వదలను. అండమాన్ దీవులకు వెళ్ళయినా కలుసుకుంటాను. ఆ రహస్యం తెలుసుకుంటాను" అని మాట్లాడుతూనే విసురుగా కత్తితో భూపేంద్ర గుండెల్లోకి పొడిచాడు జస్వంత్.

భయంతో వణికిపోయింది రేణు.

చేతులకు - కాళ్ళకు వున్న తాళ్ళని తెంచుకోటానికి ప్రయత్నం చేసింది రేణు. కాని సాధ్యం కాలేదు.

"తొందరపడొద్దు....నిన్ను కూడా పైకి పంపుతాను. నువ్వు కూడా చస్తావు" అంటూ కత్తితో రేణు గుండెల్లో కూడా కసిగా, కక్షగా పొడిచాడు.

కీచుమని అరుస్తూ ప్రాణాలు వదిలింది రేణు.

బలివ్వబోతున్న జంతువులా గింజుకుంది నీలూ.

మతిపోయినవాడిలాగా నవ్వుతున్నాడు జస్వంత్. అతని అనుచరులు కూడా నాయకుడి నవ్వుతో శ్రుతి కలిపారు ఎదురుగా నెత్తురుతో తడిసిన శవాలను చూస్తూ.

ఇక మిగిలింది నీలూ....

"పదండి....ఆ నరేంద్ర ప్రియురాలు అంతు చూడాలి. వజ్రాల రహస్యం గురించి ఆ నీలూకి నిజం తెలిసినా, తెలీకపోయినా చావు తప్పదు" అన్న మాటలు నీలూకి వినపడ్డాయి.

నలుగురూ నీలూని బంధించిన గదివైపుకు నడిచారు.

అది పగలో - రాత్రో తెలీటంలేదు. ఆ పాతాళ

గృహంలో మాత్రం కాగడా వెలుగుతూనే వుంది నిశ్చలంగా —

# 32

సెంట్రీ తిరుగుతున్న బూట్ల చప్పుడు గట్టిగా వినపడుతుంది. నరేంద్రకు వస్తున్న నిద్రను ఆ చప్పుడు చెదరగొడుతోంది. అయినా అతను నిద్రపోయే ప్రయత్నం చేస్తూనేవున్నాడు.

మృత్యుదీవి కళ్ళముందు కదిలింది కళ్ళు మూసుకుంటే. రాక్షసుడిలాగావున్న ఆ దీవి మనిషి—ఎర్ర రంగు విష పక్షులు వాటికి బలైపోయిన సాటి ఖైదీలు అంతా ఒక్కసారి గుర్తుకొచ్చారు.

చివరగా అతనికి బలదేవ్ గుర్తుకొచ్చాడు.

బలదేవ్:: నయవంచకుడు. తనతో ఒక ప్రయోజనం కోసం స్నేహాన్ని నటించాడు. వజ్రాల రహస్యం తెలుసుకోటానికి తనతో అండమాన్ దీవులకు బయల్దేరాడు. చివరకు ఆ రహస్యం తెలుసుకుని చచ్చిపోయాడు.

సెంట్రీ - నరేంద్ర గది దగ్గిర ఆగిపోయాడు.

"నిద్ర పోలేదా?" అడిగాడు.

"రావటంలేదు. మృత్యుదీవి కళ్ళముందు కదులుతోంది" అన్నాడు నరేంద్ర.

"అవును. నువ్వు చెప్పినప్పుడు నాకు భయం కలిగింది. ఆ దీవిలో మీరెట్లా బతికున్నారో ఆశ్చర్యంగా వుంది" అన్నాడు సెంట్రీ....

"సృష్టి చాలా చిత్రమైనది. ఆ దీవిలో ప్రాణాలుతీసే విష పండ్లతోపాటు ప్రాణాలుకాపాడే నీలిరంగు దుంపలు-నీటికాయలున్న మొక్కలు కూడ వున్నాయి. అవి లేకుండా వున్నట్లయితే మేం ఆకలితో మాడి చచ్చిపోయే

# అపరాధ పరిశోధన పోటీ-225

ఈ క్రిందకొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-4-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూన్ '87 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవల క్రికెట్ చూడాటానికి ఇండియా వచ్చిన విదేశీనేత—? (శ్రీలంక, పాకిస్థాన్)
2. ఒక అపాయం నుండి తప్పించుకోవాలంటే ఇది వుండాలి—? (బుద్ధిబలం, కండబలం)
3. మంచి ఆరోగ్యానికి రోజూ ఉదయం ఇది చేయాలంటారు—? (వ్యాయామం, ఆసనాలు)
4. ఈ నగర మేయరు ఇటీవలనే వివాహితుడైనాడు—? (బొంబాయి, హైద్రాబాదు)
5. ఇవి ప్రజల దాహం తీరుస్తున్నాయి—? (బోరు వెల్స్, రిజర్వాయర్లు)

వాళ్ళం."

"నిజమే....ఆ నీలిరంగు దుంపలు ఇక్కడ కూడా వున్నాయి....అవి బాగుంటాయి." అన్నాడు పెంట్రీ.

"ఆ మొక్కలకు అడుగున నీలిరంగు దుంపలు వుంటాయని కూడా మాకు తెలీదు. స్టీఫెన్‌గారు చెప్పాడు. విషపండ్లు గురించి కూడా ఆయనే చెప్పాడు. లేకపోతే వాటిని తిని అంతా ప్రాణాలు పోగొట్టుకునేవాళ్ళం. ఆయనే మా అందర్నీ రక్షించాడు. కాని ఆయన్ని ఆ విషపక్షి బారినుండి మేం రక్షించుకోలేకపోయాం" అన్నాడు బాధగా నరేంద్ర.

పెంట్రీకూడా బాధపడి మళ్ళీ రెండుసార్లు బూట్లు చప్పుడు చేసుకుంటూ అటూ ఇటూ తిరిగివచ్చాడు.

మళ్ళీ నరేంద్ర గదిముందు ఆగి చిన్నగా "ఎడ్వర్డ్ గారు రెండుమూడుసార్లు నిన్ను ప్రత్యేకంగా పిలిచి మాటలాడారు కదా? ఎందుకు?" అడిగాడు చిన్నగా.

"మొదటిసారి మృత్యుదీవి గురించి అక్కడ స్టీఫెన్ గారి మరణం గురించి తెలుసుకోటానికి కబురు చేశారు. తర్వాత జంతువుల వేటగురించి మాట్లాడటానికి పిలిచారు" అన్నాడు.

"నీకు వేట తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాడు పెంట్రీ.

తల వూపాడు నరేంద్ర.

"ఐతే నువ్వు ఎడ్వర్డుగారికి బాగా ఆప్తుడికిందనే లెక్క. ఆయనకు వేటాడటం అంటే బాగా ఇష్టం...." అన్నాడు పెంట్రీ.

నరేంద్ర మాట్లాడకుండా వున్నప్పుడు "ఐతే ఎడ్వర్డు గారు నీతో ఏమీ చెప్పలేదా?" అనడిగాడు.

"ఏ విషయం గురించి?"

# శ్రీ గణేశ్ బుక్ హౌస్

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ

మా వద్ద సుప్రసిద్ధ రచయితల, రచయిత్రుల సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య, స్కూలు, కాలేజి విద్యార్థులకు కావలసిన అచ్చు పుస్తకములు, ఎక్సర్‌సైజ్ పుస్తకములు

మరియు

రామాయణం, భారతం,

భాగవతం, దేవీ భాగవతం

ఇంకా

హిందీ, ఇంగ్లీషు

నవలలు లభించును.

తప్పక విచ్చేయండి!

నేడే మా కేటలాగు కొరకు వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(పాత కూరగాయల మార్కెట్ వద్ద)

రాజమండ్రి - 533 101.

"మీ అదృష్టం బాగుంటే మీ అందరికీ స్వేచ్ఛ లభి స్తుంది. ఈ సెల్యులర్ జైలునుండి విముక్తి కలుగు తుంది" అన్నాడు సెంట్రీ చిన్నగా.

"నిజంగానా!" ఆశగా అడిగాడు నరేంద్ర....

"అవును .... అంతా అనుకొంటున్నారు. ఎట్లా వుంటుందో మీ అదృష్టం."

"మమ్మల్ని వదిలేస్తారా జైలునుండి."

"ఆ....వదిలేస్తారు."

"ఎవరు? ఎందుకు వదిలేస్తారు?"

"అదొక రహస్యం....ఎవరితో చెప్పకు.... జపాన్ వాళ్ళు ఈ దీవిమీద దండయాత్ర చేస్తారని అనుకుం టున్నారు. వాళ్ళు ఈ దీవిని ఆక్రమించుకునే అవకాశాలు కూడా వున్నాయి. వాళ్ళు ఈ దీవిని ఆక్రమించుకుంటే బ్రిటిష్‌వాళ్ళు బంధించిన ఖైదీలను వాళ్ళు వదిలెయ్యవచ్చు. అటువంటి అవకాశం వుంది" అన్నాడు సెంట్రీ....

కొంచెం సేపటికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఎంత ప్రయత్నం చేసినా నరేంద్రకు నిద్ర రాలేదు. సెంట్రీ చెప్పిన ఆ వార్త అతన్ని నిద్రకు దూరం చేసింది.

జపాన్‌వాళ్ళు అండమాన్స్ దీవులమీద దండయాత్ర చేస్తారా? వాళ్ళు దీవుల్ని ఆక్రమించుకునే అవకాశం కూడా వున్నదా? వాళ్ళు సెల్యులర్ జైల్లోవున్న ఖైదీల నందరినీ వదిలేస్తారా?

ఇదంతా నిజంగా జరుగుతుందా?

జరిగితే అదృష్టవంతుడే—బిలాస్‌పూర్‌కు వెళ్ళి తన వాళ్ళందరినీ కలుసుకోవచ్చు.

నరేంద్ర ఆరాత్రి ఈ ప్రపంచంలో లేని నీలూతో

# వెలువడింది!

విడుదలైన ప్రతిచోటా సంచలనం కలిగిస్తున్న
ఆంధ్రుల ఆహ్లాద రచయిత

మల్లాది వెంకట కృష్ణమూర్తి
తాజా నవల

## ఒక నువ్వూ-ఒక నేనూ

వెల: రు. 25

తప్పక చదవండి!

నేడే అడ్వాన్సుతో పాటు ఆర్డర్సు పంపండి.
పోస్టు ఖర్చులు పూర్తిగా మీరే భరించుకోవలెను.

శ్రీ మహాలక్ష్మి బుక్ డిపో
మ్యూజియం రోడ్, గవర్నరు పేట,
విజయవాడ-520 002.

రంగుల కలల్ని ఆహ్వానించాడు.

సెంట్రీ బూట్లు చప్పుడు అక్కడి నిశ్శబ్దాన్ని చెదర గొడుతూనే వుంది.

## 33

"నువ్వు నాతో బయటకు వస్తున్నావు" అన్నాడు ఎడ్వర్డ్—నరేంద్రతో.

ఆయన్ని ఆశ్చర్యంగా చూశాడు నరేంద్ర.

ఎక్కడికి? అని అతను అడక్కముందే ఎడ్వర్డ్ అన్నాడు - "నీ బాధ్యత నాదే .. నీ మీద నాకు నమ్మకం వుంది. నీలో నాకు మంచితనం, నిజాయితీ కనపడ్డాయి. అందుకే ఈ జైలునుండి నీతో వేటకు తీసుకెళుతున్నాను, పారిపోయే ప్రయత్నం చెయ్యవని నాకు తెలుసు."

నరేంద్ర మాట్లాడలేదు.

జైలునుండి ఇద్దరూ బయటకు వచ్చిన తర్వాత గుర్రం కట్టిన బండిలో దీవి చివరివైపుకు వెళ్ళారు.

ఎడ్వర్డ్ భుజానికి తుపాకీ వున్నది.

దార్లో ఎడ్వర్డ్ మాట్లాడలేదు. ఆ బండీలో పొడుగ్గా వున్న కత్తికూడా వున్నది.

ఇద్దరూ బండి దిగారు. దాన్ని అక్కడే వుంచారు,

అక్కడినుండే అడవి మొదలవుతోంది....దట్టంగా వున్న చెట్లు పొడుగ్గా వున్నాయి.

"ఈ దీవిలో పులుల్లాంటి జంతువులు వున్నట్టుగా ఎవ్వరూ చెప్పలేదు....ఐనా తోడేళ్ళలాంటి క్రూరజంతువులు వున్నాయి. కొన్నిసార్లు నేను వాటినే వేటాడాను." అన్నాడు ఎడ్వర్డ్ నడుస్తూ.

"ఈ దీవిలో చెట్లుకూడా కొన్ని మృత్యుదీవిలో చెట్ల

# "హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్ధ సంవత్సర చందా రు. 90 చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించ నవసరం లేదు.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు V.P. ద్వారా పత్రికలు తెప్పించు కునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు. రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

**హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!**

లాగానే వున్నాయి" అన్నాడు నరేంద్ర.

"సాధారణంగా ఈ ప్రాంతంలో ఇక్కడికి దగ్గర్లో వున్న దీవులన్నింటిలో కొన్నిరకాల చెట్లు పెరుగుతాయి. ఇప్పటికీ ఎవరికీ తెలియని దీవులు చాలావున్నాయి" చెప్పాడు ఎడ్వర్డ్.

వాళ్ళు కొంచెం లోపలగా వచ్చారు.

అడవిలో తుపాకీవేట గురించి మాట్లాడుతున్నాడు ఎడ్వర్డ్....వింటున్నాడు నరేంద్ర.

అతనికి భిలాస్‌పూర్ అడవి గుర్తుకొస్తూంది.

గాల్లో తేలివస్తున్న వాసనలను అతను పసికడుతున్నాడు. రెండు నిముషాలు గడిచిన తర్వాత వున్నట్టుండి ఆగిపోయాడు నరేంద్ర.

"ఆగిపోయావేం?" రెండడుగులు ముందుకువేసి ఆగిపోయి అడిగాడు ఎడ్వర్డ్.

"మన వైపుకు ఎలుగుబంటి వస్తోంది."

"ఎలుగుబంటా!?"

"అవును....ఇటే వస్తోంది....ఈ వైపుకు రండి.... ఈ చెట్ల చాటున దాక్కుందాం."

"నీకు తప్పకుండా తెలుసా? ఎలా తెలుసు? అరుపు వినపడిందా?" కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు ఎడ్వర్ట్.

"వాసన వస్తోంది....వాసన్నిబట్టి జంతువుని తెలుసుకోగలను" చెప్పాడు నరేంద్ర.

"ఐతే ఇద్దరం ఒక్కచోటునే వుండొద్దు. నువ్వు ఆ చెట్టు చాటున దాక్కో....నేనిక్కడ వుంటాను."

తల వూపి ఎడ్వర్డ్‌కు కొంచెం దూరంలో వున్న చెట్టు చాటుకు వెళ్ళి నిలబడ్డాడు నరేంద్ర. ఎడ్వర్డ్ కూడా ఒక చెట్టు పక్కకు వెళ్ళి తుపాకీని పేల్చటానికి సిద్ధంగా

# ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-4-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జూన్ '87 నెల సంచికలో ప్రకటిస్తాము.

## ఫిబ్రవరి '87 పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి '87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

**కడలిలో కలిసెను నెచ్చెలి బ్రతుకు!**
**కలబడి నిలుపుకో ప్రాణాన్ని తుదకు!!**

పంపినవారు: శ్రీమతి యస్. ఉషారాణి, టి 2-481,
III సెక్టర్ కాలనీ, గోదావరి ఖని-505 211.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

**భయం భయం చూపు!**
**అభయం ఇస్తా ఆగు!!**

పంపినవారు: శ్రీ వింజమూరి శ్రీనివాస్,
ఎల్. ఐ. సి. ఆఫ్ ఇండియా,
హన్మకొండ-1.

గురిచూసుకుంటున్నాడు.

ఒక నిముషం గడిచింది.

గాల్లో ఎలుగుబంటి వాసన వస్తోంది.

ఎడ్వర్డ్‌కు ఏదో చెప్పాలని కొంచెం ముందుకు వచ్చిన నరేంద్ర ఉలిక్కిపడ్డాడు. అతని కళ్ళల్లో ఆందోళన తళుక్కు మన్నది ఒక్కసారి.

గురి చూసుకోవటంలో నిమగ్నమైపోయిన ఎడ్వర్డ్ పై నించి కొండచిలువ రూపంలో వస్తున్న ప్రమాదాన్ని గుర్తించలేకపోయాడు. అప్పటికే చెట్టు కొమ్మను చుట్టు కున్న కొండ చిలువ ఆయన తల మీదకు నోరు తెరిచి వచ్చేసింది.

అంతే - ఒక సెకండ్ కూడా ఆలస్యం చెయ్యలేదు నరేంద్ర. బాగా లాగి వదిలిన బాణంలా రివ్వున పరిగెత్తాడు కత్తి పైకెత్తి. వెళుతూనే కత్తిని కొండచిలువమీదకు గురి చూసి విసిరాడు.

కంగారుపడ్డాడు ఎడ్వర్డ్. నరేంద్ర తనని చంపటానికి వస్తున్నాడని భయపడ్డాడు.

పాము తల తెగి దూరంగా పడింది.

ఎడ్వర్డ్ యేదో మాట్లాడబోయాడు కాని అప్పటికే చెట్ల మధ్య నుంచి వచ్చిన ఎలుగుబంటి ఎగిరి ఎడ్వర్డ్ మీదకు దూకింది.

పెద్దగా అరిచాడు ఎడ్వర్డ్....చేతిలోని తుపాకీ జారింది.

ప్రమాదాన్ని గుర్తించిన నరేంద్ర ఒక చేత్తో పక్కకు లాగాడు హటాత్తుగా....ఎలుగుబంటికి ముందుకు వెళ్ళి వెంటనే వెనక్కు తిరిగింది కోపంగా....ఐతే అది మళ్ళీ వాళ్ళమీదకే దూకి అవకాశాన్ని నరేంద్ర దానికి ఇవ్వ

## ఉగాది శుభాకాంక్షలతో

ఏప్రెల్ 1 విడుదల

ప్రతి మనిషి గుండె తలుపులు ఓర వాకిలిగా తెరిచే ఉంటాయి, ఏవరి పాదాల సవ్వడి కోసమో ఎదురు చూస్తున్నట్లు!

పుస్తకం మూసిన తరువాత గూడా మీ గుండెల్లో సవ్వడి చేసే నవల—

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి

# చీకటిలో చిరుదీపం

వెల : రు. 25

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డర్సు పంపండి. పోస్టు ఖర్చులు పూర్తిగా మీరే భరించుకోవలెను.

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520 002.

లేదు. వెనక్కి తిరుగుతూ వున్నప్పుడే కత్తితో దాని వెన్నుమీద గుచ్చాడు. సగంవరకు దిగిపోయింది కత్తి.... నెత్తురు రివ్వున బయటకు వచ్చింది.

పెద్దగా అరుస్తూ కూలిపోయింది ఎలుగుబంటి.

కత్తిని బయటకు లాగి ఇంకొకసారి పొడిచాడు....

రెండో కత్తిపోటుకు దాని ప్రాణం ఎగిరిపోయింది.

గొప్ప విభ్రాంతి నుండి తేరుకున్న ఎడ్వర్డ్ గబుక్కున వచ్చి కృతజ్ఞతగా నరేంద్రను కౌగిలించుకున్నాడు.

"నువ్వు నిజంగా సాహసవంతుడివి. వేటాడే మనుషులకు కావలసిన చొరవ, తెగింపు నీలో వున్నాయి. నీ పక్కన వున్న ఏ మనిషికీ వేటలో ప్రమాదం రాదు. నా ప్రాణాలు కాపాడావ్....నా కృతజ్ఞతలు" అన్నాడు సంతోషంతో....

అప్పటికే చెట్టుకొమ్మను చుట్టుకున్న కొండచిలువ శరీరం పూర్తిగా కిందపడిపోయింది.

నరేంద్ర మాట్లాడలేదు.

"నా మీద నమ్మకంతో వేటకు నన్ను తోడుగా తీసుకు వచ్చారు. ఒక ఖైదీని నమ్మకంతో తీసుకువచ్చిన మీ ప్రాణాలు కాపాడటం గొప్ప విషయం కాదు" అన్నాడు ఒక్క నిముషం ఆగి —

"నాకు సంతోషంగా వుంది. ఇంత సాహసం వున్న మనిషివి ఒక వ్యక్తిని చంపి జైలుకు వచ్చావంటే నాకు నమ్మకంగా లేదు" అన్నాడు ఎడ్వర్డ్.

(ఇంకా వుంది)

---

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page

Regd.no:H/HD-48
'PRABHAKAR'